సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 235

గురువారం 16-11-2023



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి.
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'



SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL









వరల్డ్ రికార్డ్

ఎవరెస్ట్ జంప్

41 ఏళ్ల భారతీయ మహిళా స్కై డైవర్ శీతల్ మహాజన్ ఎవరెస్ట్ ఎదుట పక్షిలా ఎగిరారు. హెలికాప్టర్‌లో ఎవరెస్ట్ ఒడిలో 21,500 అడుగుల ఎత్తు నుంచి దూకి ఊపిరి బిగపట్టి చూసే జంప్‌ను పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాధించారు. నవంబర్ 13న ఆమె ఈ ఘనత సాధించారు. ఆ సాహసం వెనుక కథనం.

'స్కై డైవింగ్ చేసి కాళ్లూ చేతులూ విరిగితే నిన్ను ఎవడు పెళ్లి చేసుకుంటాడు' అని ఇంటివాళ్ల చేత చివాట్లు తిన్న అమ్మాయి రికార్డుల మీద రికార్డులు సాధిస్తూ ఇంటివారినే కాదు ప్రపంచాన్ని కూడా నివ్వెర పరుస్తూనే ఉంది.

41 ఏళ్ల శీతల్ మహాజన్ ఎవరెస్ట్ చెంత సముద్ర మట్టానికి 21,500 అడుగుల ఎత్తున హెలికాప్టర్‌లో నుంచి జంప్ చేసి 17,444 అడుగుల ఎత్తు మీదున్న కాలాపత్థర్ అనే చోట సేఫ్‌గా ల్యాండ్ అయ్యింది. ఊపిరి బిగ పట్టి చూడాల్సిన సాహసం ఇది. గడ్డ కట్టే చలిలో, ఆక్సిజన్ అందని ఎత్తు నుంచి, ఎవరెస్ట్ సానువుల వంటి ప్రమాదకరమైన చోట ఒక మహిళ ఇలా జంప్ చేయడం ప్రపంచ రికార్డు. ఇప్పటివరకూ ప్రపంచంలో ఏ మహిళా ఇంత ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేయకపోవడం మరో రికార్డు. ఫ్రాన్స్‌కు చెందిన దిగ్గజ స్కై డైవర్ పాల్ హెన్రీ ఇందుకు గైడ్‌గా వ్యవహరిస్తే నీతా అంబానీ, అనంత్ అంబానీ తదితరులు స్పాన్సరర్స్‌గా వ్యవహరించారు.



స్త్రీలు ఎందుకు చేయలేరు?

శీతల్ మహాజన్‌ది పూణె. తండ్రి కమలాకర్ మహాజన్ టాటా మోటార్స్‌లో ఇంజినీర్‌గా చేసేవాడు. ఇంటర్ చదువుతూ ఉండగా 'నీ చదువుతో నువ్వు హ్యాపీగా ఉన్నావా?' అని తండ్రి అడిగిన ప్రశ్న ఆమెలో సంచలనం రేపింది. 'సైన్స్ చదవాలనుకుని చేరాను. కాని ఇలా చదవడం కాకుండా ఇంకేదో చేయాలి. ఎవరూ చేయనిది చేయాలి. అదే నాకు సంతోషాన్ని ఇస్తుందని గ్రహించాను' అంటుంది శీతల్. ఆ తర్వాత ఆమె గూగుల్ చేయడం మొదలెట్టింది– భారతీయ స్త్రీలు ఎక్కువగా లేని రంగంలో ఏదైనా సాధించాలని. అలా తారసపడినదే స్కై డైవింగ్. 'అప్పటికి మన దేశంలో స్కై డైవింగ్‌లో రేచల్ థామస్ వంటి ఒకరిద్దరు తప్ప ఎక్కువ మంది స్త్రీలు లేరు. నేనెందుకు చేయకూడదు అనుకున్నాను. 22 ఏళ్ల వయసులో నార్త్‌పోల్‌లో మొదటి స్కై డైవింగ్ చేశాను. ఈ ఘనత సాధించిన మొదటి భారతీయ స్త్రీని నేనే' అంటుంది రేచల్.

15 లక్షల ఖర్చుతో

2004లో శీతల్ తండ్రి జీతం 18 వేలు. కాని ఆ సంవత్సరం శీతల్ నార్త్‌పోల్‌లో స్కై డైవింగ్ చేయాలని నిశ్చయించుకున్నప్పుడు అందుకు అయ్యే ఖర్చు 15 లక్షలు. దాని కంటే ముందు 'నువ్వు ఆడపిల్లవు. ఇలాంటి వాటికి పనికిరావు' అన్నారు అంతా. 'నన్ను ఆ మాటలే ఛాలెంజ్ చేశాయి' అంటుంది శీతల్. అప్పటివరకూ శీతల్ విమానం కూడా ఎక్కలేదు. పారాచూట్ జంప్ అసలే తెలియదు. ఏ ట్రైనింగ్ లేదు. అయినా సరే స్పాన్సరర్లను వెతికి నార్త్‌పోల్‌కు వెళ్లింది. అయితే అక్కడి ఇన్‌స్ట్రక్టర్లు ఆమెను వెనక్కు వెళ్లమన్నారు. 'ఇంతకుముందు ఒక మహిళ ఇలాగే నార్త్‌పోల్‌కు వచ్చి జంప్ చేయబోయి మరణించింది. అందుకని వారు అంగీకరించలేదు. నేను పట్టువదలక వారంపాటు అక్కడే ఉండి మళ్లీ సంప్రదించాను. ఈసారి అంగీకరించారు' అంది శీతల్. 2004 ఏప్రిల్ 18న నార్త్‌పోల్‌లో మైనస్ 37 డిగ్రీల ఉష్ణోగ్రతలో తన మొదటి జంప్ చేసింది. అలా లోకానికి సాహసిగా పరిచయమైంది.

ఎన్నో రికార్డులు

ఆ తర్వాతి నుంచి శీతల్ స్కై డైవింగ్‌లో రికార్డులు సాధిస్తూనే ఉంది. ఆ వెంటనే ఆమె అంటార్కిటికాలో స్కై డైవింగ్ చేసింది. ఇప్పుడు ఎవరెస్ట్ శిఖరం ఎదుట స్కై డైవింగ్ చేయడంతో భూమ్మీద ఉన్న రెండు ధ్రువాలతో పాటు మూడో ధ్రువం వంటి ఎవరెస్ట్ దగ్గర కూడా జంప్ చేసిన ఏకైక మహిళగా రికార్డు స్థాపించింది. అంతేకాదు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన వైభవ్ రాణెను హాట్ ఎయిర్ బెలూన్‌లో 5,800 అడుగుల ఎత్తులో వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. శీతల్‌కు కవల అబ్బాయిలు. 'పెళ్లయ్యి పిల్లలు పుట్టాక మహిళ జీవితం కెరీర్ పరంగా అంతమైనట్టేనని అందరూ అనుకుంటారు. నేను కూడా ఆగిపోతానని కొందరు ఆశపడ్డారు. నేను ఆ తరహా కాదు. పిల్లల్ని తల్లిదండ్రులు కలిసి పెంచాలి. తల్లి మాత్రమే కాదు. నేను నా పిల్లల్ని పెంచుతాను... అలాగే నా కెరీర్‌ని కూడా కొనసాగిస్తాను. నిజానికి పెళ్లయ్యాకే అమెరికా వెళ్లి స్కై డైవింగ్‌లో ఉత్తమ శ్రేణి ట్రైనింగ్ తీసుకున్నాను' అంటుందామె. ఇప్పుడు పూణెలో స్కై డైవింగ్ అకాడెమీ తెరిచి స్కై డైవింగ్‌లో శిక్షణ ఇస్తోంది.

బయటకు రండి

స్త్రీలు నాలుగ్గోడల నుంచి బయటకు వచ్చి లోకాన్ని చూడాలి... తమలోని సామర్థ్యాలను తెలుసుకుని వాటిని సానబట్టుకోవాలి... విజయం సాధించాలి... భారతీయ స్త్రీలు సాధించలేనిది లేదు... వారికి కావాల్సింది అవకాశమే అంటున్న శీతల్ కచ్చితంగా ఒక గొప్ప స్ఫూర్తి.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వచ్చిన తరువాత చాలా ప్రాంతాల మధ్య దూరం తగ్గిపోయింది. కానీ టికెట్ ఖరీదు కాస్త ఎక్కువగా ఉండడంతో కొంతమంది దాని దరిదాపుల్లోకి కూడా వెళ్లడం లేదు. ఇలా వందేభారత్‌కు దూరంగా ఉన్న గ్రామానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను తీసుకొచ్చి అబ్బుర పరుస్తోంది పూర్ణిమా ముర్ము. అవును మీరు కరెక్ట్‌గానే చదివారు. మారుమూల గ్రామానికి వందే భారత్‌ను తీసుకొచ్చి అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది పూర్ణిమ.

వందే సృజన!



జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు పక్కనే ఉన్న ఓ గ్రామం పేరు జొండరాగోడ. ఈ గ్రామానికి చెందిన విద్యార్థి పూర్ణిమా ముర్ము. గిరిజనులు ఎక్కువ ఉండే ఈప్రాంతంలో దీపావళి సమయంలోనే సోహ్రాయ్ పండుగను ఎంతో వేడుకగా జరుపుకుంటారు. దీపావళి రెండో రోజున జరుపుకునే ఈ పండక్కి గిరిజనులంతా... తమ మట్టి ఇళ్లను శుభ్రం చేసి, రకరకాల సాంప్రదాయ డిజైన్లతో పెయింట్ వేస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పూర్ణిమ తన ఇంటిని వందే భారత్ చిత్రంతో నింపేసింది.



మట్టింటికి ముచ్చటగా..

గ్రామంలో ఎంతో సంతోషంగా ఆర్భాటంగా జరుపుకునే పండగను మరింత బాగా జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో హైస్పీడ్ ట్రైన్‌తో ఇంటిని అలంకరించాలనుకుంది పూర్ణిమ. గ్రామవాసులు సహజసిద్ధ పదార్థాలతో తయారు చేసే రంగుల నుంచి.. తెలుపు, నీలం, నల్లరంగులు తీసుకుని ఇంటి గోడపైన వందేభారత్ రైలు బొమ్మను చక్కగా చిత్రించింది. రైలు బొమ్మ ఆకర్షణీయంగా ఉండడంతో గ్రామస్థులు పూర్ణిమ ఇంటిని చూసేందుకు ఎగబడుతున్నారు.

''గ్రామంలోని చాలామందికి 'వందేభారత్ రైలు' ఎలా ఉంటుందో తెలియదు. దీని గురించి వినడమేగాని చూసింది లేదు. అందుకే అందరికీ వందేభారత్‌ను పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో రైలు బొమ్మను చిత్రించాను. నిజానికి నేను కూడా ఇప్పటిదాకా వందేభారత్ చూసింది లేదు. ఫోన్‌లో వందే భారత్ బొమ్మను చూసి గీశాను. అచ్చం వందే భారత్‌ను పోలి ఉండడంతో నా పెయింటింగ్ గురించి తెలిసిన వారంతా చూడడానికి వస్తున్నారు. రైలు పెయింటింగ్ వేసిన తరువాత ఇంట్లో ఉన్నట్టుగా గాక, ట్రైన్‌లో ఉన్నట్టు ఉంది'' అని సంతోషంగా చెబుతోంది పూర్ణిమ.

వేడుకల్లో వందేభారత్ రైలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పెయింటింగ్‌ను చూసిన గ్రామస్థులంతా.. ''మేమయితే ఇంతవరకు ఈ రైలు ఎక్కలేదు. కనీసం ఇలాగైనా చూడగలుగుతున్నాం. వందే భారత్‌ను పూర్ణిమ చక్కగా వేసింది'' అని మెచ్చుకుంటున్నారు. పిల్లలైతే కొత్త రైలు తమ ఊరు వచ్చిందని తెగ సంబర పడిపోతున్నారు.

సినిమా



సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హీరో మహేశ్ బాబు, నమ్రత, వీకే నరేష్, సుధీర్ బాబు, మంజుల, అశోక్ గల్లాతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొని, కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

శైలు పాత్ర సవాల్‌గా అనిపించింది

- పాయల్ రాజ్‌పుత్

''మంగళవారం' సినిమాలో నేను చేసిన శైలు పాత్ర సవాల్‌గా అనిపించింది.. అందులో నటించడం చాలా కష్టమైంది. ఎందుకంటే.. శైలు పాత్రకి, నిజ జీవితంలో నాకు 10శాతం కూడా సంబంధం లేదు. ఈ చిత్రంలో చాలా భావోద్వేగాలున్నాయి. చాలా సున్నితమైన అంశాన్ని చర్చించాం. అజయ్ భూపతిగారిపై నమ్మకంతో ఆయన చెప్పినట్లు చేశా. సినిమా చూశాక శైలు పాత్రపై ప్రేక్షకుల్లో సానుభూతి వస్తుంది'' అని హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ అన్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా నటించిన చిత్రం 'మంగళవారం'. ఎం.సురేష్ వర్మ, స్వాతి రెడ్డి గునుపాటి నిర్మించిన ఈ చిత్రం రేపు(శుక్రవారం) విడుదలఅవుతోంది. ఈ సందర్భంగా



పాయల్ రాజ్‌పుత్ మీడియాతో మాట్లాడుతూ...

● 'ఆర్ఎక్స్ 100' సినిమా తర్వాత నాకు సరైన హిట్ రాలేదు. ఆ చిత్రంతో నాకు సూపర్ హిట్ ఇచ్చిన అజయ్ సర్‌కి ఫోన్ చేసి, 'సార్... నాకు మరో సినిమా అవకాశం ఇవ్వండి.. నా కెరీర్‌కి హెల్ప్ అవుతుంది' అంటూ వెంటపడేదాన్ని. 'చిన్న చిన్న పాత్ర కాకుండా మంచిది వస్తే తప్పకుండా ఫోన్ చేస్తా' అని చెప్పారాయన. 'మంగళవారం' చిత్రానికి ఆడిషన్స్ చేసి, నేను సరిపోతానని ఎంచుకున్నారాయన. ఈ మూవీ తెలుగులో నాకు టర్నింగ్ పాయింట్, కమ్ బ్యాక్ అవుతుందని ఆశిస్తున్నా.

● అజయ్‌గారు శైలు పాత్ర గురించి చెప్పినప్పుడు నిజమేనా? అని అడిగా. నేను ఇంటెన్స్, డార్క్ రోల్స్ చేశాను కానీ ఇటువంటి సినిమా, క్యారెక్టర్ చేయలేదు. శైలు పాత్ర హెయిర్ స్టైల్, మేకప్ కోసం ప్రతి రోజూ రెండు గంటలు పట్టేది. అవుటాఫ్ బాక్స్ సినిమా చేశాం. ఇండియాలో ఈ టైపు పాత్ర, కథతో ఎవరూ ఇప్పటి వరకూ సినిమా చేయలేదు. ఈ సినిమాని ఎక్కడా రాజీ పడకుండా తీసిన సురేష్ వర్మ, స్వాతి రెడ్డిగార్లకు థ్యాంక్స్.



● నాగచైతన్య

థ్రిల్లింగ్ దూత

నాగచైతన్య నటించిన తొలి వెబ్ సిరీస్ 'దూత'. ఎనిమిది ఎపిసోడ్‌ల సూపర్ నేచురల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ వెబ్ సిరీస్‌కు విక్రమ్ కె.కుమార్ దర్శకత్వం వహించారు. పార్వతి, ప్రియా భవానీ శంకర్, ప్రాచీ దేశాయ్ కీలక పాత్రల్లో నటించారు. ఇందులో సక్సెస్‌ఫుల్ జర్నలిస్ట్ సాగర్ పాత్రలో నటించారు నాగచైతన్య. శరత్ మరార్ నిర్మించిన ఈ వెబ్ సిరీస్ డిసెంబరు 1 నుంచి అమేజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ''అనూహ్యమైన కథ, కథనాలతో 'దూత' సిరీస్ వీక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు శరత్ మరార్, ప్రైమ్ వీడియో ప్రముఖ ప్రతినిధి అపర్ణ పురోహిత్. ఈ వెబ్ సిరీస్‌కు సంగీతం: ఇషాన్ చాబ్రా, కెమెరా: మికోలజ్ సైగుల.



"కోటబొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగిడి లింగిడి..' పాట ఇంత వైరల్ కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ సాంగ్ వల్లే నాకు మరింత గుర్తింపు వచ్చింది. అలాగే సినిమాకు కూడా ఇంత మంచి బజ్ వచ్చింది. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది" అని హీరోయిన్ శివానీ రాజశేఖర్ అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రలు పోషించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వం వహించారు. 'బన్నీ' వాస్, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివానీ రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

గ్లామర్ పాత్రలు చేస్తా

- శివానీ రాజశేఖర్

● 'నెంజుకు నీది' అనే తమిళ చిత్రంలో నేను గిరిజన అమ్మాయిగా చేశా. నా నటన నచ్చి, 'కోటబొమ్మాళి పీఎస్' కథని వినిపించారు తేజామార్నిగారు. మలయాళ హిట్ చిత్రం 'నాయట్టు' కి 'కోటబొమ్మాళి పీఎస్' రీమేక్ అయినప్పటికీ తెలుగు ప్రేక్షకులకు అర్థమయ్యేలా కథలో మార్పులు చేశారు. ఒరిజినల్ చూసినవారు కూడా ఈ సినిమాని ఫ్రెష్‌గా ఫీల్ అవుతారు. ఇందులో లేడీ పోలీస్ కానిస్టేబుల్ పాత్ర చేశాను. ఈ సినిమా కోసం శ్రీకాకుళం యాస కూడా నేర్చుకున్నా.

● ఈ మూవీలో శ్రీకాంత్‌గారితో పనిచేయడం వల్ల దర్శకుడికి గౌరవం ఇవ్వడం, సమయానికి సెట్‌కి రావడం వంటి చాలా విషయాలు నేను, రాహుల్ నేర్చుకున్నాం. వరలక్ష్మీ శరత్ కుమార్‌గారి పాత్ర కూడా ఇందులో హైలైట్‌గా ఉంటుంది. ఈ సినిమాని ఇంత గ్రాండ్‌గా తీసిన 'బన్నీ' వాస్, విద్యా కొప్పినీడిగార్లకు కృతజ్ఞతలు. నటిగా గ్లామర్ రోల్స్, కమర్షియల్ రోల్స్‌కి నేను సిద్ధం. కానీ, రచయితలు, దర్శకులు అలాంటి పాత్రలు నాకు చెప్పడం లేదు.. వాటి కోసం వేచి చూస్తున్నా.

● చిన్నప్పటి నుంచి అమ్మానాన్నలను(జీవిత–రాజశేఖర్) చూసి పెరగడం వల్ల నాకు, చెల్లికి (శివాత్మిక) ప్రతిదీ నేర్చుకునే విషయంలో అనుభవం వచ్చింది. కష్టపడటమే మన చేతుల్లో ఉంది.. ఫలితం, విజయం అన్నవి వాటంతట అవే వస్తాయి. నా, శివాత్మిక కథల విషయంలో అమ్మ, నాన్న జోక్యం చేసుకోరు. ప్రస్తుతం నాన్న తెలుగులో 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్', అమ్మ తమిళంలో 'లాల్ సలాం' సినిమాలు చేస్తున్నారు. మంచి కథ కుదిరితే మేమంతా కలిసి నటిస్తాం. మణిరత్నంగారి సినిమాలో హీరోయిన్‌లాంటి పాత్ర చేయాలన్నది నా కల'' అన్నారు.



● గణపతి రెడ్డి, సిమ్రాన్, విజయ్ దర్శన్

భయపెట్టే అన్వేషి

విజయ్ ధరణ్, సిమ్రాన్ గుప్తా, అనన్యా నాగళ్ల హీరో హీరోయిన్లుగా నటించిన హారర్ అండ్ కామెడీ ఫిల్మ్ 'అన్వేషి'. వీజే ఖన్నా దర్శకత్వంలో టి. గణపతి రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నటులు అశ్విన్‌బాబు, సోహైల్, చైతన్యారావు, సంపూర్ణేశ్ బాబు అతిథులుగా హాజరై, ఈ చిత్రం విజయం సాధించాలన్నారు. ఈ వేడుకలో హీరో విజయ్ ధరణ్ మాట్లాడుతూ– ''హీరో కావాలని ఓ చిన్న పల్లెటూరు నుంచి మొదలైన నా ప్రయాణంలో అవమానాలు, బాధలు ఎదుర్కొన్నాను. ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను. ఈ మూవీ నిర్మాణంలోనూ కష్టాలు పడ్డాం. కొంతమంది సపోర్ట్ చేయడంతో బయట పడ్డాం. ఈ సినిమా బాగాలేకపోతే నేను గుండు కొట్టించుకుంటాను. వీజే ఖన్నా భవిష్యత్‌లో పెద్ద దర్శకుడు అవుతారు'' అన్నారు. ''అనన్యా నాగళ్ల పాత్ర చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది'' అన్నారు వీజే ఖన్నా. ''ప్రతి ఫ్యామిలీ చూడదగ్గ చిత్రం ఇది'' అన్నారు గణపతి రెడ్డి. 'అన్వేషి' చిత్రం మెప్పిస్తుంది'' అన్నారు సిమ్రాన్ గుప్తా.



● ఐరా, కార్తీక్ రాజు, శశి కిరణ్, సిమ్రాన్

ట్రైలర్ చూశాక సినిమాపై ఆసక్తి పెరిగింది

- శశి కిరణ్ తిక్క

''అథర్వ' ట్రైలర్ చూశాక సినిమా చూడాలనే ఆసక్తి పెరిగింది. ప్రతి విషయాన్ని ఎంతో వివరంగా చూపించారు. పోలీస్ విభాగంలో క్లూస్ టీం గురించి చక్కగా వివరించారు. ఈ చిత్రం విజయం సాధించాలి'' అని డైరెక్టర్ శశి కిరణ్ తిక్క అన్నారు. కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా మహేశ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 1న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శశి కిరణ్ తిక్క, హీరో చైతన్య రావు రిలీజ్ చేశారు. మహేశ్ రెడ్డి మాట్లాడుతూ– ''మా సినిమాలో క్లూస్ టీమ్ గురించి చూపించబోతున్నాం. సురేష్ ప్రొడక్షన్స్‌తో కలిసి భారీ ఎత్తున రాబోతున్నాం'' అన్నారు. ''ఎంతో కష్టపడి ఈ సినిమా తీశాం.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు సుభాష్ నూతలపాటి, కార్తీక్ రాజు. ఈ కార్యక్రమంలో సిమ్రాన్ చౌదరి, ఐరా, సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, కెమెరామేన్ చరణ్ మాట్లాడారు.

రోటి.. కపడా.. కామెడీ



● 'రోటి కపడా రొమాన్స్' ఫస్ట్ లుక్

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ మూవీ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదలైంది. ''వినోద ప్రధానంగా సాగే ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్థన్ రామేశ్వర్, ఆర్ఆర్ ధ్రువన్, వసంత్.జి.

స్పార్క్ నా ఎమోషనల్ జర్నీ

- విక్రాంత్

విక్రాంత్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'స్పార్క్: ఎల్.ఐ.ఎఫ్.ఈ'. ఇందులో మెహరీన్, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్లు. డెఫ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ పతాకంపై లీల నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదల అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకులు హరీష్ శంకర్, మారుతి, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని కోరారు. ఈ వేడుకలో విక్రాంత్ మాట్లాడుతూ– ''అమెరికాలో జరిగిన కొన్ని ఘటనలకు కమర్షియల్



● రుక్సార్, విక్రాంత్, హరీష్ శంకర్, మెహరీన్, లీలారెడ్డి, సుహాసిని

అంశాలు జోడించి 'స్పార్క్' కథ రాసుకున్నాను. నేనే కథ రాసుకుని, హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తానన్నప్పుడు కొందరు వద్దన్నారు. కానీ ఈ సినిమా నా కల. నా కలకు మా కో డైరెక్టర్ స్వామిగారి అనుభవాన్ని జోడించి ఈ సినిమాను పూర్తి చేశాను. కొన్ని కష్టాలు పడ్డాను. లీల ఎంతగానో సపోర్ట్ చేశారు. ఈ సినిమా నాకు పెద్ద ఎమోషనల్ జర్నీ'' అన్నారు విక్రాంత్. ''ఈ సినిమాలో సైంటిస్ట్ రోల్ చేశాను'' అన్నారు సుహాసిని. ''సినిమా చూశాను. బాగా వచ్చింది. ప్రేక్షకులకు కూడా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు లీల.



● 'వెన్నెల' కిశోర్

కామెడీ స్పై

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన స్పై యాక్షన్ కామెడీ 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మురళీ శర్మ ఓ కీలక పాత్రధారి. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితి సోనీ ఈ సినిమాను నిర్మించారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఓ కన్‌ఫ్యూజ్డ్ స్పై ఓ పెద్ద కేసును ఎలా సాల్వ్ చేశాడన్నదే ఈ సినిమా కథనం'' అన్నారు టీజీ కీర్తికుమార్, అదితి సోనీ.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 235
గురువారం 16-11-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'


ఎవరెస్ట్ జంప్
21,500 అడుగుల ఎత్తు నుంచి దూకి రికార్డు సృష్టించిన శీతల్ - ఫ్యామిలీలో


నెల గరిష్టానికి సూచీలు
సెన్సెక్స్ లాభం 742 పాయింట్లు.. 19,650 స్థాయిపైకి నిఫ్టీ - 13లో


గిరిజనుల రుణం తీర్చుకుంటా
గిరిజనుల కోసం రూ. 24 వేల కోట్లతో అమలు చేసే పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు.
వివరాలు 6లో ▸


రణరంగంగా అల్‌-షిఫా
గాజాలోని అల్‌-షిఫా ఆస్పత్రిలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్‌ సైన్యం.. హమాస్‌ మిలిటెంట్ల కోసం ప్రతి గదినీ గాలిస్తోంది.
వివరాలు 6లో ▸


బైడెన్‌తో భేటీ కానున్న జిన్‌పింగ్‌
ఆసియా-పసిఫిక్‌ ఆర్థిక సహకార మండలి సదస్సు కోసం అమెరికా చేరుకున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌.. బైడెన్‌తో భేటీ కానున్నారు.
వివరాలు 6లో ▸


సెకన్‌కు 150 సినిమాలు
ప్రపంచంలోనే హైస్పీడ్‌ ఇంటర్నెట్‌కు చైనా వేదికగా నిలిచింది. 150 సినిమాలను ఒక్క సెకన్‌లో ట్రాన్స్‌మిట్‌ చేయొచ్చు.
వివరాలు 6లో ▸

మాచర్లలో నిర్వహించిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం


ప్రజలతోనే మా పొత్తు



నెరవేర్చిన హామీలే నా ధైర్యం, జనమే నా నమ్మకం

వరికపుడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపనలో సీఎం వైఎస్‌ జగన్‌

- పేద ప్రజల కోసమే వైఎస్సార్‌సీపీ
- 99 శాతం వాగ్దానాలు అమలు చేశాం
- ప్రజల్లో నడవడం, ప్రజల గుండెల్లో ఉండటం మాత్రమే మాకు తెలుసు
- చంద్రబాబు గుండె కరగాలంటే ఎన్ని మానవత్వం ఇంజక్షన్లు ఇవ్వాలో!
- కుప్పం ప్రజలకే నీళ్లు ఇవ్వని వ్యక్తి ఇతర ప్రాంతాలకు మేలు చేస్తాడా?
- చంద్రబాబులా పొత్తులు పెట్టుకోవడం మాకు తెలియదు
- వారిది మోసాల చరిత్ర, వెన్నుపోట్ల చరిత్ర, అబద్ధాల చరిత్ర
- రైతులను, అక్కచెల్లెమ్మలను నిండా ముంచిన ఘన చరిత్ర
- ఈ మోసాల పెద్దమనిషి మాయ మాటలు నమ్మొద్దు.. మన ప్రభుత్వంలో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి

3 లో




'షమీ' ఫైనల్‌

- ప్రపంచకప్‌ తుది పోరుకు టీమిండియా
- 70 పరుగుల తేడాతో కివీస్‌పై భారత్‌ గెలుపు
- 7 వికెట్లతో న్యూజిలాండ్‌ను పడగొట్టిన షమీ
- విరాట్‌ కోహ్లి, శ్రేయస్‌ అయ్యర్‌ సెంచరీలు

12 లో

కింగ్‌ 50


విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్‌ స్టేడియంలో అభిమానుల ఆనందోత్సాహం

ఫ్యాక్ట్‌చెక్‌

కౌలు రైతులకు భరోసానిస్తున్నా బాధేనా?

- విషపు రాతలతో ప్రజలను మభ్యపెట్టేందుకు 'ఈనాడు' యత్నం
- నాలుగున్నరేళ్లలో 25.82 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులు
- ఈ పంటలో నమోదు ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు
- రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం
- అర్హత ఉన్న ప్రతి కౌలుదారునికి రుణాలు, బీమా, నష్టపరిహారం
- చంద్రబాబు హయాంలో కౌలు రైతుకు మేలు చేసే ఊసేలేదు
- అయినా అదే పనిగా ప్రభుత్వంపై రామోజీ బురద జల్లే ప్రయత్నం

5 లో

చేటు తెచ్చే 'పోస్టు'లొద్దు



- సోషల్‌ మీడియాలో అసభ్యకర పోస్టు పెడితే పట్టుబడ్డట్టే
- 100 మందికి పైగా నిపుణులతో సీఐడీ మానిటరింగ్‌ సెల్‌
- నిత్యం సోషల్‌ మీడియా ఖాతాల పరిశీలన
- అసభ్య పోస్టుల తొలగింపు.. బాధ్యులపై తీవ్ర చర్యలు
- గత ఏడాదికంటే ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో చర్యలు
- విదేశాల్లో ఉన్నా తప్పించుకోలేరు

- వివరాలు 14లో

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం


పాడిరైతులపై 'సంగం డెయిరీ' దాడి

- బోనస్‌ రూ.50 లక్షలు ఇవ్వటంలేదని అడిగేందుకు వచ్చిన రైతులు.. వారు ప్రాంగణంలోకి వెళ్లకముందే కిరాయి సిబ్బంది దాడి
- కర్రలు, రాడ్లు, రాళ్ల దాడిలో 15 మంది ఏలూరు జిల్లా రైతులకు గాయాలు.. 5 కార్లు ధ్వంసం
- అంతా టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర డైరెక్షన్‌లోనే..

14 లో


దాడిలో ధ్వంసమైన కారు

సామాజిక చైతన్యం

సామాజిక సాధికార యాత్రకు జన నీరాజనం

2 లో

- బడుగుల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌కు జేజేలు
- నరసన్నపేట, హిందూపురం, పొన్నూరు సభల్లో పాల్గొన్న మంత్రులు, నేతలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్‌ చేసిన మేలును వివరించిన మంత్రులు
- జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామన్న పిలుపునకు పెద్ద ఎత్తున మద్దతు

ఇదండీ సంగతి



మాజీ సీఎం ఫోన్‌! మీ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ ఇస్తుందనుకున్నారట సార్‌!!

మేము సైతం..

'వై ఏపీ నీడ్స్‌ జగన్‌'లో ఇప్పటి వరకు 4.23 లక్షల కుటుంబాల భాగస్వామ్యం
ఇప్పటికే 2,504 సచివాలయాల పరిధిలో కార్యక్రమం ప్రారంభం
ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తున్న గృహసారథులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..(వై ఏపీ నీడ్స్‌ జగన్‌) కార్యక్రమంలో ఇప్పటి దాకా 'మేము సైతం ..' అంటూ 4,23,821 కుటుంబాలు భాగస్వామ్యమయ్యాయి. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమానికి మధ్యలో దీపావళి కారణంగా మూడు రోజులు విరామం ఏర్పడింది. 9న 664 గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో, 10న మరో 689 సచివాలయాల పరిధిలో, 14న 647 సచివాలయాల పరిధిలో, 15న మరో 504 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, వలంటీర్లు పాలుపంచుకుంటున్నారు. ఆయా సచివాలయాల పరిధిలో కార్యక్రమం ప్రారంభమైన రోజునే.. ఏ సచివాలయం పరిధిలో ఎంత మందికి ఏయే పథకాల ద్వారా లబ్ధి కలిగిందన్న వివరాలతో కూడిన సంక్షేమ, అభివృద్ధి బోర్డులను స్థానిక ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. బుధవారం వరకు


నెల్లూరు జిల్లా కోవూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఇలా 2,504 సచివాలయాల వద్ద సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. వీటి ఆవిష్కరణ జరిగిన తర్వాత రోజు నుంచే ఆయా సచివాలయాల పరిధిలో రోజుకు 15 ఇళ్ల చొప్పున కలుస్తున్నారు. ఇప్పటి వరకు (మధ్యలో 3 రోజులు సెలవులు పోను) 16,169 మంది 4,23,821 కుటుంబాల వద్దకు వెళ్లి.. ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబానికి కలిగిన ప్రయోజనం, ఆ ఊరు మొత్తానికి కలిగిన ప్రయోజనాన్ని వివరించి చెప్పారు.

కశ్మీర్‌లో ఘోర ప్రమాదం

- బస్సు లోయలో పడి.. 38 మంది మృతి.. మరో 20 మందికి తీవ్ర గాయాలు
- దోడా జిల్లాలో ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

- వివరాలు 6లో

కొవ్వూరు ఎస్సైపై సస్పెన్షన్‌ వేటు

- యువకుడి ఆత్మహత్యకు కారణమయ్యారనే ఆరోపణల నేపథ్యంలో డీఐజీ నిర్ణయం
- ఫ్లెక్సీ వివాదంలో స్టేషన్‌కు తీసుకెళ్లారనే మనస్తాపంతో పురుగు మందు తాగిన యువకుడు.. చికిత్స పొందుతూ విజయవాడలో మృతి

14 లో

ఆదివాసీల సంక్షేమానికి విశేష కృషి

- ఏపీలో గిరిజనులకు అభివృద్ధి ఫలాలు
- 1.54 లక్షల మందికి అటవీ భూముల పట్టాలు
- 1,087 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి
- గవర్నర్‌ జస్టిస్‌ అబ్దుల్‌ నజీర్‌

- వివరాలు 14లో



ఆదివాసీ మహిళకు భూమి పట్టా అందజేస్తున్న గవర్నర్‌ నజీర్‌

తీవ్రం కానున్న వాయుగుండం



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. బుధవారం వాయుగుండంగా మారింది. ఇది విశాఖపట్నానికి ఆగ్నేయంగా 420 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి 18వ తేదీకి పశ్చిమ బెంగాల్‌ తీరానికి చేరుకోనుందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రెండు రోజుల పాటు కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

- వివరాలు 14లో

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



బడుగుల కల సాకారం

హిందూపురంలో సామాజిక సాధికార సంబరం

- అడుగడుగునా ఘన స్వాగతం పలికిన ప్రజలు
- సీఎం జగన్ చేస్తున్న మేలును కీర్తిస్తూ ముందుకు సాగిన జనం
- అశేష జనవాహిని మధ్య సభ
- జగన్ పాలనలోనే సామాజిక సాధికారత సాధ్యమైందన్న నేతలు



సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

సాక్షి, పుట్టపర్తి: శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో బుధవారం సామాజిక సాధికార బస్సు యాత్ర ఓ ఉత్సవంలా సాగింది. అశేష జనవాహిని మధ్య పండగ వాతావరణంలో బస్సు యాత్ర జరిగింది. ఈ యాత్రకు అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును కీర్తిస్తూ ముందుకు సాగారు. సాయంత్రం హిందూపురం అంబేడ్కర్ కూడలిలో అశేష జనవాహిని మధ్య జరిగిన సభలో పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు రాష్ట్రంలో సామాజిక న్యాయం నెలకొన్న తీరును వివరించారు.

బడుగుల కల సాకారం చేసిన సీఎం జగన్: ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

రాష్ట్రంలో సామాజిక సాధికారతను సాధించడం ద్వారా సీఎం వైఎస్ జగన్ బడుగుల కలను సాకారం చేశారని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అయినా, వైఎస్ జగన్ సీఎం అయ్యే వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పట్టించుకున్న నాయకుడు లేరన్నారు. వార్డు స్థాయి నుంచి పార్లమెంటు వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నాలుగింట మూడొంతుల ప్రాధాన్యం ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనని చెప్పారు. పలు సంక్షేమ పథకాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అభివృద్ధిలోకి తెచ్చారని తెలిపారు. మైనార్టీల పట్ల చంద్రబాబుది దుర్మార్గపు బుద్ధి అని, 2009లో హిందూపురం ఎమ్మెల్యేగా గెలిచిన అబ్దుల్ ఘనీని 2014లో పక్కనబెట్టి బాలకృష్ణకు టికెట్ ఇచ్చారని తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్వాతంత్ర్యం ఇప్పుడే: మంత్రి గుమ్మనూరు జయరామ్

వైఎస్ జగన్ సీఎం అయ్యాకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్వాతంత్ర్యం వచ్చిందని మంత్రి గుమ్మనూరు జయరామ్ చెప్పారు. గత ఏడు దశాబ్దాలుగా ఏపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అణచివేతకు గురయ్యారని తెలిపారు. ఈసారి ఫ్యాన్ గాలికి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు మైండ్ బ్లాక్ కావాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై టీడీపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

హిందూపురంలో చరిత్ర తిరగరాద్దాం: మంత్రి ఉషశ్రీ చరణ్

40 ఏళ్లుగా హిందూపురంలో టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి చరిత్ర తిరగరాద్దామని మంత్రి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నసీఎం జగన్‌కు అందరమూ సహకరిద్దామని అన్నారు. బడ్జెట్‌లో మహిళా సాధికారతకు పెద్దపీట వేసిన ఘనత జగన్‌దేనని చెప్పారు.

పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ పాలన

– రాజ్యసభ సభ్యుడు ఆర్.క్రిష్ణయ్య

ఏపీ పాలన పక్క రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా ఉందని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య చెప్పారు. బెంగళూరు నుంచి హిందూపురం వస్తుండగా.. కొందరు వచ్చి ఏపీలో పాలన బాగుందని, వారి ప్రాంతాలను ఏపీలో కలిపేందుకు ఉద్యమం చేయాలనుకుంటున్నామని, అందుకు తన సహకారం కోరారని తెలిపారు. ఒక సీఎంకు ఇంతకంటే ఇంకేం కావాలని అన్నారు. జగన్ పాలన ఇలాగే కొనసాగితే రానున్న 20 ఏళ్లలో దేశంలోనే ఏపీ అత్యంత ధనిక రాష్ట్రంగా అవుతుందన్నారు.

ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం..

నరసన్నపేట సామాజిక సాధికార యాత్రకు జన నీరాజనం

- బడుగుల కలను సాకారం చేసిన సీఎం జగన్‌కు జేజేలు
- నరసన్నపేట సభలో పాల్గొన్న మంత్రులు, నేతలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మేలును వివరించిన మంత్రులు
- జగన్‌ను మరోసారి సీఎంను చేద్దామన్న పిలుపునకు మద్దతు



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని

నరసన్నపేట/సారవకోట/పోలాకి/జలుమూరు: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో బుధవారం సామాజిక చైతన్యం వెల్లువెత్తింది. బుధవారం నరసన్నపేటలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక సాధికారతను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలికారు. బస్సు యాత్ర నరసన్నపేటలోని పోలాకి కూడలికి వచ్చేసరికి ఇసుకేస్తే రాలనంతగా జనం కనిపించారు. దారి పొడవునా పార్టీ కార్యకర్తలు, అభిమానులు బస్సుయాత్రకు బ్రహ్మరథం పట్టారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును, సామాజిక సాధికారత సాధనకు చేసిన కృషిని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయాలని నేతలు పిలుపునిచ్చినప్పుడు ప్రజలు పెద్ద పెట్టున మద్దతు పలుకుతూ హర్షధ్వానాలు చేశారు.

మేధావులు కోరిన సుపరిపాలన: ధర్మాన

దశాబ్దాలుగా మేధావులు, విద్యావంతులు కోరుతున్న సుపరిపాలనను సీఎం జగన్ అందిస్తున్నారని మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం చేయలేక చేతులెత్తేసిన అనేక పనులు సీఎం జగన్ చేసి చూపిస్తున్నారని అన్నారు. వెనుకబడిన తరగతుల నాయకులు లేకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం ఏ కార్యక్రమమూ చేయదని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వైఎస్ జగన్ పాలనలోనే స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని, సామాజిక న్యాయం దిశగా అడుగులు పడ్డాయని అన్నారు. విశాఖ రాజధాని కాకుండా అడ్డుకుంటున్న చంద్రబాబు వద్దని, విశాఖతో పాటు మరో రెండు ప్రాంతాల్లో రాజధాని ఏర్పాటు చేస్తున్న వైఎస్ జగనే మరోసారి సీఎం కావాలని జనం ఇప్పటికే నిర్ణయానికి వచ్చారని తెలిపారు.

జగన్‌తోనే బీసీలకు న్యాయం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే బీసీలకు న్యాయం జరిగిందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. పద్నాలుగేళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు బీసీలకు కనీస న్యాయం కూడా చేయకపోగా, పదవులు సహా అన్నింటిలోనూ వారిని చిన్న చూపు చూశారని అన్నారు. వైఎస్సార్‌సీపీ వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు.

సీఎం జగన్ పాలనకు నిదర్శనం బస్సుయాత్ర: మంత్రి సీదిరి అప్పలరాజు

జిల్లా వాసులు సామాజిక సాధికార బస్సు యాత్రను ఓ పండుగలా చేసుకుంటున్నారని, సీఎం జగనన్న పాలనకు ఇది నిదర్శనమని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రతినిధులకు పదవులు ఇవ్వడమే కాకుండా వారి సంక్షేమానికి పథకాలు కూడా ఈ ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. బీసీ అయిన తమ్మినేని సీతారాంను స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టేందుకు చంద్రబాబు ముఖం చాటేశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ పాలనలోనే బడుగువర్గాలకు న్యాయం లభించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు జగన్‌ను మరోసారి సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు పుష్ప శ్రీవాణి, గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, విశ్వాసరాయి కళావతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం

సాధికారతను ప్రతిబింబించిన పొన్నూరు

సామాజిక సాధికార బస్సు యాత్రకు వేలాదిగా ప్రజలు

- కిటకిటలాడిన పట్టణ వీధులు
- ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా గౌడ కులస్తుల ట్రాక్టర్
- సీఎం జగన్ మేలును సాధికార సభలో వివరించిన నేతలు
- జయజయధ్వానాలు చేసిన ప్రజలు



గుంటూరు జిల్లా పొన్నూరు సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఓ భాగం



యాత్రలో పాల్గొన్న నాయకులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం సామాజిక సాధికారతను ప్రతిబింబించింది. బుధవారం పొన్నూరు నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు పోటెత్తారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో పట్టణ వీధులు కిటకిటలాడాయి. పార్టీ కార్యాలయం నుంచి పొన్నూరు ఐలాండ్ సెంటర్ వరకూ ర్యాలీ జరిగింది. ర్యాలీలో రాష్ట్ర మంత్రి జోగి రమేష్ ఎడ్లబండి నడిపారు. గౌడ కులస్తులు ట్రాక్టర్ పై తాటి చెట్టు, తాటి కుండలతో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సినీ నటుడు అలీ ప్రసంగం ఉత్సాహపరిచింది. పొన్నూరు నియోజకవర్గంపై పాటల సీడీని ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఆవిష్కరించారు. ఐలాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే రోశయ్య ఆవిష్కరించారు. పట్టణంలో ఎమ్మెల్యే కిలారి రోశయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు చేస్తున్న మేలును వివరించినప్పుడల్లా ప్రజలు జయజయధ్వానాలు చేశారు. జగనే కావాలి అంటూ నినాదాలు చేశారు.

సామాజిక న్యాయానికి పేరు సీఎం జగన్: మంత్రి జోగి రమేష్

సామాజిక న్యాయానికి పేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. కేబినెట్‌లో 25 మంది మంత్రులుంటే వారిలో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలేనని తెలిపారు. నలుగురు బీసీలను అత్యున్నత రాజ్యసభకు పంపారని, స్పీకర్, మండలి ఛైర్మన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎంపికలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి పేదింటి పిల్లవాడు అంతర్జాతీయ స్థాయి చదువులు చదవాలన్న ఆకాంక్షతో ప్రభుత్వ పాఠశాలలను అత్యున్నతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. వారిని ఇంగ్లిష్ మీడియం చదివిస్తున్నారని, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని చెప్పారు. పవన్ కళ్యాణ్ చెంచా నాదెండ్ల మనోహర్ విద్యాకానుక కిట్లు ఇవ్వడం తప్పంటున్నాడని, పెత్తందారులకు దీటుగా పేదల పిల్లలు చదువుకోవడం తప్పా అని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలందరం చేస్తున్న ఈ యాత్రకు అపూర్వ స్పందన లభిస్తోందని, కేవలం జగనన్న కటౌట్‌తో యాత్ర చేస్తేనే ఇంత స్పందన వస్తే.. ఇక జగనన్న రంగంలోకి దిగితే విపక్షాల పరిస్థితేమిటని అన్నారు. సామాజిక సాధికారత అంటే చంద్రబాబుకు ఏమైనా తెలుసా అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ అన్నారు. సామాజిక సాధికారత అంటే ఏమిటో సీఎం జగన్ పాలన చూస్తే తెలుస్తుందని, బాబులా సొంత సామాజిక వర్గాన్ని పెంచి పోషించుకోవడం కాదని చెప్పారు. మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. చిన్న స్థాయి పదవి నుంచి రాజ్యసభ వరకు ప్రతి అంశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్న ఏకై క ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు.

■ వైఎస్ జగన్ పాలన చేపట్టిన నాటి నుంచి ప్రతి ఇంటి బిడ్డగా ఆ కుటుంబం బాధ్యతలు భుజాన వేసుకున్నారని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. దళితులంటే చంద్రబాబుకు తొలి నుంచి చిన్న చూపేనని అన్నారు. దళితుల సంపద దోచుకొని, వారి జీవితాలను సర్వనాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. వంగవీటి మోహనరంగాను చంపిన వ్యక్తితో కలిసిన పార్టీలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేద వాడి ఆత్మస్థైర్యం అని చెప్పారు. ఎన్టీఆర్‌పై అభిమానంతో 19 ఏళ్ల పాటు తాను టీడీపీలో పనిచేశానని, ఆ పార్టీ నేతలు ఏ ఒక్కరికీ గౌరవం ఇవ్వరని తెలిపారు. అందరినీ ఆదరంగా అక్కున చేర్చుకొనే మనసున్న సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కుంభా రవి, పోతుల సునీత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజాం, కొత్తపేట నియోజకవర్గాల్లో యాత్ర

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు జనం బ్రహ్మరథం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో సామాజిక న్యాయానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రలకు ప్రభంజనంలా కదలి వస్తున్నారు.అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర రెండో దశ బుధవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట, గుంటూరు జిల్లా పొన్నూరు, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గాల్లో బుధవారం యాత్ర జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కదలి రావడంతో మూడు నియోజకవర్గాల్లో యాత్ర విజయవంతమైంది. సంక్షేమ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు–పవన్ చేసిన మోసాలను నేతలు సభల్లో వివరిస్తున్నప్పుడు 'ఆపు బాబూ నాటకం.. జగనే మా నమ్మకం' అంటూ ప్రజలు ప్రతిస్పందించారు. కుటుంబం, గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్లాలంటే వైఎస్ జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని నేతలు పిలుపునిచ్చినప్పుడు.. 'జగనే కావాలి.. జగనే రావాలి' అంటూ ప్రజలు పెద్ద ఎత్తు నినదించారు. గురువారం విజయనగరం జిల్లా రాజాం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గాల్లో సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుంది.

నాణ్యతలేని మందులకు కళ్లెం..

- ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు
- మందుల షాపులు, తయారీ సంస్థల్లో తనిఖీలకు ప్రత్యేక యాప్



సాక్షి, అమరావతి: ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో నాణ్యమైన మందులే ప్రజలకు అందేలా అనేక చర్యలు చేపట్టింది. ప్రమాణాల మేరకు లేని మందులను లేకుండా చేసేందుకు నాలుగున్నరేళ్లుగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ చర్యల ఫలితంగా జాతీయస్థాయితో పోలిస్తే మన రాష్ట్రంలో నాట్ ఆఫ్ స్టాండర్డ్ క్వాలిటీ (ఎన్ఎస్‌క్యూ) మందులు తక్కువగా ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా సగటున 4% ఎన్ఎస్‌క్యూ మందులు బయటపడుతున్నాయి. రాష్ట్రంలో ఈ మందుల శాతం 1.55 మాత్రమే.

ఇంటెలిజెంట్ శాంపిలింగ్ విధానం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటి వరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తమ అభీష్టం మేరకు మందుల షాపులు, తయారీ యూనిట్లను ఎంచుకుని తనిఖీ చేసేవారు. మూసధోరణిలో సాగే ఈ విధానానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వస్తిపలికింది. ఇంటెలిజెంట్ శాంపిలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తనిఖీలు, శాంపిళ్ల సేకరణలో అధికారుల జోక్యాన్ని తగ్గించి ర్యాండమ్‌గా తనిఖీల నిర్వహణ, ఇంటెలిజెంట్ శాంపిలింగ్‌పై దృష్టి సారించింది. ఈ క్రమంలో కంప్యూటర్ ఎయిడెడ్ సెలక్షన్ ఆఫ్ ఇన్‌స్పెక్షన్ యాప్‌ను రూపొందించారు. ఈ విధానంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ఏ షాప్‌లో తనిఖీ చేయాలనే విషయమై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంలో అలర్ట్ వెళుతుంది. యాప్ సూచించిన షాపు, తయారీ యూనిట్‌లో తనిఖీలు నిర్వహించి, రిపోర్టులను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు శాంపిళ్ల సేకరణలో 10కి పైగా ప్రమాణాలతో ఎస్‌వోపీ రూపొందించారు. మార్కెట్‌లో ఎక్కువగా వినియోగంలో ఉన్న మందులు, అసాధారణంగా ధరలు ఎక్కువ/తక్కువ ఉండటం.. ఇలా వివిధ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని శాంపిళ్లు సేకరించి విశ్లేషణకు లేబొరేటరీలకు పంపుతున్నారు.

నిరంతర నిఘా

రాష్ట్రంలో 353 మందుల తయారీ యూనిట్లు, 213 బ్లడ్ బ్యాంకులు, 132 బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు, 44,973 హోల్‌సేల్, రిటెయిల్ మందుల షాపులు ఉన్నాయి. నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా తయారీ సంస్థలు, హోల్‌సేల్, రిటెయిల్ మందుల షాపులపై ఔషధ నియంత్రణ విభాగం నిరంతర నిఘా కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు మందుల షాపుల్లో 12,686, మందుల తయారీ యూనిట్లలో 243 తనిఖీలు చేసింది. వాటిలో 3,015 నమూనాలను సేకరించి విశ్లేషించింది. ఈ విశ్లేషణలో 47 నమూనాలు (1.55%) ఎన్ఎస్‌క్యూగా తేలింది. ఎన్ఎస్‌క్యూగా తేలిన ఘటనల్లో అధికారులు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇలా ఈ ఏడాదిలో ఇప్పటికి 16 కేసుల్లో దోషులకు కోర్టు శిక్ష విధించింది.


సభలో నాగలితో సీఎం వైఎస్ జగన్




సభా ప్రాంగణం నిండిపోవడంతో బయటే భారీగా నిలిచిపోయిన జనం


సభలో థ్యాంక్యూ జగనన్న అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు


వరికపుడిశెల ఎత్తిపోతల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజలతోనే మా పొత్తు

దారుణాలను సమర్థించేందుకు చంద్రబాబుకు ఒక వర్గం ఉంది. ఒక ఎల్లో మీడియా ఉంది. ఒక దొంగల ముఠా తోడుంది. వీళ్లందరిదీ ఒక పెద్ద లాబీ. బాబు నేరాలను కప్పి పెట్టడానికి, విచారణ జరగకుండా అడ్డుకునేందుకు, వ్యవస్థలను మేనేజ్ చేయడానికి బాబు తరఫున పని చేయడానికి అనేక వ్యవస్థల్లో ఆయన మనుషులు. ఇతర పార్టీల్లో కోవర్టులు ఉన్నారు. కేవలం ప్రజల్ని దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం కోసం దొంగల ముఠాగా ఏర్పడి రాజకీయాలు చేస్తుండటం చూస్తే రాజకీయ వ్యవస్థ మీదే నమ్మకం పోయే పరిస్థితి వస్తుంది.

\- సీఎం జగన్

నెరవేర్చిన హామీలే నా ధైర్యం, జనమే నా నమ్మకం..

వరికపుడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపనలో సీఎం వైఎస్ జగన్

ఇంటింటికీ, అన్ని సామాజిక వర్గాలకూ, అన్ని ప్రాంతాలకు చేసిన మంచి నా ధైర్యం. బటన్ నొక్కి నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి పంపిన రూ.2.40 లక్షల కోట్లు నా ధైర్యం. ఎక్కడా లంచాలు, వివక్షకు చోటు లేకుండా లబ్ధి చేకూర్చడం నా ధైర్యం. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయం..వలంటీర్ వ్యవస్థతో ఊళ్ల రూపురేఖలు మార్చడం నా ధైర్యం. నాడు-నేడుతో స్కూళ్లను మార్చడం, లంచాలు, వివక్షకు తావులేని పౌర సేవలు నా ధైర్యం. వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి, దిశ యాప్ వ్యవస్థ నా ధైర్యం. మీ బిడ్డ నమ్మేది పైనున్న దేవుడిని, కిందున్న మిమ్మల్ని మాత్రమే. మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి.

నరమాంసం రుచి మరిగిన పులి బంగారం కడియం చూపుతూ ఫ్రీ గిఫ్ట్ ఇస్తా అని ఆశ పెడితే, ఎవరైనా ఆ బంగారు కడియం కోసం పులి దగ్గరకు వెళ్లే ధైర్యం చేస్తారా? ఈ పెద్దమనిషి చంద్రబాబు మాటలు నమ్మితే అదే మాదిరిగా ఉంటుంది. తన పాలనలో పేదలకు పెన్షన్ కావాలన్నా, రేషన్‌కార్డు కావాలన్నా, రేషన్ కావాలన్నా, ఇంకోటి కావాలన్నా, చివరకు మరుగుదొడ్లు కావాలన్నా లంచాలు ఇవ్వాల్సిందే. జన్మభూమి కమిటీల చుట్టూ, గవర్నమెంట్ కార్యాలయాల చుట్టూ తిప్పాడు. మానవత్వపు ఇంజెక్షన్లు, గుండె కరిగే ఇంజెక్షన్లు ఎన్ని ఇస్తే మాత్రం ఈ పెద్ద మనిషిలో మానవత్వం వస్తుంది? ఇప్పుడు ఎన్నికలు దగ్గరకొస్తున్నాయి కాబట్టి తానొక్కడే చెబితే ప్రజలు నమ్మరని, తనకు తోడు ఇంకో నలుగురిని కలుపుకుంటున్నాడు.


పల్నాడు జిల్లా మాచర్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు

వచ్చే ఎన్నికల్లో తమ పొత్తు ప్రజలతోనే ఉంటుందని, పేద ప్రజల కోసమే తమ పార్టీ ఉందని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నెరవేర్చిన హామీలు, ప్రజలే తన ధైర్యం, నమ్మకం అని స్పష్టం చేశారు. నేను విన్నాను, నేను ఉన్నాను అని పునరుద్ఘాటించారు. వైఎస్సార్‌కు, వైఎస్ జగన్‌కు తెలిసిందల్లా ప్రజల్లో నడవడం, ప్రజల గుండెల్లో ఉండటమేనన్నారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ.. వైఎస్సార్ పల్నాడు కరువు నివారణ పథకం కింద రూ.340.26 కోట్ల వ్యయంతో చేపడుతున్న వరికపుడిశెల ఎత్తిపోతల పథకానికి కీలకమైన అటవీ, పర్యావరణ అనుమతులు సాధించి బుధవారం ఆయన మాచర్లలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గంలో పక్కనే నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ.. సాగు, తాగునీటి ఎద్దడి దశాబ్దాలుగా మన కళ్లెదుటనే కనిపిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న పరిస్థితులు లేవన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందలేదన్న మాదిరిగా.. సముద్రంలో ప్రయాణిస్తున్న వారికి గుక్కెడు మంచి నీరు దొరకలేదన్న చందంగా ఇన్ని దశాబ్దాల పాటు కృష్ణమ్మ ఒడ్డున ఉన్న ఈ ప్రాంతానికి నది నీరు దక్కలేదని చెప్పారు. ఈ పరిస్థితిలో పల్నాటి ప్రాంత రూపురేఖలు మార్చేలా ఈ రోజు రూ.340 కోట్లతో వరికపుడిశెల ఎత్తిపోతల ద్వారా కృష్ణమ్మ నీరు అందిస్తామని గర్వంగా చెబుతున్నానన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

గతంలో టెంకాయ కొట్టి మోసం

- 2019 ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఈ ప్రాజెక్టుకు ఎటువంటి అనుమతులు లేకపోయినా, ఏ మాత్రం భూమి సేకరించకుండానే అందరిని మోసం చేసేందుకు ఇదే పథకానికి ఎన్నికలకు కేవలం నెల ముందు టెంకాయ కొట్టారు. ప్రాజెక్టు ప్రారంభం అవుతుందని నమ్మించే ప్రయత్నం చేసి నిస్సిగ్గుగా మోసం చేశారు. ఇదే ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఈ నెల 6వ తేదీన అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చాయి. అభయారణ్యం కావడం వల్ల నేషనల్ బోర్డ్ ఆఫ్ వైల్డ్ లైఫ్ నుంచి కూడా ఈ ఏడాది మే నెలలో అనుమతులు వచ్చాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూములను కూడా మన ప్రభుత్వం వచ్చిన తర్వాతే సేకరించాం. అన్ని అనుమతులు తీసుకొచ్చిన తర్వాత పనులు ప్రారంభిస్తున్నాం.
- ఈ లిఫ్టును నాలుగు పంపులతో నాగార్జునసాగర్‌కు 40 కిలోమీటర్ల ఎగువన నిర్మిస్తున్నాం. వరికపూడిశెల వాగు నుంచి రోజుకు 281 క్యూసెక్కుల చొప్పున మొదటి దశ కింద 1.57 టీఎంసీల నీటిని తరలించడం ద్వారా 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ లిఫ్ట్ ద్వారా 20 వేల మంది జనాభాకు తాగు నీరందించవచ్చు. దాదాపు రూ.340 కోట్ల వ్యయంతో ఈ ప్రాంతానికి నీటిని తీసుకొచ్చే కార్యక్రమం జరుగుతుంది.

పౌరుషాల గడ్డ నుంచి అభివృద్ధి గడ్డగా..

- పల్నాడు ప్రాంతాన్ని, ఈ పౌరుషాల గడ్డను, అభివృద్ధి గడ్డగా మార్చడానికి గత 53 నెలలుగా అడుగులు ముందుకు వేస్తూ వచ్చాం. పల్నాడును ప్రత్యేక జిల్లా చేయడమే కాకుండా మెడికల్ కాలేజీని కూడా తీసుకొచ్చాం. పల్నాడు గుండె చప్పుడు విన్న మనిషిగా ఈ ప్రాజెక్టు ఎంత అవసరమో నాకు తెలుసు. ఈ ప్రాజెక్టును దశల వారీగా మాచర్ల నియోజకవర్గం, తర్వాత వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి, ఆ తర్వాత ఎర్రగొండపాలెం వరకు తీసుకెళ్లే కార్యక్రమం జరుగుతుంది. తద్వారా 1.25 లక్షల ఎకరాలకు సాగు నీరు, దాదాపు లక్ష మందికి తాగు నీరు అందించవచ్చు.
- ఏ కార్యక్రమం చేసినా అందులో చిత్తశుద్ధి, నిజాయితీ ఉండాలి. ప్రజలను, రైతులను, అక్కచెల్లెమ్మలను, చదువుకుంటున్న పిల్లలను మోసం చేయాలనే ఆలోచనతో అడుగులు వేస్తే ఏం జరుగుతుందనేది 2019లోనే ప్రజలు గట్టిగా చెప్పారు. 175 నియోజకవర్గాలకు గానూ చంద్రబాబు నాయుడిని కేవలం 23 స్థానాలకే పరిమితం చేస్తూ తీర్పునిచ్చారు.
- రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో కూడా ప్రజల్ని ప్రధానంగా పేద వర్గాలు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను, నా నిరుపేద వర్గాలందరికీ కూడా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, మహిళా సాధికారతను ఇవ్వడానికి 53 నెలలుగా మనందరి ప్రభుత్వం ప్రతి నిమిషం, ప్రతి రూపాయి ఖర్చు చేసింది. మీ బిడ్డ బటన్ నొక్కడం ద్వారా ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా రూ.2.40 లక్షల కోట్లు నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి జమ అయ్యింది. నాన్ డీబీటీ ద్వారా అంటే ఇళ్ల స్థలాలు, సంపూర్ణ పోషణ లాంటి కార్యక్రమాల ద్వారా మరో రూ.1.70 లక్షల కోట్లు.. వెరసి మొత్తం రూ.4.10 లక్షల కోట్ల పైచిలుకు మేర ప్రజలకు లబ్ధి కలిగించింది. కోవిడ్ అతలాకుతలం చేసినప్పటికీ.. ఖర్చులు పెరిగి, ఆదాయం తగ్గినా సంక్షేమాభివృద్ధి మాత్రం ఆగలేదు.


సభలో యువతుల కేరింతలు

- మీ బిడ్డ 53 నెలల పాలనలో పల్నాడు జిల్లా అయింది. పల్నాడుకు రెవెన్యూ డివిజన్ వచ్చింది. జిల్లాకో మెడికల్ కాలేజీ, గ్రామ గ్రామాన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తున్నాయి. ఫ్యామిలీ డాక్టర్, ఇంటింటా జల్లెడ పట్టి వైద్యం అందించే ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ఇంగ్లిష్ మీడియం బడులొచ్చాయి.

మోసాల మాటలు నమ్మగలమా?

- గత చంద్రబాబు పాలనలో మనం మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాల చరిత్ర చూశాం. ఈ పెద్దమనిషి 14 ఏళ్లు సీఎంగా పని చేసినప్పటికీ కనీసం ఒక మంచి పని చేశానని చెప్పి ఓటు అడగలేదు. అందుకే మళ్లీ మోసం చేసేందుకు, ప్రజల్ని వెన్నుపోటు పొడిచేందుకు వెనుకాడడు. ఇంటింటికి కేజీ బంగారం, బెంజ్ కారిస్తాను.. ఓటు వేయండి అని చంద్రబాబు అడుగుతాడు. 34 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చిన చరిత్ర లేదు. ఇలాంటి వ్యక్తి మన మాచర్లకు, పల్నాడుకు మరో ప్రాంతానికి నీరు ఇస్తానని చెబితే నమ్మగలమా? కన్నతల్లికి అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు మాత్రం బంగారు గాజులు కొనిస్తానని ఒకడు అన్నాడట. ఈ పెద్ద మనిషిని చూస్తుంటే ఆ మాటలు గుర్తుకొస్తాయి. చివరికి కుప్పానికి నీళ్లు కావాలన్నా.. కుప్పానికి రెవెన్యూ డివిజన్ కావాలన్నా చేసేది మీ బిడ్డే.
- పొదుపు సంఘాల రుణాల్ని మొదటి సంతకంతోనే మాఫీ చేస్తానని చెప్పి మోసం చేశాడు. దీంతో ఏ గ్రేడ్, బీ గ్రేడ్‌లో ఉన్న సంఘాలు సీ, డీ గ్రేడ్‌లకు పడిపోయాయి. చివరకు నా అక్కచెల్లెమ్మలను అప్పులపాలు చేశాడు. ఒక జగనన్న అమ్మ ఒడి గానీ, వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ గానీ, నా అక్కచెల్లెమ్మల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇవ్వడం కానీ, అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణం కానీ ఏనాడైనా చేయగలిగాడా? ఇప్పుడు చేస్తానంటే నమ్మగలమా?
- ఒకాయన ఎప్పుడూ మంచానికే పరిమితమై ఉంటాడట. లేస్తే మనిషిని కాదంటాడట. కానీ మంచంలోంచి లేవడు. చంద్రబాబు పరిస్థితీ ఇంతే. తాను చేసిన మంచి ఏమిటనేది ఎప్పుడూ చెప్పడు. ఆయన 2000లో ఉంటే 2047 గురించి చెబుతాడు. ఇప్పుడేం చేస్తావంటే చెప్పడు. 50 ఏళ్ల విజన్ అంటాడు. 50 ఏళ్ల తర్వాత ఏం జరగబోతోందని చెబుతాడట. 50 ఏళ్ల తర్వాత ఎవడుంటాడో..ఎవడు పోతాడో? ప్రజల చెవుల్లో క్యాలీఫ్లవర్ పెట్టడం ఈజీ కదా అని ఆలోచిస్తాడు. ఇలాంటి బాబు మాటలు నమ్మగలమా?

వెన్నుపోటు వీరుడు

- సొంత కూతురును ఇచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన వాడు, రాష్ట్రంలోని కోటీ 50 లక్షల కుటుంబాలకు వెన్నుపోటు పొడవకుండా ఉంటాడా? ఎస్సీ కులాల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అన్నారు. బీసీల తోకలు కత్తిరిస్తానని అహంకారంతో మాట్లాడాడు. ముస్లింలకు, ఎస్టీలకు కనీసం మంత్రి పదవి ఇవ్వని ఈ పెద్దమనిషి.. సమాజంలో ఏ వర్గానికైనా ఏనాడైనా న్యాయం చేశాడా? ఇలాంటి ఆయన నేను మారాను అంటే మనం నమ్మగలమా?
- తన కొడుకు, మనవడు.. వీళ్లు వెళ్లే బడులు మాత్రం ఇంగ్లిష్ మీడియం. ఆ కొడుక్కు తెలుగు మాట్లాడటమూ సరిగా రాదు. పోనీ ఇంగ్లిష్ వస్తుందా అంటే అదీ రాదు. అది వేరే విషయం. మన ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, మన నిరుపేద వర్గాల పిల్లలు వెళ్లే మన ప్రభుత్వ బడులు మాత్రం ఇంగ్లిష్ మీడియంకు మారకూడదట. అవి తెలుగు మీడియంలోనే ఉండాలట.
- గతంలో ఎన్నికలప్పుడు ప్రతి ఇంటికీ ఓ ఉద్యోగం, ఉద్యోగం ఇవ్వకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్నాడు. జాబు రావాలంటే బాబు రావాలి అని ఊదరగొట్టి మోసం చేశాడు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా మన ప్రభుత్వం వచ్చేదాక గవర్నమెంట్ ఉద్యోగాలు 4 లక్షలు ఉంటే మరో 2 లక్షల 7 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత మన ప్రభుత్వానిది.
- మన అదృష్టం కొద్దీ చంద్రబాబు దిగాడు గానీ, దిగకపోయి ఉంటే ఆర్టీసీ ఉండేది కాదు. కరెంటు కంపెనీలు, ప్రభుత్వ ఆస్పత్రులు ఉండేవి కాదు. ప్రభుత్వ రంగంలో ఏ కంపెనీలు ఉండేవి కావు. అన్నింటినీ నీట్‌గా అమ్మేసి మూసేసేవాడు. ఇప్పుడు మన ప్రభుత్వంలో ఆర్టీసీ ప్రభుత్వంలో కలిసింది. ఆస్పత్రులు, స్కూళ్లు మారాయి.
- రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే ఆ తీగలపై బట్టలు ఆరేసుకోవాలన్న ఈ పెద్దమనిషిది ఉచిత విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తే కాల్చి చంపిన చరిత్ర. రైతులకు రూ.87,612 కోట్ల రుణమాఫీ ఫైలుపై మొదటి సంతకం చేస్తానన్న పెద్దమనిషి, బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే బాబు రావాలని టీవీల్లో అడ్వర్టయిజ్‌మెంట్లు ఊదరగొట్టిన ఈ పెద్దమనిషి.. అధికారంలోకి వ చ్చాక నిండా ముంచాడు. ఈరోజు మైకు పట్టుకొని అది చేస్తా ఇది చేస్తాఅంటే నమ్మగలమా?

పల్నాడు రూపురేఖలు మార్చాలన్నది నా తపన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

సాక్షి, అమరావతి: పుట్టిన బిడ్డకు అందని తల్లిపాల మాదిరిగా.. పక్కనే కృష్ణా నది ప్రవహిస్తున్నా పల్నాడు ప్రాంతానికి నీరు దక్కని పరిస్థితి ఉందని, కొన్ని దశాబ్దాలుగా అక్కడ దుర్భర పరిస్థితులు దర్శనమిస్తున్నాయని సీఎం వైఎస్ జగన్ అన్నారు. అందుకే 'పల్నాడు రూపురేఖలు పూర్తిగా మార్చాలనే తపన, తాపత్రయంతో ఇవాళ రూ.340.26 కోట్లతో వరికపుడిశెల ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలు అందించే బృహత్తర కార్యక్రమానికి శంకుస్థాపన చేశానని చెప్పడానికి సంతోషిస్తున్నా' అని బుధవారం ఆయన ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు.

నూజివీడులో రేపు సీఎం పర్యటన

సాక్షి, అమరావతి: ఈ నెల 17న (శుక్రవారం) ఏలూరు జిల్లా నూజివీడులో సీఎం వైఎస్ జగన్ పర్యటించనున్నారు. 2003కు ముందు అసైన్డ్ భూములకు హక్కు కల్పించడం, కొత్త అసైన్డ్ భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. ఉదయం 9.45 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి నూజివీడు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

బాబు - దత్త పుత్రుడి మోసం

- తన బినామీ భూముల ధర బాగా పెరగాలన్న దుర్బుద్ధితో ఈ పెద్దమనిషి అమరావతిని ఒక రాజధానిగా భ్రమ కల్పించాడు. మూడు ప్రాంతాలకు ఏనాడైనా సమన్యాయం చేశాడా? తన హయాంలో పేదలకు కనీసం సెంటు భూమి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. మనం 31 లక్షల ఇంటి స్థలాలను నా అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుంటే కోర్టులకు వెళ్లి ఆపేందుకు కేసులు వేశారు. కులాల మధ్య సమతుల్యం దెబ్బతింటుందని, ఏకంగా ఎదురు దాడి చేసిన వ్యక్తి చంద్రబాబు.
- 2014లో ఇదే దత్తపుత్రుడు చంద్రబాబుతో కలిసే పోటీ చేశాడు. కలిసే మేనిఫెస్టో రిలీజ్ చేశాడు. ఆ మేనిఫెస్టోకు నాదీ పూచీ అన్నాడు. వీళ్లద్దరూ అయితే సరిపోరని వీరికి తోడు మోడీ గారి పేరు కూడా తెచ్చుకున్నారు. దారుణంగా ప్రజలను మోసం చేశారు. ఇది గత చరిత్ర. మేమంతా కలిసికట్టుగా మేనిఫెస్టోలో 5 హామీలు చెబితే... నేను దత్తపుత్రుడు కలిశాము కాబట్టి మరో 6 హామీలు ఇస్తున్నామని చెబుతారు. ఇవాళ వీళ్లు మాట్లాడుతున్న మాటలు చూస్తే నిజంగా వీళ్లు మనుషులేనా అనిపిస్తుంది.
- ఇలాంటి రాజకీయాలు, పొత్తులు మీ బిడ్డకు చేత కాదు. ఒక వైఎస్సార్‌కు గానీ, ఒక జగన్‌కు గానీ తెలిసిందల్లా ఒక్కటే. ప్రజల్లో నడవటం, ప్రజల గుండె చప్పుడు వినడం. ప్రజల్లోకి వెళ్లినప్పుడు ఒక్కటే ఒక్కటి చెబుతాను. నేను విన్నాను, నేను ఉన్నానని మాత్రమే మీ బిడ్డ జగన్ చెబుతాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన మాటను, ఇచ్చిన ఎన్నికల ప్రణాళికలను ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి, అక్కచెల్లెమ్మల బతుకుల్లో మార్పు తీసుకురావడానికి తపిస్తూ అడుగులు వేశాను.
- మాచర్ల నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కొన్ని అభివృద్ధి పనులు అడిగాడు. ఇవాళ జరుగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులే కాకుండా ఇక్కడ ఉన్న సీహెచ్‌సీని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయమని కోరారు. దాన్ని మంజూరు చేస్తున్నాను.
- ఈ కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజని, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జెడ్పీ చైర్మన్ హెన్రీ క్రిష్టినా, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

ప్రాజెక్టుకు వైఎస్సార్ పేరు పెట్టండి



వరికపుడిశెల ఎత్తిపోతల ప్రాజెక్టుకు డాక్టర్ వైఎస్సార్ పేరు పెట్టాలి. 15వ శతాబ్దంలో పల్నాడులో పర్యటించిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు ఇక్కడి కరువు పరిస్థితిని వివరించారు. ఇప్పుడు ఆ పరిస్థితులు మారబోతున్నాయి. ధవళేశ్వరం ప్రాజెక్ట్ కట్టించిన కాటన్ దొరను గుర్తించుకున్నట్లు ఈ ప్రాంత ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ని గుర్తుంచుకుంటారు. ఇది ఆరు దశాబ్దాల కల. 1996లో శంకుస్థాపన చేసి, మా ప్రాంత రైతాంగాన్ని జిత్తులమారి చంద్రబాబు మోసం చేశాడు. జగనన్న ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఇవాళ శంకుస్థాపన చేశారు. జగనన్న ఆదేశాల మేరకు నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అనుమతుల కోసం ఢిల్లీలో కృషి చేశారు. ఇది మాచర్ల, వినుకొండ, ఎర్రగొండపాలెం 3 నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగకరం. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నేను నా ఊపిరి ఉన్నంత వరకు జగనన్న వెంటే ఉంటాను.

\- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే



సాధించుకునే శక్తి ఉన్నదాని కోసం ఎప్పుడూ భిక్ష అడగకు.
- మిగెల్ డె సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 16 నవంబర్ 2023

ఆదేశాలేనా? ఆచరణ లేదా?

ఆదేశాలిచ్చినా ఆచరణలో పెట్టకపోతే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాజధాని ఢిల్లీలోనే కాక, దేశవ్యాప్తంగా నిర్ణీత నిషేధిత రసాయనాలున్న టపాసులను నిషేధిస్తున్నట్టు సుప్రీమ్ కోర్టు గత వారం ఆదేశాలిచ్చింది. కానీ, జరిగింది మాత్రం వేరు. ఇష్టారాజ్యంగా టపాసులు కాల్చడం కొనసాగింది. ఎప్పటిలానే దట్టమైన పొగలో ఢిల్లీ కూరుకుపోయింది. దీపావళి వేళ ఒక్క ఢిల్లీలోనే కాక దేశవ్యాప్తంగా వాయు, శబ్ద కాలుష్యాలు నియంత్రణ కాకపోగా మరింత పెరిగాయి. ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా సహా 7 నగరాల్లో కాలుష్యస్థాయి ఘనపు మీటర్‌కు 500 మైక్రోగ్రాముల స్థాయిని దాటేసినట్టు గంటల వారీగా చేసిన విశ్లేషణలో వెల్లడైంది. హానికారకమైన నిర్ణీత టపాసులు కాల్చడంపై నిషేధం అమలులో ప్రభుత్వాల వైఫల్యాన్ని ప్రతిబింబిస్తోంది.

ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్, కోల్‌కతా, ముంబయ్, తదితర నగరాల్లో నిషేధిత టపాసులు సైతం నిల్వచేశారు, అమ్మారు, బాహాటంగా వాటిని కాల్చారు. కోర్టు ఆదేశాలు సైతం గాలికి పోవడం విషాదమే. అయితే, ప్రజల్లో చైతన్యం తీసుకురాకుండా, వారిని మానసికంగా సంసిద్ధం చేయకుండా, ప్రభుత్వాల ఆచరణలో చిత్తశుద్ధి లేకుండా... ఎవరెన్ని ఆదేశాలు జారీ చేసినా ప్రయోజనం ఉండదని మరోసారి రుజువైంది. దీపావళి ముగిసి మూణ్ణాళ్ళయినా ఢిల్లీలో వాయు నాణ్యత ఇప్పటికీ ప్రమాదకర స్థాయిలోనే ఉందని వార్త. నిజానికి, దేశ రాజధానిలో టపాసులపై నిషేధం పెట్టడం ఇదేమీ తొలిసారి కాదు. వాటి అమ్మకాన్ని దేశ రాజధానిలో నిషేధించాల్సిందిగా 2018 అక్టోబర్‌లో సైతం సుప్రీమ్ కోర్ట్ అప్పటి ఢిల్లీ ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. 'పర్యావరణ హిత' (గ్రీన్) టపాసులు, తక్కువ ఉద్గారాలు వెలువరించే 'మెరుగైన' టపాసులకు మినహాయింపునిచ్చింది. అప్పుడూ ఆ మాట ఆదేశాలకే పరిమితమైంది తప్ప ఆచరణకు నోచుకోలేదు.

అప్పట్లో కొద్దిరోజులకే... తక్కువ కాలుష్యం కలిగించే టపాసులను అభివృద్ధి చేసినట్టు 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్' ప్రకటించింది. సాంప్రదాయిక టపాసుల కన్నా ఇవి చౌక అనీ చెప్పింది. వాటి అతీగతీ తెలీదు. అంతకన్నా ఘోరమేంటంటే, చైనా నుంచి దిగుమతి చేసుకున్న టపాసులు 'మేడిన్ ఇండియా' అంటూ నకిలీ ముద్రతో మార్కెట్‌లో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాటిని ఆపే ప్రయత్నాలు సమర్థంగా జరగడం లేదు. అలాగే, ఇటీవల రెండు గంటలే టపాసులు కాల్చడానికి అనుమతిస్తున్నట్టు ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. ఆ ఆదేశాలూ ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. వెరసి, కాలుష్య నియంత్రణపై మాటలే తప్ప చేతలు కనిపించని వైనం సహజంగానే అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి తెర తీస్తోంది. టపాసుల నిషేధంపై ఢిల్లీ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ విమర్శిస్తోంది. బీజేపీ నేతాగణం, బీజేపీ పాలిత రాష్ట్రాలే ఆచారాల పేరు చెప్పి టపాసులు కాల్చేలా ప్రజల్ని కావాలని రెచ్చగొడుతున్నాయని 'ఆప్' ఆరోపిస్తోంది.

పరస్పర నిందారోపణలు పక్కనపెడితే, కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు. దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణ చర్యలు ఫలితమివ్వకపోవడానికి... ఢిల్లీకీ, పొరుగు రాష్ట్రాలకూ మధ్య సమన్వయ లోపం ఓ ప్రధాన కారణం. ఇక, ఢిల్లీలోని 'ఆప్' ప్రభుత్వ వైఫల్యాలు సరేసరి. పండుగ వచ్చే ముందు ప్రతిసారీ ప్రభుత్వాలు ప్రజలకు విజ్ఞప్తి చేయడం, మార్గదర్శకాలు జారీ చేయడం షరా మామూలే. అవన్నీ వట్టి కంటి తుడుపు చర్యలే అవుతున్నాయి. ఏటా ఈ సీజన్‌లో ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పంట వ్యర్థాల దహనంలోనూ ఇదే జరుగుతోంది. చట్టాలు చేసినా సరే పంజాబ్, హర్యానా సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనం ఆగింది లేదు. ఒక్క పంజాబ్‌లోనే సెప్టెంబర్ 15 నుంచి ఇప్పటికి 28 వేలకు పైగా దహనాల ఘటనలు జరిగినట్టు లెక్క. ఫలితంగా హర్యానా లాంటి చోట్ల వాయు నాణ్యతా సూచి 'అల్ప', 'అత్యల్ప' స్థాయుల్లోనే కొనసాగుతోంది. అనారోగ్యాన్ని మరింత పెంచే ఈ కాలుష్య విషాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ నేత సోనియా లాంటి వారు నిరుడు గోవా, ఈసారి జైపూర్‌లకు తరలిపోయారంటే అర్థం చేసుకోవచ్చు.

ఇవన్నీ పర్యావరణ పరిరక్షణ పట్ల మన చిత్తశుద్ధి లేమికి ప్రతీకలు. పంట వ్యర్థాలు, దీపావళి టపాసుల విషయంలోనే కాదు... వినాయక చవితి, విజయదశమి వేళ దేవతా విగ్రహాల నిమజ్జనంలోనూ ఇదే తంతు. హైదరాబాద్ లాంటి చోట్ల హుస్సేన్‌సాగర్‌లో మట్టి విగ్రహాలే నిమజ్జనం చేయాలని ఏటేటా కోర్టు ఆదేశాలిస్తున్నాయి. ప్రభుత్వాలు సరేనని తలూపుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్నది మాత్రం వేరు. కాలుష్యకారక విగ్రహాలతో ఒకటికి మూడు రోజులు సచివాలయం సాక్షిగా నిమజ్జనాలు నడుస్తుంటాయి. సంప్రదాయాల్ని పాటించాల్సిందే. కానీ, పెరిగిన కాలుష్య ప్రమాదం దృష్ట్యా వాటిని పర్యావరణ అనుకూలంగా మార్చుకోవడం ముఖ్యం. తాగే నీరు, పీల్చే గాలిని ప్రాణాంతకంగా మార్చుకొమ్మని ఏ ధర్మమూ బోధించదు. అది గ్రహించి, మారాల్సింది మనమే!

సమాజంలో మార్పు రాత్రికి రాత్రి వస్తుందనుకోలేం. టపాసుల సంరంభాన్నీ, విగ్రహాల ఆర్భాటాన్నీ తగ్గించుకొమ్మని ప్రజలను కోరే ముందు ప్రభుత్వాలు చిత్తశుద్ధి కనబరచాలి. ఆదేశాలన్నీ అప్పటికప్పుడు తీసుకుంటున్న అత్యవసర చర్యలుగా కనిపిస్తే లాభం లేదు. పాఠాల్లో భాగంగా టీచర్ల ద్వారా పిల్లలకు అవగాహన పెంచాలి. నివాసగృహాల అసోసియేషన్లను పర్యావరణహిత చర్యల్లో భాగం చేయాలి. పర్యావరణం, ప్రజారోగ్యం అందరి బాధ్యత గనక కేంద్రం, రాష్ట్రాలు ఒక దానిపై మరొకటి నెపం మోపడం సరికాదు. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ప్రతిపక్షాలూ సహకరించడమే దీనికి సరైన పరిష్కార మార్గం. మునిసిపాలిటీ, అసెంబ్లీ నుంచి పార్లమెంట్ వరకు అందరూ కలసికట్టుగా నడవాలి. ఊపిరాడని దేశ రాజధానిలో ముందుగా ఆ అడుగులు పడాలి.

మానవాళికి హమాస్ అపచారం

అభిప్రాయం



యువల్ నోవా హరారి

ఇజ్రాయెల్ గతాన్ని చూపి హమాస్ నేరాలను సమర్థించటం ఎంతమాత్రమూ సాధ్యం కాదు. రెండు తప్పులు ఒక ఒప్పుగా మారవు. దురాక్రమణతో దశాబ్దాలుగా లక్షలాదిమంది పాలస్తీనియన్లను చెరబట్టడం, ఇటీవలి సంవత్సరాల్లో శాంతి కోసం చిత్తశుద్ధితో జరిగిన ప్రయత్నాలను వమ్ము చేయటం విషయంలో ఇజ్రాయెల్‌ను కచ్చితంగా విమర్శించాల్సిందే. అయితే హమాస్ దుశ్చర్యలు శాంతిప్రక్రియ పునఃప్రారంభం కోసం చేసినవి కాదు. ఆ దారుణాలు దురాక్రమణను అంతం చేసేవి కూడా కాదు. దానికి విరుద్ధంగా హమాస్ ప్రారంభించిన యుద్ధం లక్షలాదిమంది పాలస్తీనా పౌరుల ఎడతెగని వ్యథకు కారణమైంది.

అవీవ్ కుట్జ్ నా బాల్య స్నేహితుడికి చాలా సన్నిహిత మిత్రుడు. ఇజ్రాయెల్‌లో కఫార్ అజా ప్రాంతంలో భార్య లివ్‌నాత్, ముగ్గురు పిల్లలతో అవీవ్ చాలా కాలం నుంచి నివసిస్తున్నాడు. తమ కిబుట్జ్ (కిబుట్జ్ అంటే హిబ్రూ భాషలో పెద్ద వ్యవసాయ క్షేత్రం. స్వచ్ఛందంగా, పోటీరహితంగా పనిచేయడానికి ముందుకొచ్చే వ్యక్తుల సమూహం అక్కడ నివసిస్తుంది)పై హమాస్ జరిపే రాకెట్లు, మోర్టార్ల దాడులు చూస్తూనేవున్నా ఏదో ఒక నాటికి ప్రశాంతత ఏర్పడక పోతుందా అన్న ఆశతో కుట్జ్ కుటుంబం అక్కడే వుంటోంది. యుద్ధ క్షేత్రంలో కాస్తయినా శాంతిని వెదుక్కోవాలనే సంకల్పంతో యేటా పతంగుల పండుగ నిర్వహించటం కుట్జ్ కుటుంబానికి అలవాటు. ఆ ఉత్సవంలో రంగురంగుల గాలిపటాలు, అందులో కొన్నింటిపై శాంతి సందేశాలు– అన్నిటినీ గాజా సరిహద్దు ముళ్ల కంచెకు సమీపంలోనే ఎగరేస్తారు. 'మేం ప్రశాంతంగా జీవించాలని కోరుకుంటున్నాం తప్ప ఘర్షణను కాదని చెప్పటమే ఈ ఉత్సవ సారాంశం' అని గతంలో జరిగిన పతంగుల పండుగలో పాల్గొన్న లివ్‌నాత్ సోదరి చెప్పారు. ఈసారి పతంగుల పండుగ అక్టోబర్ 7న జరపాలని నిర్ణయించారు. కానీ ఆ ఉత్సవ ప్రారంభానికి కొన్ని గంటల ముందు హమాస్ ఉగ్రవాదులు కఫార్ అజాపై విరుచుకుపడ్డారు. దాన్ని చెరబట్టారు. కుట్జ్ అయిదుగురు కుటుంబ సభ్యులనూ హత మార్చారు.

ఇటువంటి ఉదంతాలు మనసును కలచివేస్తాయి. మనుషులు ఎందుకీ దారుణాలకు పాల్పడతారు? దీనిద్వారా హమాస్ సాధించదల్చుకున్నది ఏమిటి? ఒక ప్రాంతాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవటం సంప్రదాయ సంగ్రామం లక్ష్యంగా ఉంటుంది. హమాస్ ఉగ్రవాదం దీనికి భిన్నం. భయోత్పాతాన్ని వ్యాపింపజేయటం, లక్షలమంది ఇజ్రాయెలీ, పాలస్తీనా పౌరుల్లోనూ, ప్రపంచ ప్రజానీకంలోనూ విద్వేష బీజాలు నాటడం దాని మానసిక యుద్ధతంత్ర ఆంతర్యం.

పీఎల్ఓ వంటి ఇతర పాలస్తీనా సంస్థలకు హమాస్ భిన్నమైనది. మొత్తం పాలస్తీనా పౌరులందరితో దాన్ని సమం చేయకూడదు. హమాస్ తన పుట్టుక నుంచీ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇజ్రాయెల్ ఉనికిని, మనుగడ సాగించేందుకు దానికిగల హక్కును గుర్తించ నిరాకరిస్తోంది. ఇజ్రాయెల్, పాలస్తీనా, ఇతర అరబ్బు దేశాల పౌరుల మధ్య శాంతి సాధనకు ఏర్పడే ప్రతి అవకాశాన్నీ తన శక్తికొద్దీ ధ్వంసం చేస్తోంది. ప్రస్తుత హింసా పరంపరకు నేపథ్యం ఇజ్రాయెల్‌కూ, గల్ఫ్ దేశాలకూ మధ్య కుదురుతున్న శాంతి ఒప్పందాలు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియాల మధ్య సైతం శాంతి ఒప్పందం చిగురించబోతున్నది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్యా సాధారణ సంబంధాలు ఏర్పర్చడం



అక్టోబర్ 7న హమాస్ హతమార్చిన అవీవ్ కుట్జ్ కుటుంబం

మాత్రమే కాదు, ఇజ్రాయెల్ దురాక్రమణలో బతుకులు వెళ్లదీస్తున్న లక్షలాదిమంది పాలస్తీనా వాసులకు ఇబ్బందుల నుంచి ఉపశమనం లభించటానికి తోడ్పడుతుంది. ఇజ్రాయెల్–పాలస్తీనా మధ్య శాంతి ప్రక్రియ పునఃప్రారంభం కావటానికి దోహదం చేస్తుంది. శాంతి స్థాపన అవకాశాల కన్నా హమాస్‌ను భయపెట్టగలిగేది మరేదీ వుండదు. అందుకే అది అక్టోబర్ దాడులకు తెగబడింది. కేవలం ఆ కారణంతోనే కుట్జ్ కుటుంబ సభ్యులనూ, మరో వేయిమందికి పైగా ఇజ్రాయెలీ పౌరులనూ అత్యంత పాశవికంగా హతమార్చింది. హమాస్ చర్య దాని సంపూర్ణ అర్థంలో అక్షరాలా మానవాళికి వ్యతిరేకంగా చేసిన నేరమే. మానవత్వంలో మనకుండే విశ్వాసాన్ని ధ్వంసం చేయటమే.

ఇజ్రాయెల్ గతాన్ని చూపి హమాస్ నేరాలను సమర్థించటం ఎంత మాత్రమూ సాధ్యంకాదు. రెండు తప్పులు ఒక ఒప్పుగా మారవు. దురాక్రమణతో దశాబ్దాలుగా లక్షలాదిమంది పాలస్తీనియన్లను చెర బట్టడం, ఇటీవలి సంవత్సరాల్లో శాంతికోసం చిత్తశుద్ధితో జరిగిన ప్రయత్నాలను వమ్ము చేయటం విషయంలో ఇజ్రాయెల్‌ను కచ్చితంగా విమర్శించాల్సిందే. అయితే కుట్జ్ కుటుంబ సభ్యుల హత్య, ఇతర దుశ్చర్యలు శాంతిప్రక్రియ పునఃప్రారంభం కోసం చేసినవి కాదు. ఆ దారుణాలు దురాక్రమణను అంతం చేసేవి కూడా కాదు. దానికి విరుద్ధంగా హమాస్ ప్రారంభించిన యుద్ధం లక్షలాది మంది పాలస్తీనా పౌరుల ఎడతెగని వ్యథకు కారణమైంది.

హమాస్‌పై సాగిస్తున్న యుద్ధంలో తన ప్రాంతాన్నీ, పౌరులనూ పరిరక్షించుకోవటం మాత్రమే కాదు... తన మానవీయతను కాపాడుకోవటం కూడా ఇజ్రాయెల్ కర్తవ్యమే. తమ స్వస్థలంలో శాంతి సౌభాగ్యాలు అనుభవించే హక్కు పాలస్తీనా పౌరులకుంది. దాంతోపాటు ఘర్షణల మధ్య కూడా వారి మౌలిక మానవ హక్కులను అన్ని పక్షాలూ గుర్తించి తీరాలి. ఇది ఒక్క ఇజ్రాయెల్‌కు మాత్రమే కాదు... గాజా స్ట్రిప్‌తో సరిహద్దు వుండి, దాన్ని పాక్షికంగా మూసివేసిన ఈజిప్టుకు కూడా వర్తిస్తుంది. ఇక హమాస్ విషయానికొస్తే మానవాళి మొత్తం ఆ సంస్థనూ, దాని మద్దతుదార్లనూ వెలివేయాలి.

గాజా యుద్ధ ఉద్దేశాలేమిటో విస్పష్టంగా ఉండాలి. హమాస్‌ను నిరాయుధీకరించాలి. గాజా స్ట్రిప్‌ను నిస్సైనికీకరించాలి. అలాగైతేనే పాలస్తీనా పౌరులు గౌరవ మర్యాదలతో మనుగడ సాగిస్తారు. వారితోపాటు ఇజ్రాయెల్ పౌరులు కూడా నిర్భయంగా జీవనం కొనసాగిస్తారు. ఈ లక్ష్యాలు సాధించేంతవరకూ మన మానవీయతనుకాపాడుకోవటం ఎంతో కష్టంతో కూడుకున్న పని. తీరని వేదన అనుభవిస్తున్న పాలస్తీనియన్లకు సహానుభూతి ప్రకటించటం మానసికంగా అశక్తతలో, అచేతనలో కూరుకుపోయిన చాలామంది ఇజ్రాయెలీ పౌరులకు కష్టమే. మనసులు స్వీయ విషాదంతో నిండి పోయిన వర్తమానంలో కనీసం వేరేవారి వ్యథను గుర్తించటానికి కూడా అందులో చోటు మిగలదు. ఎన్ని కష్టాల్లోనైనా అలాంటి చోటును నిలుపుకోగలిగిన కుట్జ్ కుటుంబం, వారిలాంటి అనేకులు ఇవాళ మృత్యు ఒడికి చేరారు. లేదా తీవ్ర మనోవ్యాకులత లోనికి జారుకున్నారు. అటు పాలస్తీనా పౌరులదీ ఇదే పరిస్థితి. వారు సైతం చెప్పలేనంత వ్యథను అనుభవిస్తున్నారు. మా బాధలను గమనించే స్థితిలో లేరు.

కానీ ఈ వేదనాభరిత స్థితికి దూరంగావున్న ఇతరులంతా వాస్తవాలను పాక్షిక దృష్టితో చూసే మందబుద్ధిని వదుల్చుకుని బాధాసర్వభ్రష్టులందరికీ సహానుభూతి ప్రకటించటానికి కృషి చేయాలి. శాంతి స్థాపనకు చోటుండేలా సహాయపడటం వెలుపలి వారి కర్తవ్యం. ఆ బాధ్యతను మీకు అప్పగిస్తున్నాం. ఎందుకంటే ఆ విషయంలో మేం అశక్తులమయ్యాం. మా కోసం మీరు ఆ మంచి పని చేయండి. ఏదో ఒకరోజు ఈ కష్టాలన్నీ కడతేరినప్పుడు, ఈ గాయాలు మానినప్పుడు ఇజ్రాయెలీ పౌరులూ, పాలస్తీనా పౌరులూ ఆ చోటులో సురక్షితంగా మనుగడ సాగిస్తారు.

యువల్ నోవా హరారి ఇజ్రాయెల్ పౌరుడు. చరిత్రకారుడు, తత్వవేత్త. 'సేపియన్స్', 'హోమో డియస్', 'అన్‌స్టాపబుల్ అజ్' తదితర పుస్తకాల రచయిత.
('టైమ్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చివరి లేఖ



నా స్నేహితులకు ఒక గమనిక: మీరు దీన్ని చదువుతున్నట్టయితే, నేను వెళ్లిపోయాను. నన్ను క్షమించాలి. ఇది అర్థంలేనిదని మనిద్దరికీ తెలుసు. కారణం, అండాశయ క్యాన్సర్ నాలుగో దశ. నా సంపూర్ణ హృదయంతో ప్రతి ఒక్కరినీ ప్రేమించాను. అలాగే నేనూ అంతే లోతుగా ప్రేమను అందుకున్నానని నాకు తెలుసు. (నవంబర్ 12న న్యూయార్క్‌లో కేసీ మరణించారు.)

- కేసీ మెకింటైర్, ప్రచురణకర్త

అతిథి దేవో భవ



మా హనీమూన్ కోసం ఒబెరాయ్ వైల్డ్‌ఫ్లవర్ హాల్ (సిమ్లా)లో ఉన్నాం. సిమ్లా–కాల్కా టాయ్ ట్రెయిన్‌కు టికెట్లు బుక్ చేయమని అడిగాం. 14 మంది ప్రయాణీకులు లేకుండా రైలు నడవదని రైల్వే వాళ్లు చెప్పారు. హోటల్ కాసేపు ఆలోచించి, మొత్తం 14 టికెట్లు మా కోసం కొన్నది! (నవంబర్ 14న మరణించిన ఒబెరాయ్ హోటళ్ల సారథి 'బికీ' ఒబెరాయ్‌కి నివాళిగా.)

- అవతారం, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇవి పళ్లా?



జామపళ్లు హ్యాండ్‌బాల్ పరిమాణంలో రుచిలేకుండా వస్తున్నాయి. టెన్నిస్ బంతుల్లా ఉండే బదరీఫలాలు తింటే గొంతు పోతుంది. యాపిళ్లు కొంచెం కొరికి, కొద్ది సెకన్లు గాలికి ఉంచినా, ఎర్రగా మారిపోతున్నాయి. గత ఇరవై ఏళ్లలో పళ్ల రుచే పోయింది. ఇక, పుచ్చకాయలు వేసవిలో మాత్రమే ఆస్వాదించే వాళ్లం. ఇప్పుడు ఏడాదంతా దొరుకుతున్నాయి. కోల్డ్ స్టోరేజీ పళ్లు ఆరోగ్యం మీద ప్రభావం చూపుతున్నాయి. ప్రతి ఇంట్లో సీజన్‌లో దొరికే పళ్లేమిటో ఒక చార్ట్ ఉండాలి.

- అజయ్ సప్రా, వ్యాఖ్యాత

ఎగతాళి చేస్తారా?



కాలా పానీ (అండమాన్) జైల్లో వీర్ సావర్కర్ అనుభవించిన అమానవీయ హింసను ఏ కాంగ్రెస్ నాయకుడు కూడా చవిచూడలేదు. సావర్కర్‌ను ఎగతాళి చేసేవాళ్లు జవహర్ లాల్ నెహ్రూ విడుదల కోసం ఆయన తండ్రి వైస్రాయ్‌ను బతిమిలాడిన నాభా జైలు (పంజాబ్) ఘటనను గుర్తుంచుకోవాలి.

- విక్రమ్ సంపత్, హిస్టారియన్

ఇన్ బాక్స్

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?

వార్తలు, వర్తమాన రాజకీయాలపై అనుకూలంగా, ప్రతికూలంగా స్పందించే పత్రికా రంగం, రాజ్యాంగంలోని 19(1) (ఏ)లో పొందుపరచబడిన వాక్ స్వాతంత్ర్య భావ వ్యక్తీకరణ హక్కును పరిరక్షించుకొనే న్యాయ పోరాటాలు నేటికీ ఎదుర్కొంటూనే ఉంది. 2012లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ జస్టిస్ మార్కండేయ ఖట్జూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను ఒకే గొడుగు కిందకు తేవాలని తలచారు. అందుకు వీలుగా ప్రెస్ కౌన్సిల్ చట్టం మార్చాలని సూచించారు. పాత్రికేయ స్వేచ్ఛకు శ్రుతిమించి సంకెళ్ళు వేసే చట్టాలూ, చర్యలపై సుప్రీంకోర్టు కొరడా ఝుళిపిస్తూనే ఉంది. తెల్లదొరల కాలం నాటి కాలం చెల్లిన రాజద్రోహం అధికరణలు, పరువు నష్టం పేరిట శిక్షార్హ నేరాలుగా ఏటికేడాది పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా స్వేచ్ఛ, భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని కబళించే రాజకీయ కుయుక్తులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారతదేశ స్థానం దిగజారిపోతోంది.

1952లో ప్రెస్ కమిషన్ ఆవిర్భవించింది. ప్రస్తుతం జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 'జర్నలిజం ఏకైక లక్ష్యం సేవాధర్మం. శక్తిమంతమైన ప్రెస్ తనను తాను నియంత్రించుకోవాలి. ఆత్మ నియంత్రణతో అదుపు చేసుకోవడమే ప్రయోజనకరం' అన్నారు తన జీవిత కాలం కలం ఆయుధంగా పోరాడిన జాతిపిత గాంధీజీ.

- జయసూర్య, సీనియర్ జర్నలిస్ట్
(నేడు జాతీయ ప్రెస్ దినోత్సవం)

సమాధానం ఇవ్వగలిగే ప్రశ్నలు

కామెంట్



కరణ్ థాపర్

బహుశా నేనిది పొట్టకూటి కోసం చేస్తున్నాను కాబట్టి, ఒక విషయాన్ని లేదా పరిస్థితిని అర్థం చేసుకోవడానికి అత్యుత్తమ మార్గం దాని గురించి ప్రశ్నలు అడగటం అని నమ్ముతాను. దీనివల్ల మనకున్న అనుమానాలు తొలగిపోవడమే కాదు... ఇంకా ముఖ్యంగా అస్పష్టతలను తొలగించుకునేందుకూ, మీరు పరిగణనలోకి తీసుకుంటున్న అంశాల్లో ఇమిడి ఉన్న వైరుధ్యాలను గుర్తించేందుకూ పనికొస్తుంది. ఇవేవీ తక్షణం మీ కంటికి కనిపించకపోవచ్చు. ఇంకో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే... ప్రశ్నించడం మీరు నేరుగా ఆలోచించేందుకు అవకాశం కల్పిస్తుంది. భావోద్వేగాలు, సహజ జ్ఞానాలతో కాకుండా, తార్కికంగా విషయాన్ని అర్థం చేసుకునే వీలు ఏర్పడుతుంది.

కాబట్టి, ఇప్పుడు ఇజ్రాయెల్–హమాస్ యుద్ధానికి సంబంధించిన ప్రశ్నలు కొన్ని మీతో పంచుకుంటాను. ఐదు వారాలుగా వరదలా మీదకొచ్చి పడుతున్న సమాచారం, హృదయ విదారకమైన దృశ్యాల నుంచి మీకు ఒక అవగాహన ఏర్పడేందుకు ఇవి ఉపయోగపడవచ్చు.

మొట్టమొదటి ప్రశ్న. యుద్ధం మొదలైన నెల తర్వాత, ఇప్పటివరకూ ఏం సాధించామని ఇజ్రాయెల్ నమ్ముతోంది? 11,000కు పైగా పాలస్తీనా పౌరులను మట్టుబెట్టింది. 27,000 మంది గాయాల పాలయ్యారు. గాజాలో చాలాభాగం నేల మట్టమై, ఇటుకల దిబ్బగా మిగిలిపోయింది. అయినా హమాస్ ఎంతమాత్రమూ ఓడిపోలేదు. ప్రతిరాత్రీ అది ఇజ్రాయెల్ పైకి రాకెట్లు ప్రయోగిస్తూనే ఉంది. 'లక్షల మంది ఇజ్రాయెలీలు బాంబు షెల్టర్లలోకి పరుగులు పెట్టేలా చేస్తోంది' అని ఇజ్రాయెలీ ఆర్మీ స్వయంగా ట్వీట్ చేస్తోంది. మరి ఇజ్రాయెల్ ఏం సాధించానని నమ్ముతోంది.

రెండో ప్రశ్న. హమాస్‌ను 'తుడిచిపెట్టడం' తమ లక్ష్యమని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ ఎంత మూల్యానికి? ఇంకెన్ని ప్రాణాలు పోతే, లేదా ఆస్తులు ధ్వంసమైతే ఇజ్రాయెల్ ప్రతీకారేచ్ఛ, శిక్షించాలన్న కాంక్ష తృప్తి చెందుతుంది? లేదా హమాస్‌ను తుడిచిపెట్టేంతవరకూ అమాయక పౌరుల మారణకాండ జరగడానికీ, గాజాను ధ్వంసం చేయడానికీ సిద్ధమైందా? తాము చేస్తున్న పనులన్నీ సరైనవే అని ఇజ్రాయెల్ భావించవచ్చుగాక! నిజంగానే ఈ చర్యలు సమర్థనీయమా?

మూడో ప్రశ్న... హమాస్ అన్నది ఓ సైద్ధాంతిక ఆలోచనా? లేక సంస్థనా? ఈ ప్రశ్న యథాలాపంగా వేసుకునేది కాదు. విషయాన్ని తుదికంటా శోధించేందుకు అవకాశమున్నది. ఓ సంస్థను మట్టుబెట్టవచ్చునేమో కానీ... సిద్ధాంతానికి అంతం పలికేదెలా? పైగా ఎంత అణచివేయాలని చూస్తే... ఆ ఆలోచన అంత పదును తేలుతుంది, శక్తిమంతమవుతుంది.

నాలుగవ ప్రశ్న... హమాస్ స్థావరాలు ఉన్నాయి కాబట్టి



ఆసుపత్రులు, పాఠశాలలు, అంబులెన్సులు లక్ష్యాలుగా చేసుకుని దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ చూపుతున్న సాక్ష్యాలను హమాస్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోంది. ఒకట్రెండు సందర్భాల్లో... అల్‌జజీరా వంటి టెలివిజన్ ఛానెళ్లు సైతం ఇజ్రాయెల్ చూపిన సాక్ష్యాలను సవాలు చేశాయి. వివాద పరిష్కారం కోసం ఐక్యరాజ్య సమితి ఒక స్వతంత్ర విచారణను చేపట్టాలని హమాస్ సూచించింది. ఒకరినొకరు నమ్మడానికి సిద్ధంగా లేని ఈ పరిస్థితుల్లో ఈ సూచన సహేతుకమైనది కాదా?

ఐదవ ప్రశ్న... ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కాల్పుల విరమణకు ససేమిరా అంటున్నారు. కానీ, రోజుకు నాలుగు గంటలపాటు ఉండే 'వ్యూహాత్మక చిన్న విరామాల'కు మాత్రం అంగీకరించారు. దీనివెనుక ఉన్న నైతిక తర్కం ఏమిటి? ఇరవై నాలుగు గంటలూ వరుసగా బాంబులు కురిపిస్తూ... మధ్యలో భోజన విరామం ప్రకటించినట్టుగా లేదా ఈ ప్రతిపాదన? వధించడానికి ముందు దూడలకు కొవ్వు పెరిగేలా చేయడం లాంటిదే ఇది.

ఆరవది. ఇజ్రాయెల్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉందని పాశ్చాత్య దేశాలు నొక్కి వక్కాణించడం ఇంకా మానలేదు. అవును, ఆ హక్కు ఉంది. హమాస్ చేసింది అనాగరికం, క్రూరం, తీవ్రంగా ఖండనీయం, ఎంతమాత్రమూ క్షమార్హం కానిదే. అయితే ఆత్మరక్షణ హక్కు అంటే విచక్షణారహితంగా పౌరులను చంపే హక్కును కలిగి వుంటుందా?

ఇక్కడ ఇంకో విషయం ఉంది. ఇజ్రాయెల్ 56 ఏళ్లుగా పాలస్తీనాకు చెందిన ప్రాంతాలపై అక్రమంగా కబ్జా పెట్టిందన్న విషయం మరవొద్దు. ఈ సమయంలో సెటిల్‌మెంట్లు ఏర్పాటు చేస్తూ పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించింది. పద్ధతి, పాడు లేకుండా, విచారణ ప్రస్తావనే లేకుండా వేలమంది పాలస్తీనీయుల్ని అరెస్ట్ చేసింది. హింసించింది, చంపేసింది. గిడోన్ లెవీ, అవీ ష్లామ్ వంటి ఇజ్రాయెలీలే ఈ చర్యలను జాతి వివక్షగా అభివర్ణించారు. అటువంటప్పుడు అలాంటి ఆక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనియన్లకు ఆత్మ రక్షణ హక్కు ఉండదా?

ఏడవది, ప్రస్తుత యుద్ధం ఒక ముగింపునకు వచ్చిన తరువాత ఏం చేయాలన్న విషయంపై ఇజ్రాయెల్‌కు ఏమైనా ఆలోచన ఉందా? హమాస్ నాశనమై పోయిన తరువాత దాని స్థానాన్ని ఆక్రమించేదెవరు? ఫతా, పాలస్తీనా అధికార వర్గం ఈ పనిచేసే స్థితిలో లేవు. ఇజ్రాయెల్ ఇప్పటికే వీరిపై ఉన్న విశ్వాసాన్ని సమూలంగా దెబ్బతీసింది. అటువంటప్పుడు హమాస్ స్థానాన్ని ఆక్రమించేదెవరు? వాళ్లు ఎవరైనా పాలస్తీనా రక్షణ బాధ్యతలను ఇజ్రాయెల్ శాశ్వతంగా తలకెత్తుకుంటుందని చెబుతున్న ప్రధాని నెతన్యాహూ మాటలను నమ్ముతారా? ఆయన ఈ అంశంపై పట్టుబడితే గాజా నేలపై ఇజ్రాయెలీ మిలటరీ బూట్లు నిత్యం కాపుకాస్తూ ఉండవా? ఇదే నిజమైతే సమస్య పరిష్కారమైందెక్కడ? మళ్లీ మొదటికి వచ్చినట్లే అవుతుంది కదా?

ఇంకా ఇతర ప్రశ్నలు ఉన్నాయనడంలో సందేహం లేదు. ఇదేమీ సమగ్రమైన జాబితా కాదు. కానీ, నా వరకూ ఈ ప్రశ్నలు కీలకమైన అంశాలను లేవనెత్తుతున్నాయి. విషయాన్ని అర్థం చేసుకునేందుకు ఉపయోగపడ్డాయి. ముఖ్యంగా నాకు తెలియనివాటిని తెలిసేలా చేశాయి. నేనేం చేస్తున్నానో విశదం చేసుకోవడానికి ఇదొక మార్గం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఏది ధర్మం?

లోకంలో ధర్మం గురించి పలువురు పలు విధాలుగా అర్థం చెప్పటం, వ్యాఖ్యానించటం జరుగుతోంది. మనం ఏ కర్మ చేస్తే పూజ్యులైనవారు, మహాత్ములు హర్షించి ఆమోదం తెలుపుతారో ఆ కర్మ ధర్మమనీ; మనం ఏ కర్మ చేస్తే వారు ఆమోదం తెలుపక నిరసిస్తారో అది అధర్మమనీ చెప్పారు. పుణ్య కర్మ ధర్మం, పాప కర్మ అధర్మం అన్నారు. ఏ కర్మ చేస్తే పుణ్యం? ఏ కర్మ చేస్తే పాపం? అంటే, పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం అన్నారు. శాశ్వతంగా శ్రేయస్సు కలిగించేది ధర్మమనీ, తాత్కాలికంగా ప్రియాన్ని కలిగించేది అధర్మమనీ చెప్పారు.



సమాజంలో ఎక్కువమంది దేనిని అంగీకరిస్తారో, దానిని ధర్మమని నిర్ణయించటం యుక్తిసహంగా ఉంటుందని కొందరంటారు. కాలానుగుణంగా ధర్మం మారాలని మరి కొందరంటారు. యుగం మారినప్పుడు ధర్మశాస్త్రం మారటం అందుకు ప్రాతిపదికగా వీరు చూపుతారు.

ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలలో ధర్మం మొదటిది. ధర్మం వల్ల చిత్తశుద్ధిని పొందాలి. ధర్మం వల్ల పొందిన ధనాన్ని, దైవ కార్యానికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలి. ధర్మ లబ్ధమైన కామం వల్ల జనించిన సుఖాన్ని జీవితంలో అనుభవించాలి. అటు తరువాత మోక్షానికి ప్రయత్నించాలి. ఈ విధమైన జీవితయాత్ర నడిపిన వారు ఉత్తమ మార్గాన్ని అనుసరించినవారు అవుతారు. జీవితంలో అర్థాన్నీ, కామాన్నీ విడిచి పెట్టమని ఏ శాస్త్రమూ చెప్పదు. జీవితంలో ధర్మానికి వ్యతిరేకం కాని అర్థ సంపాదన, కామం ఉండాలి. ధర్మార్థ కామముల ద్వారా మోక్షాన్ని సంపాదించాలి.

ధర్మాన్ని ఆచరించనిదే ఎవరూ, ఏనాడూ సుఖం అనుభవించటం జరగదు. అధర్మపరుడు సుఖిస్తున్నట్టు కనపడినా అది పైపైనే, తాత్కాలికమే! ధర్మం ఆచరించే వారిని అందరూ గౌరవిస్తారు. ధర్మం ఆచరించే వారిని గౌరవించినట్టుగా, కేవలం డబ్బున్న వాణ్ణి, కాముకుణ్ణి లోకం గౌరవించదు.

- దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.తదియ ప.12.54 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** మూల రా.3.27 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.11.51 నుండి 1.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.37 వరకు, తదుపరి ప.2.22 నుండి 3.07 వరకు, **అమృత ఘడియలు:** రా.9.10 నుండి 10.44 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.08, **సూర్యాస్తమయం:** 5.21.

కౌలు రైతులకు భరోసానిస్తున్నా బాధేనా రామోజీ?

- విషపు రాతలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ఈనాడు యత్నం
- నాలుగున్నరేళ్లలో 25.82 లక్షల మందికి సీసీఆర్ కార్డులు
- ఈ పంటలో నమోదు ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు
- రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం
- అర్హత ఉన్న ప్రతి కౌలుదారునికి రుణాలు, బీమా, నష్టపరిహారం
- చంద్రబాబు హయాంలో కౌలు రైతుకు మేలు చేసే ఊసేలేదు
- అయినా అదే పనిగా ప్రభుత్వంపై రామోజీరావు బురద జల్లే ప్రయత్నం



సాక్షి, అమరావతి: గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌలురైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుంటే రామోజీరావు జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా వారికి మేలు జరుగుతుంటే విషపురాతలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. గత ప్రభుత్వాలు ఆలోచన కూడా చేయని పంట సాగు హక్కుదారుల చట్టం–2019 తీసుకురావడమే కాదు.. సీసీఆర్సీల ఆధారంగా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీతో పాటు వివిధ కారణాలతో చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 7 లక్షల పరిహారం అందిస్తున్నారు. అంతేకాదు కౌలురైతులకు ఈక్రాప్ నమోదు ప్రామాణికంగా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ), ఉచిత పంటల బీమా వంటి పథకాలు అందిస్తున్నారు. ఈ క్రాప్‌లో నమోదే ప్రామాణికంగా పండించిన పంటలను ఆర్బీకేల ద్వారా అమ్ముకోగలుగుతున్నారు. చంద్రబాబు హయాంలో కౌలు రైతులకు మేలు చేసే ఊసేలేదు. వాస్తవాలకు ముసుగేసి తప్పుడు కథనాలతో రామోజీరావు నిత్యం బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. వ్యవసాయాన్ని పండుగలామార్చిన వైఎస్ జగన్ ప్రభుత్వంపై అభాండాలు వేస్తూ 'కౌలు రైతు నోట్లో మట్టి' అంటూ ఈనాడు పత్రికలో రోత రాతలు రాశారు.

ఆరోపణ: కౌలు రైతులను ఆదుకోవడంలో 100 శాతం విఫలం

వాస్తవం: భూయజమాని హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, వారి హక్కుల రక్షణకల్పిస్తూనే వాస్తవ సాగుదారులకు పంట సాగుదారు హక్కు పత్రాల(సీసీఆర్సీ)ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తోంది. ఇందుకోసం ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు రెవెన్యూ శాఖతో కలిసి ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో అవగాహనా సదస్సులు నిర్వహిస్తోంది. 2019 నుంచి ఇప్పటివరకు 25.82 లక్షల మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేశారు.

ఆరోపణ: కౌలురైతులకు పంట రుణాలేవి

వాస్తవం: వాస్తవ సాగు దారులందరికి పంట రుణాలివ్వాలన్న సంకల్పంతో పీఏసీఎస్‌లను ఆర్బీకేలతో అనుసంధానం చేశారు. సీసీఆర్సీ కార్డులున్న వారికి రుణాలు అందిస్తున్నారు. సీసీఆర్సీ లేని కౌలు రైతులతో జాయింట్ లయబిలిటీ గ్రూపు (జేఎల్‌జీ)లను ఏర్పాటు చేసి ఈ గ్రూపుల ద్వారా వారికి రుణాలు అందేలా చేస్తున్నారు. ఇలా 2019 నుంచి ఇప్పటివరకు 13.49 లక్షల మంది కౌలుదారులకు రూ. 7,959.49 కోట్ల రుణాలు అందించారు.

ఆరోపణ: రైతు భరోసాకు మొండిచేయి

వాస్తవం: దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుదారులతో పాటు అటవీ, దేవదాయ భూమి సాగుదారులకు కూడా రూ. 13,500 చొప్పున మూడు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా అందిస్తోంది. కౌలుదారుల్లో 6 శాతం మందికి మాత్రమే రైతు భరోసా అందుతుందనడంలో వాస్తవంలేదు. మెజార్టీ కౌలు దారులు సొంత భూమి కూడా కలిగి ఉన్నారు. వీరందరికీ భూ యజమానిగా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందుతోంది. సీసీఆర్సీ కార్డుల ఆధారంగా వైఎస్సార్ రైతు భరోసా కింద ఈ 50 నెలల్లోనే దాదాపు 5.38 లక్షల మంది కౌలు రైతులకు రూ. 697.32 కోట్లు, 3.99 లక్షల అటవీ భూములు (ఆర్వోఎఫ్ఆర్) సాగు చేసే గిరిజనులకు రూ. 522.36 కోట్లు కలిపి మొత్తం 9.38 లక్షల మందికి రూ. 1,219.68 కోట్లు పెట్టుబడి సహాయంగా అందించారు.

ఆరోపణ: కౌలురైతులకు అందని సంక్షేమ ఫలాలు

వాస్తవం: కౌలుదారులకు సంక్షేమ ఫలాలు అందడం లేదనడంలో ఎంతమాత్రం వాస్తవం లేదు. వైఎస్సార్ రైతు భరోసాతో సహా భూయజమానులకు వర్తింప చేసే సంక్షేమ ఫలాలన్నీ భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగుదారులకు కూడా వర్తింప చేస్తున్నారు. సీసీఆర్సీ కార్డు ఉన్నా లేకున్నా కూడా అందిస్తున్నారు. ఈ క్రాప్ ఆధారంగా లక్ష లోపు పంటరుణాలు పొందిన కౌలుదారులకు వైఎస్సార్ సున్నావడ్డీ రాయితీ కూడా అందేలా చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 30 వేల మందికి రూ.6.26 కోట్ల సున్నా వడ్డీ రాయితీని అందించారు. అలాగే 3.55లక్షల మందికి రూ.731.08 కోట్ల పంటల బీమా పరిహారం, 2.41లక్షల మందికి 253.56 కోట్ల పంట నష్ట పరిహారం

కౌలుదారుల కుటుంబాలకు నేరుగా పరిహారం

వ్యవసాయాధారిత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్న కౌలుదారులకు సీసీఆర్సీ కార్డు ఉంటే రూ. 7 లక్షలు, లేకుంటే వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష పరిహారం నేరుగా బాధిత కౌలురైతు కుటుంబ సభ్యుల ఖాతాకు జమ చేస్తున్నారు. ఇలా 2019 నుంచి ఇప్పటి వరకు 1,270 కేసులకు సంబంధించి రూ.88.90 కోట్ల పరిహారం చెల్లించారు. ఇందులో 485 మంది కౌలురైతులుండగా, ఆ కుటుంబాలకు రూ. 33.95 కోట్ల ఆర్థిక సాయం అందించారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రైతు ఆత్మహత్యలపై పునర్విచారణ జరిపి 474 మందికి రూ. 23.70 కోట్ల పరిహారం చెల్లించగా, వీరిలో కూడా 212 మంది కౌలురైతులున్నారు. వీరికి రూ. 10.60 కోట్ల పరిహారం చెల్లించారు.

బాబు హయాంలో కౌలురైతులను ఆదుకున్నదేది?

చంద్రబాబు హయాంలో కౌలు రైతులకు కనీసంగా అంటే కనీసంగా కూడా ఆదుకున్న దాఖలాలు లేవు. ఏటా అరకొరగా తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఎల్ఈసీ కార్డులు జారీ చేయడం తప్ప ప్రభుత్వ పరంగా ఏ ఒక్క సంక్షేమ ఫలాలు అందించిన జాడే లేదు. కౌలుదారుల్లో 80 శాతం మందికి పైగా భూయజమానులతో ఎలాంటి లిఖిత పూర్వక ఒప్పందం లేకుండా భూమిని కౌలుకు తీసుకుంటారు. అధీకృత ఒప్పందాల్లేక పోవడం వలన ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, రాయితీలే కాదు కనీసం పంట రుణాలు కూడా దక్కేవి కావు. టీడీపీ హయాంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతులకు రూ. 5 లక్షల పరిహారం ఇచ్చేవారు. కానీ దీన్లో రూ.1.5 లక్షల్ని అప్పులకు జమ చేసుకుని, మిగిలిన 3.5 లక్షలు కూడా విత్‌డ్రా చేసుకునేందుకు వీలు లేకుండా డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని మాత్రమే వాడుకునే పరిస్థితి కల్పించేవారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పరిహారాన్ని రూ.5 లక్షలనుంచి రూ.7 లక్షలకు పెంచడమే కాదు. ఆ మొత్తాన్ని నేరుగా ఆత్మహత్యలకు పాల్పడే రైతు కుటుంబాల ఖాతాలకు జమ చేస్తోంది. కౌలు రైతు అయినా వ్యవసాయ కారణాలతో చనిపోతే దేశంలో రూ.7 లక్షల పరిహారం ఇస్తున్నది ఒక్క మన రాష్ట్రంలోనే.

అనకాపల్లి జనసేనలో భగ్గుమన్న విభేదాలు

టీడీపీ–జనసేన ఆత్మీయ సమావేశం రసాభాస




టీడీపీ–జనసేన ఆత్మీయ సమావేశంలో జనసేన నాయకుల తోపులాట

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఇరువర్గాల తోపులాట ఒకదశలో దాడిచేసుకునేంత వరకు వెళ్లింది. దీంతో అనకాపల్లిలో టీడీపీ–జనసేన బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశం రసాభాసగా జరిగింది. తమకు మైక్ ఇవ్వలేదంటూ జనసేనలో ఒక వర్గం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరుచూరి భాస్కరరావుతో గొడవకు దిగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా అనామకుల్ని తీసుకొచ్చి సభలో ప్రాధాన్యం కల్పించడంతో తమకు అన్యాయం జరుగుతోందంటూ ఒక వర్గానికి చెందిన కొందరు నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ సమావేశంలో తొలుత మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు మాట్లాడారు. అనంతరం ద్వితీయస్థాయి జనసేన నాయకుడు మంగా ఈశ్వరరావు మాట్లాడుతుండగా.. జనసేనలో మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న తమకు మైక్ ఇవ్వకుండా తమ తర్వాత వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తూ తమను అవమానించారంటూ మరో వర్గానికి చెందిన దూలం గోపి తదితరులు గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఒకరినొకరు తోసుకుంటూ కేకలు వేసుకుంటూ బాహాబాహీకి సిద్ధమయ్యారు. టీడీపీ నాయకులు కల్పించుకుని రెండువర్గాలను శాంతింపజేశారు. మీ పార్టీలో తగాదాలు ఇక్కడ ప్రదర్శించడం తగదంటూ కొందరు టీడీపీ నాయకులు జనసేన నేతలపై అసహనం వ్యక్తం చేశారు. జనసేనతో పొత్తు నేపథ్యంలో తమపైన కూడా తిరగబడేలా ఉన్నారంటూ కొందరు టీడీపీ నాయకులు వాపోయారు.

సర్వభూపాలునిపై సర్వాంతర్యామి

- వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు
- గరుడ వాహనంపై విహరించిన శ్రీవారి దేవేరి
- పోటెత్తిన భక్తజన సందోహం



సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న పద్మావతీ అమ్మవారు



అశేష భక్తజనం మధ్య మాడవీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తున్న సౌభాగ్యలక్ష్మి

చంద్రగిరి(తిరుపతి జిల్లా): శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆరవ రోజైన బుధవారం ఉదయం హరి అంతరంగ అలిమేలు మంగ సర్వభూపాలునిపై ఉట్టి కృష్ణుడు అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు అమ్మవారిని అద్దాల మహల్ నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. పట్టుపీతాంబర స్వర్ణాభరణాలతో అమ్మవారిని చేతితో ఉట్టి కొడుతున్న శ్రీకృష్ణుడిగా అలంకరించారు. ఎనిమిది గంటలకు భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళ వాయిద్యాలు, జియ్యర్ స్వాముల ప్రబంధ పారాయణం నడుమ అమ్మవారు సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు.

స్వర్ణరథంపై సౌభాగ్యలక్ష్మి

అమ్మవారు సాయంత్రం సౌభాగ్యలక్ష్మిగా స్వర్ణరథంపై తిరువీధుల్లో భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహన సేవకు ముందు స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్నపన తిరుమంజనం అనంతరం అమ్మవారిని మహాలక్ష్మి స్వరూపిణిగా అలంకరించి రథ మండపానికి వేంచేపుగా తీసుకొచ్చి స్వర్ణరథంపై కొలువుదీర్చారు. సాయంత్రం 4.20 గంటలకు భక్తుల కోలాటాలు, భజన బృందాలు నడుమ సర్వతేజోమయి అయిన అమ్మవారు స్వర్ణరథంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి గరుడ వాహనంపై శ్రీవారి దేవేరి శ్రీపద్మావతి అమ్మవారు తిరువీధుల్లో విహరించారు. వాహన సేవల్లో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాశస్త్యం దెబ్బతినేలా కట్టడాలు చేపట్టవద్దు

దేవదాయ శాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: పురాతన, పాత ఆలయాల ప్రాశస్త్యం దెబ్బతినేలా లోపల, బయట ఎలాంటి ఇంజినీరింగ్ కట్టడాలను చేపట్టవద్దంటూ అన్ని జిల్లాల దేవదాయశాఖ అధికారులతోపాటు, ఆలయాల ఈవోలకు దేవదాయశాఖ సూచించింది. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. స్థానికంగా భక్తులు విరాళం ఇచ్చారనే కారణంగా పురాతన రాతి కట్టడాలతో నిర్మితమైన ఆలయాల్లో గోడలకు, రాతి స్తంభాలకు కొత్తగా సిమెంట్ పూతలు పూయడం, లేదంటే రంగులు వేయడం, టైల్స్ అంటించడం వంటివి చేపట్టవద్దంటూ ఆదేశాల్లో సూచించారు. కమిషనర్ అనుమతిలేకుండా నిర్మాణాలు చేపట్టకూడదని, ఆలయాల లోపల మరో చిన్న ఆలయాలు, వేరొక స్వామివార్ల విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు.

జమా ఖర్చులపై డిస్‌ప్లే బోర్డులు

రాష్ట్రంలోని దేవదాయశాఖ పరిధిలో ఉండే ఆలయాల్లో భక్తులిచ్చే కానుకలు, ఇతర ఆదాయ, వ్యయాలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచనలు చేశారని కమిషనర్ ఎస్ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ ఆదిశంకర జయంతి, శ్రీ రామానుజ జయంతి, శ్రీ విఖనస జయంతి, శ్రీ మధ్వాచార్యులు తదితర ప్రముఖ హైందవ మత గురువుల జయంతులను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు.

10 లక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్లు.. 2025-26 నుంచి

- వెల్లడించిన ఎన్ఎంసీ
- వచ్చే ఏడాది మనకు 5 కాలేజీలకు మార్గం సుగమం



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా 10 లక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్ల ప్రాతిపదికన కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే నిబంధనను 2025–26 విద్యాసంవత్సరం నుంచి అమలుచేస్తామని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) వెల్లడించింది. ఈ మేరకు ఎన్ఎంసీ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ వి.వానికర్ బుధవారం ప్రకటించారు. దీంతో వచ్చే ఏడాది మన రాష్ట్రానికి రావాల్సిన ఐదు వైద్యకళాశాలలకు అనుమతికి మార్గం సుగమమైంది. 10 లక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్ల ప్రాతిపదికన కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే నిబంధనను 2024–25 విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి తెస్తున్నట్టు ఈ ఏడాది ఆగస్టులో ఎన్ఎంసీ ప్రకటించింది. ఈ నిబంధనతో ఏపీతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో కొత్త వైద్యకళాశాలల ఏర్పాటుకు అవకాశంలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయడంతో పాటు అన్ని ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు చేరువ చేయడం, మన విద్యార్థులకు వైద్యవిద్య అవకాశాలు పెంచడం కోసం సీఎం జగన్ ప్రభుత్వం 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 2023–24 విద్యాసంవత్సరంలో ఐదు కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. 2024–25లో మరో ఐదు వైద్యకళాశాలల కోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేశారు. తాజా నిబంధనలు అమలు చేస్తామన్న నేపథ్యంలో వీటిపై ఎన్ఎంసీ పునఃసమీక్షించాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్‌తో పాటు పలు రాష్ట్రాల సీఎంలు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కలిసిన ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఈ నిబంధనలను పునఃపరిశీలించాలని కోరారు. ఈ వినతికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో తాజా నిబంధనలను 2025–26 నుంచి అమలు చేస్తామని ఎన్ఎంసీ ప్రకటించడం గమనార్హం.

టీడీపీ వంటావార్పులో వైఎస్సార్‌సీపీ 'వాస్తవాల వడ్డన'

- టిడ్కో ఇళ్లను బ్యాంకులకు తాకట్టు పెట్టింది టీడీపీయేనని తేల్చిచెప్పిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పాలకొల్లు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపీ హౌస్ అరెస్ట్
- పోలీసుల తోపులాటలో స్పృహ కోల్పోయిన గోపీ



పాలకొల్లులో వాస్తవాల వడ్డన సభకు వెళుతున్న గోపీని అడ్డుకుంటున్న పోలీసులు

పాలకొల్లు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో టిడ్కో గృహాల సముదాయంలో బుధవారం చేపట్టిన వంటావార్పు కార్యక్రమానికి దీటుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వాస్తవాల వడ్డన' కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపీ) పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. ఇరుపక్షాలకు అనుమతులు లేనందున టిడ్కో గృహాల్లో ఎలాంటి సభలు, ఇతర కార్యక్రమాలు చేపట్టకూడదని డీఎస్పీ ఎస్.మనోహరాచారి సూచించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పోలీసులు మోహరించారు. ఈ సమయంలో పోలీసులకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. 'ఎమ్మెల్యే నిమ్మల డ్రామాలు ఆపాలి, చిల్లర రాజకీయాలు మానుకోవాలి, టిడ్కో ఇళ్లను బ్యాంకులకు తాకట్టు పెట్టింది టీడీపీ ప్రభుత్వమే' అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

స్పృహ తప్పిన గోపీ.. ఎమ్మెల్యే అరెస్ట్

కాగా.. గాంధీ బొమ్మల సెంటర్‌కి వెళ్లి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలదండ వేసి వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపీ పోలీసులను కోరినా అనుమతి ఇవ్వలేదు. ఈ తరుణంలో పోలీసులకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు తోపులాట జరగడంతో ఆయన స్పృహ కోల్పోయారు. ఆయన్ను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మరోవైపు టిడ్కో లబ్ధిదారులను తప్పుదారి పట్టిస్తూ చేపట్టిన వంటావార్పు కార్యక్రమానికి పిలుపునిచ్చిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో ఆయన పోలీసులను ఏమార్చి తన ఇంటి దొడ్డి గుమ్మం నుంచి బయటకు వెళ్లి సమీపంలోని పూలపల్లి సెంటర్‌కి చేరుకోగా అక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ని పెనుగొండ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కేసు నమోదు చేసిన అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్టు పట్టణ సీఐ డి.రాంబాబు తెలిపారు. క్రైమ్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వరరావు, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

పారదర్శకంగా పంటకోత ప్రయోగాలు

వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న బెట్ట పరిస్థితుల దృష్ట్యా పంటకోత ప్రయోగాలను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్వహించి వాస్తవ దిగుబడులను కచ్చితంగా నమోదు చేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు, ప్రణాళిక రూపకల్పనపై వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులతో పాటు సంబంధిత బీమా కంపెనీల ప్రతినిధులతో బుధవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు జరిగిన పంటకోత ప్రయోగాల పురోగతిపై డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ నివేదికను సమర్పించారు. దిగుబడి, వాతావరణ ఆధారిత పంటల బీమా అమలుకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

క్లుప్తంగా...

నేడు ఆన్‌లైన్‌లో శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం టికెట్లు

తిరుమల: హిందూ సనాతన ధర్మప్రచారంలో భాగంగా అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో ఈ నెల 23 నుంచి శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ప్రారంభించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం ఆన్‌లైన్ టికెట్లను గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. టికెట్ ధర రూ.1000గా నిర్ణయించారు. ఒక టికెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని, ఈ హోమంలో పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కాగా, శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ఏర్పాట్లను బుధవారం జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. హోమం నిర్వహణ, భక్తులు కూర్చునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

మరింత పటిష్టంగా ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు

2 నెలల్లోగా పనులు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి/సాక్షిప్రతినిధి, విజయవాడ: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయం ఘాట్ రోడ్డు పటిష్టత పనులను 2 నెలల్లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు పటిష్టత పనులపై సమీక్షించారు. ఈ పనులకు టెండర్ల ప్రక్రియను వెంటనే మొదలుపెట్టాలని ఆదేశించారు. కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నచోట్ల సెన్సార్లను ఏర్పాటు చేయవచ్చో లేదో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇంద్రకీలాద్రిపై చేపడుతోన్న పలు పనుల వివరాలను తెలుసుకున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ..రూ.2 కోట్లతో 180 మీటర్ల పొడవున ఈ ఘాట్ రోడ్డును పటిష్టం చేయనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ నగర సీపీ కాంతి రాణా టాటా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశారదా పీఠంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

రేపు స్వరూపానందేంద్ర సరస్వతి జన్మదినోత్సవం



పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠంలో పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పెందుర్తి మండలం చినముషిడివాడలోని శ్రీశారదాపీఠంలో స్వామీజీ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, అనంతరం స్వామీజీ చేతుల మీదుగా పీఠ ప్రాంగణంలోని దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవతకు అభిషేకాలు చేస్తారు. పండితులు ఆయుష్య హోమం, అవహంతి హోమం చేపట్టనున్నారు. అనంతరం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వరూపానందేంద్రకు పాదపూజ చేసి బిక్షావందనం సమర్పిస్తారు. మధ్యాహ్నం వేదసభలో పండితులు పాల్గొని పలు అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం నిరుపేదలకు వస్త్రదానం చేస్తారు. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, హరియాణ, ముంబయి ప్రాంతాల్లో స్వామీజీ శిష్యులు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఏటా నాగుల చవితి రోజున స్వామీజీ జన్మదినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

జనసేనకు 'విశాఖ' ఈశ్వర్‌రెడ్డి రాజీనామా



కొమ్మాది (విశాఖపట్నం): జనసేన విశాఖ పార్లమెంట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వేముల ఈశ్వర్ రెడ్డి బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం, పార్టీ పెట్టిన దగ్గర నుంచి నేటి వరకు ఒంటరిగా ప్రజల్లోకి వెళ్లకపోవడం వంటివి ఇష్టంలేక పార్టీకి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం పార్టీలో అనేకమంది నేతలు వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

జనసేన పార్టీ ఎన్డీయేలో భాగస్వామే : జీవీఎల్

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ ఇప్పటికి జనసేనతోనే పొత్తు కొనసాగిస్తోందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. జనసేన.. బీజేపీ సారథ్యంలో నడిచే ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నందున ముందు కూడా పొత్తు కొనసాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విశాఖ బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీ ఎన్నికలపై బీజేపీ అధిష్టానం పూర్తి స్థాయి కార్యాచరణను రూపొందిస్తోందన్నారు. త్వరలో రాష్ట్రానికి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు వస్తారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగిపోయిందని తెలిపారు. 2021 జనవరిలో ఈ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిర్ణయం జరిగిందని, అయితే ఆ తర్వాత ఆరు నెలల్లోపు ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ) ప్రక్రియ మొదలు కావాల్సి ఉన్నా అది జరగలేదన్నారు.

క్లుప్తంగా...

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఓటర్లకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేయాలని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచార పర్వం ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం 'ఎక్స్'లో ఆయన ఈ మేరకు పోస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ వారసత్వ, ప్రతికూల రాజకీయాలతో జనం విసుగెత్తిపోయారని వెల్లడించారు. బీజేపీని గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. జనం ఆకాంక్షలను నెరవేర్చడం తమ బాధ్యత అని వివరించారు. కాంగ్రెస్ ఇస్తున్న డొల్ల హామీలు నమ్మొద్దని, సుపరిపాలన అందించే బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. తమ పార్టీ పట్ల జనం అచంచల విశ్వాసం చూపుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ వల్లనే ప్రగతి సాధ్యమని వారు నమ్ముతున్నారని వివరించారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్ల కలిగే మేలు ఏమిటో మధ్యప్రదేశ్ ప్రజలు ఇప్పటికే గుర్తించారని తెలిపారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఛత్తీస్‌గఢ్ ప్రజలకు సూచించారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించి, బీజేపీని గెలిపిస్తారన్న నమ్మకం తనకు సంపూర్ణంగా ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఆప్తమిత్రులకు గోల్డెన్ పాస్‌పోర్టా?: రాహుల్

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అన్న వినోద్ అదానీ సహా 66 భారతీయులు సైప్రస్ వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం 'గోల్డెన్ పాస్‌పోర్ట్' మంజూరు చేసినట్లు వస్తున్న వార్తలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. 'అమృత్‌కాల్‌లో ఆప్తమిత్రులైన ఆ సోదరులిద్దరూ దేశం విడిచి ఎందుకు వెళ్లారు? గోల్డెన్ పాస్‌పోర్టు అంటే ప్రజాధనాన్ని దోచుకుని, డొల్ల కంపెనీలు పెట్టుకుని, విదేశాల్లో జల్సా చేసేందుకు బంగారంలాంటి అవకాశం'అని బుధవారం రాహుల్ గాంధీ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. రాహుల్ ఆరోపణలపై బీజేపీ దీటుగా స్పందించింది. సైప్రస్ ఇన్వెస్టిమెంట్ ప్రోగ్రామ్ లేదా గోల్డెన్ పాస్‌పోర్ట్ పథకాన్ని 2007లో కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందని గుర్తు చేసింది. పన్ను ఎగవేతదారులకు లాభించేలా సైప్రస్‌తో ఒప్పందం కూడా కుదుర్చుకుందని తెలిపింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక, ఈ విధానంపై నియంత్రణలు తీసుకువచ్చామని పేర్కొంది.

ఎన్నికల వేళ భారీగా సొత్తు సీజ్: సీబీడీటీ

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మిజోరంలలో లెక్కల్లో చూపించని నగదు భారీగా పట్టుబడుతున్నట్లు ఆదాయ పన్ను విభాగం సీబీడీటీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్)తెలిపింది. ఆయా రాష్ట్రాల్లో 2019లో జరిగిన లోక్‌సభ లేదా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కంటే చాలా ఎక్కువగా ఉన్నట్లు సీబీడీటీ చైర్మన్ నితిన్ గుప్తా బుధవారం తెలిపారు. సోదా, నిఘా చర్యలను ఎన్నికల కమిషన్ సమన్వయంతో చేపడుతున్నామని వివరించారు. అసెంబ్లీ ఎన్నికలున్న రాజస్తాన్‌లో పట్టుబడిన అక్రమ నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం, వెండి తదితరాల మొత్తం విలువ మూడింతలయిందన్నారు. 2021లో సీజ్ చేసిన మొత్తం సొత్తు విలువ రూ.322 కోట్లు కాగా, 2022లో అది రూ.322 కోట్లకు, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.1,021 కోట్లకు పెరిగిందని గుప్తా పేర్కొన్నారు.

రాజస్తాన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మృతి

జైపూర్: రాజస్తాన్‌లోని కరన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి అయిన గుర్మీత్ సింగ్ కూనార్(75) మృతి చెందారు. అనారోగ్యం పాలైన కూనార్‌ను ఈ నెల 12న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన బుధవారం చనిపోయారని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఈ నెల 25న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కరన్‌పూర్‌లో ఆయన పోటీ చేస్తున్నారు. కూనార్ మృతితో కరన్‌పూర్ స్థానానికి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల తేదీని తర్వాత ప్రకటిస్తామంది.

బైడెన్‌తో జిన్‌పింగ్ భేటీ

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో చైనా అధినేత షీ జిన్‌పింగ్ సమావేశానికి రంగం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటిన ఈ భేటీ జరుగనుంది. ఇటీవలి కాలంలో అమెరికా–చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ఇరువురు నాయకుల సమావేశం అవుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంబంధాలను పునరుద్ధరించుకొనే దిశగా వారిద్దరూ చర్చలు జరుపనున్నట్లు తెలుస్తోంది. ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార మండలి(ఏపీఈసీ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు జిన్‌పింగ్ మంగళవారం అమెరికా చేరుకున్నారు. ఆయన అమెరికాకు రావడం ఆరేళ్ల తర్వాత ఇదే మొదటిసారి.

కర్ణాటక బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయేంద్ర

బెంగళూరు: కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన బీవై విజయేంద్ర బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ సీఎంలు బీఎస్ యడియూరప్ప, బస్వరాజ్ బొమ్మై, డీవీ సదానంద గౌడ, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు. మాజీ సీఎం యడియూరప్ప కుమారుడే విజయేంద్ర.

రణరంగం అల్–షిఫా

గాజా ఆసుపత్రిలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం

అణువణువూ సోదాలు • నిర్బంధంలోకి అనుమానితులు



బుధవారం గాజాలోని అల్‌-షిఫా ఆస్పత్రిలోకి దూసుకొస్తున్న సాయుధ ఇజ్రాయెల్ సైనికులు

ఖాన్ యూనిస్: గాజాలో నెల రోజులకుపైగా హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం సాగిస్తున్న యుద్ధం కీలక దశకు చేరుకుంది. గాజాలో అతిపెద్దదైన అల్–షిఫా ఆసుపత్రిలోకి బుధవారం ఉదయం ఇజ్రాయెల్ సేనలు ప్రవేశించాయి. హమాస్ కమాండ్ సెంటర్ ఇక్కడే భూగర్భంలో ఉందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఆసుపత్రి కింది భాగంలో సొరంగాల్లో హమాస్ నాయకులు మాటు వేశారని చెబుతోంది. మిలిటెంట్లపై కచ్చితమైన, లక్షిత ఆపరేషన్ ప్రారంభించామని ప్రకటించింది. అల్–షిఫా హాస్పిటల్ ఇప్పుడు రణభూమిగా మారిపోయింది. ఇజ్రాయెల్ సైనికులు ప్రతి గదినీ అణువణువూ గాలిస్తున్నారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్నంగా ప్రశ్నిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. అన్ని డిపార్టుమెంట్లలో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు, సైనిక వాహనాలు సైతం అల్–షిఫా ఆసుపత్రి ప్రాంగణంలో మోహరించాయి. అల్–షిఫా హాస్పిటల్‌లో ఇజ్రాయెల్ సైనికులు దారుణంగా ప్రవర్తిస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు, ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. పురుషులను నగ్నంగా మార్చి, కళ్లకు గంతలు కట్టి నిర్బంధిస్తున్నారని తెలిపారు. తరచుగా తుపాకీ మోతలు వినిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ వార్డుల్లో 180కి పైగా మృతదేహాలు పడి ఉన్నాయని, బయటకు తరలించేవారు లేక కుళ్లిపోతున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ పరిస్థితి భయానకంగా ఉందన్నారు. 16 నుంచి 40 ఏళ్ల లోపు పురుషులంతా ఆసుపత్రి గదుల నుంచి బయటకు వెళ్లాలని, బయట అందరూ ఒకేచోటుకు చేరుకోవాలని లౌడ్‌స్పీకర్‌లో అరబిక్ భాషలో ఇజ్రాయెల్ సైనికులు హెచ్చరికలు జారీ చేశారని ఓ ప్రత్యక్ష సాక్షి చెప్పారు. పురుషులను బట్టలు విప్పించి ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. 200 మందిని దూరంగా తీసుకెళ్లారని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని మొత్తం ఇజ్రాయెల్ సైనికులు అదుపులోకి తీసుకున్నారని, ఇతర భవనాలతో కాంటాక్ట్ లేకుండాపోయిందని ప్రధాన భవనంలోని డాక్టర్లు చెప్పారు.

ఇజ్రాయెల్ వాదనకు అమెరికా మద్దతు

అల్–షిఫా హాస్పిటల్ కింద సొరంగాల్లో హమాస్ కమాండ్ సెంటర్ ఉందన్న ఇజ్రాయెల్ వాదనకు అమెరికా మద్దతు పలికింది. కమాండ్ సెంటర్‌ను తమ నిఘా వర్గాలు గుర్తించాయని వెల్లడించింది. అయితే, ఇజ్రాయెల్, అమెరికా ప్రకటనలను హమాస్ తీవ్రంగా ఖండించింది.

ఐరాస సెక్రెటరీ జనరల్ ఆందోళన

అల్–షిఫా ఆసుపత్రిలో ఇజ్రాయెల్ సేనల తనిఖీలను ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ ఖండించారు. ఇజ్రాయెల్ చర్య ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు బుధవారం కూడా కొనసాగాయి. ఈ దాడుల్లో కనీసం 14 మంది మరణించినట్లు తెలిసింది.

అల్‌-షిఫా ఎందుకంత ముఖ్యం?

అల్–షిఫా అంటే స్వస్థత కేంద్రం అని అర్థం. గాజాలోనే అతిపెద్దదైన ఈ ఆసుపత్రిని 1946లో అప్పటి బ్రిటిష్ పాలనలో విశాలమైన ప్రాంగణంలో నిర్మించారు. దీన్ని గాజా గుండెచప్పుడు, ఆరోగ్య ప్రదాయినిగా పరిగణిస్తుంటారు. వైద్య సేవల విషయంలో ఇదొ వెన్నుముక లాంటింది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడల్లా అల్–షిఫా హాస్పిటల్‌పై దాడులు జరగడం పరిపాటిగా మారింది. 2008–2009లోనూ ఒక్కడ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. 2014లో జరిగిన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధ సమయంలో అల్–షిఫా హాస్పిటల్‌లో 9 రోజులపాటు వైద్య సేవలు నిలిచిపోయాయి. హమాస్ మిలిటెంట్లు ఈ ఆసుపత్రిని ప్రధాన స్థావరంగా మార్చుకున్నారని ఇజ్రాయెల్ గత కొన్ని దశాబ్దాలుగా ఆరోపిస్తోంది.

సెకన్‌కు 150 సినిమాలు

చైనాలో ప్రపంచంలోనే అత్యంత వేగవంత నెట్‌వర్క్ ఆవిష్కరణ

బీజింగ్: ప్రపంచంలోనే అతి వేగవంతమైన ఇంటర్నెట్ నెట్‌వర్క్‌కు చైనా వేదికగా నిలిచింది. ఈ నెట్‌వర్క్‌లో 150 అత్యంత నాణ్యమైన చిత్రాలను ఒకేఒక్క సెకన్‌లో ట్రాన్స్‌మిట్ చేసేయొచ్చు. ఈ నెట్‌వర్క్‌లో సెకనుకు 1.2 టెరాబైట్స్ వేగంతో డేటా ట్రాన్స్‌మిట్ అవుతుంది. కొత్త నెట్‌వర్క్ ఏర్పాటు వివరాలను సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న ప్రధాన ఇంటర్నెట్ రూట్స్ కంటే కూడా ఈ అధునాతన నెట్‌వర్క్ ఏకంగా 10 రెట్లు వేగంగా డేటా బదిలీ పనులను పూర్తిచేయగలదని పేర్కొంది. టిసింగ్‌హువా విశ్వవిద్యాలయం, చైనా మొబైల్, హువాయీ, సెర్నెట్.కామ్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధిచేశాయి. ప్రత్యేకమైన ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల సాయంతో ఈ నెట్‌వర్క్‌ను మూడువేల కి.మీ.ల మేర ఏర్పాటు చేశారు. బీజింగ్, వూహాన్, గ్వాంగ్జూ నగరాలను కలుపుతూ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అంతటా వినియోగంలో ఉన్న ప్రధాన నెట్‌వర్క్‌లు సెకన్‌కు 100 గిగాబైట్ల డేటాను ట్రాన్స్‌మిట్ చేస్తున్నాయి. అయితే నూతన నెట్‌వర్క్ సెకన్‌కు 1.2 టెరా బైట్ల వేగంతో డేటాను బదిలీ చేయగలదు. అమెరికాలో ఇటీవల ప్రారంభించిన ఐదో తరం ఇంటర్నెట్–2లో అత్యధికంగా సెకన్‌కు 400 గిగాబైట్ల వేగంతో డేటా ట్రాన్స్‌మిట్ అవుతోంది. చైనా ఎడ్యుకేషన్, రీసెర్చ్ నెట్‌వర్క్, చైనా ఫ్యూచర్ ఇంటర్నెట్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(ఎఫ్ఐటీఐ)లో భాగంగానే ఈ ప్రాజెక్టును మొదలెట్టారు. దీనిని జూలైలో యాక్టివేట్ చేయగా నవంబర్ 13వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెట్‌వర్క్ అన్ని రకాల పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ''150 హైడెఫినేషన్ చిత్రాలకు సమానమైన డేటాను కేవలం ఒక్క సెకన్‌లో ఈ నెట్‌వర్క్ సాయంతో బదిలీచేయవచ్చు'' అని హువావే టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ వాంగ్ వివరించారు. ''ఈ సూపర్ ఫాస్ట్ లైన్ కేవలం వాణిజ్య కార్యకలాపాలకే కాదు భవిష్యత్తులో మరింత వేగవంతమైన ఇంటర్నెట్ సేవల కల్పనకు ఎంతగానో దోహదపడుతుంది'' అని చైనీస్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఎఫ్ఐటీఐ ప్రాజెక్ట్ లీడర్ వూ జియాంగ్‌పింగ్ చెప్పారు.

దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ–దర్భంగా స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయి. బుధవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో యూపీలోని ఇటావా సమీపంలో జరిగిన ఈ ఘటనతో ఒక బోగీ పూర్తిగా, మరో రెండు బోగీలు పాక్షికంగా కాలిపోగా, నాలుగో కోచ్‌లో దట్టమైన పొగ వ్యాపించింది. ఎనిమిది మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు కాగా, ఆయా బోగీల్లో ప్రయాణికులు తమ వస్తువులను కోల్పోయారని అధికారులు తెలిపారు. ప్రమాదం బారిన పడిన నాలుగు బోగీలను వదిలేసి రైలు రాత్రి 8.18 గంటల సమయంలో ఇటావా నుంచి కాన్పూర్‌కు బయలుదేరిందన్నారు.

రోదసీలో టూల్‌బ్యాగ్ చక్కర్లు

న్యూయార్క్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) బయటివైపు మరమ్మతుల కోసం తీసుకెళ్లిన టూల్‌బ్యాగ్ ఒకటి కనిపించకుండా పోయింది. అది ఎక్కడ పడిపోయిందా అని అంతటా వెతికితే అది అంతరిక్షంలో చక్కర్లు కొడుతోందని తేలింది. అది తిరుగుతూ తిరుగుతూ ఎక్కడ మళ్లీ అంతరిక్ష కేంద్రాన్నే ఢీకొడుతుందనే భయం మధ్యే అసలు విషయాన్ని బయటిపెట్టింది అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా). నవంబర్ ఒకటో తేదీన జరిగిన ఈ ఘటనను తాజాగా బహిర్గతంచేసింది.

అసలేం జరిగిందంటే?

ఆరోజు వ్యోమగాములు మేజర్ జాస్మిన్ మోగ్‌బెలీ, లోరల్ ఓహారాలు ఐఎస్ఎస్ బయటివైపు ఉన్న హ్యాండ్లింగ్ బార్ ఫిక్చర్, బేరింగ్‌లను తొలగించి కొత్తవి అమర్చేందుకు స్పేస్‌వాక్ చేశారు. బయటే వారు ఆరు గంటల 42 నిమిషాలసేపు గడిపారు. తర్వాత స్పేస్‌స్టేషన్‌లోకొచ్చి మిగతా పనుల్లో పడిపోయారు. ''వెంట తీసుకెళ్లిన వస్తువుల జాబితాను సరిచూసుకోగా ఈ బ్యాగ్ మిస్సయింది. టూల్ బ్యాగ్ దొరకలేదు. స్పేస్‌వాక్ చేసిన ప్రతిసారీ ఆ బ్యాగ్‌తో పనిపడదు. అందుకే దానిని తిరిగి వెంట తేవడం వాళ్లు మర్చిపోయారు. అంతరిక్షంలో ఆ బ్యాగ్ పథమార్గాన్ని బట్టిచూస్తే అది ఒకవేళ అంతరిక్ష కేంద్రాన్ని ఢీకొన్నా ఐఎస్ఎస్‌కు పెద్దగా ముప్పు వాటిల్లకపోవచ్చు'' అని నాసా ఒక ప్రకటనలో పేర్కొంది. అంతరిక్షంలో చక్కర్లు కొడుతూ ఒక వెలుగులా కనిపించే టూల్‌బ్యాగ్ జాడను ఎర్త్‌స్కై అనే వెబ్‌సైట్ కనిపెట్టింది. ' టూల్‌బ్యాగ్ భూమికి ఏకంగా 400 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతోంది. మేఘాలు లేకుండా ఆకాశం స్వచ్ఛంగా, నిర్మలంగా ఉన్నపుడు బైనాక్యులర్ సాయంతో నేరుగా మనం దానిని చూడొచ్చు. ఐఎస్ఎస్ చుట్టుపక్కల చక్కర్లు కొడుతూ కనబడుతుంది. అయితే ఇది అలా కొన్ని నెలలపాటు తిరిగాక సవ్యమైన మార్గాన్ని కోల్పోయి విచ్ఛిన్నమవుతుంది'' అని వెబ్‌సైట్ విశ్లేషించింది. ఆ టూల్‌బ్యాగ్‌లో ఏమేం వస్తువులు ఉన్నాయనే వివరాలను నాసా బహిర్గతంచేయలేదు. టూల్‌బ్యాగ్‌లాగా పాత కృత్రిమ ఉపగ్రహాల సూక్ష్మ శకలాలు వేలాదిగా అంతరిక్షంలో తిరుగుతూ నూతన శాటిలైట్లకు ముప్పుగా పరిణమించాయని యురోపియన్ స్పేస్ ఏజెన్సీ సెప్టెంబర్ నెలలో ఆందోళన వ్యక్తంచేసింది. ఇలాంటి 35,000 శిథిలాల ముక్కలు అక్కడి పాత శాటిలైట్ల కక్ష్యల్లో తిరుగుతున్నాయి.

గిరిజనుల రుణం తీర్చుకుంటా..

- జార్ఖండ్‌లో 'జన జాతీయ గౌరవ్ దివస్'లో ప్రధాని మోదీ ఉద్ఘాటన
- పౌరులపై వివక్షను తొలగించినప్పుడే అసలైన ప్రజాస్వామ్యం
- అర్హులందరికీ పథకాలు అందినప్పుడే సామాజిక న్యాయం జరిగినట్లు
- 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్' ప్రారంభం
- రూ.24 వేల కోట్లతో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు



ఉలీహతులో బిర్సా ముండా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

కుంతీ: సమాజంలో అణగారిన వర్గమైన గిరిజనులకు న్యాయం చేకూర్చడానికి తమ ప్రభుత్వం 'మిషన్ మోడ్'లో పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గిరిపుత్రులకు తాను రుణపడి ఉన్నానని, ఆ రుణ తీర్చుకుంటానని తెలిపారు. గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా జార్ఖండ్‌లోని కుంతీ జిల్లాలో బుధవారం నిర్వహించిన 'జన జాతీయ గౌరవ్ దివస్'లో మోదీ పాల్గొన్నారు. బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని గిరిజనుల సంక్షేమం కోసం రూ.24,000 వేల కోట్లతో అమలు చేసే 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్'ను ప్రారంభించారు. పలు ఇతర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కుంతీలోని ఫుట్‌బాల్ మైదానంలో బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. దేశ అభివృద్ధికి మహిళలు, రైతులు, యువత, మధ్యతరగతి–పేదలు అనే నాలుగు వర్గాలను బలోపేతం చేయడం చాలా కీలకమని ఉద్ఘాటించారు. బిర్సా ముండా జన్మించిన గడ్డకు గిరిజనుల రుణం తీర్చుకోవడానికి వచ్చానని అన్నారు. పౌరులపై అన్ని రకాల వివక్షను తొలగించినప్పుడే అసలైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందినప్పుడే సామాజిక న్యాయం జరిగినట్లు భావించాలని స్పష్టం చేశారు.

ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నా..

అడవులు, మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధికి దూరంగా నివసిస్తున్న గిరిజనుల కోసం 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్'ను ప్రారంభించినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ పథకం కింద ఆయా ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు. రోడ్లు, టెలికాం వ్యవస్థ, విద్యుత్, గృహనిర్మాణం, సురక్షిత తాగు నీరు, పారిశుధ్య వసతులు, విద్యా, వైద్యం, జీవనోపాధి పథకాలు ఏర్పాటు చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 22,000 గ్రామాల్లో అభివృద్ధికి దూరంగా నివసిస్తున్న 75 గిరిజన జాతులను ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. గిరిపుత్రుల బాగు కోసం గత ప్రభుత్వాలు చేసిందేమీ లేదని విమర్శించారు. వారి అభివృద్ధే ధ్యేయంగా 'పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్'ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ పథకం కింద రూ.24,000 కోట్లు ఖర్చు చేయబోతున్నామని ప్రకటించారు.

బిర్సా ముండాకు నివాళులు..

కుంతీ జిల్లాలోని ఉలీహతులో ప్రముఖ గిరిజన స్వాతంత్య్ర సమరయోధుడు బిర్సా ముండా జన్మస్థలాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సందర్శించారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. బిర్సా ముండా జన్మించి నేలపై మట్టిని తీసుకొని మోదీ తిలకంగా ధరించారు. ఆయన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. ఉలీహతులో స్థానికులు మోదీకి సాదర స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా సంప్రదాయ సంగీతానికి అనుగుణంగా గిరిజనులతో కలిసి మోదీ నృత్యం చేశారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం

కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి ఉద్దేశించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద లబ్ధి పొందనివారికి ఆయా పథకాల గురించి ఈ యాత్ర ద్వారా వివరిస్తారు. దేశవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే ఏడాది జనవరి 25 వరకూ ఈ యాత్ర కొనసాగుతుంది.

పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి 15 విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 8 కోట్ల మందికిపైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.18,000 కోట్ల నిధులను ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పీఎం–కిసాన్ సమ్మాన్ నిధిని ప్రధాని మోదీ విడుదల చేయడంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

కురు వృద్ధ కమ్యూనిస్ట్ నేత ఎన్.శంకరయ్య కన్నుమూత



న్యూఢిల్లీ: కురు వృద్ధ కమ్యూనిస్ట్ నేత, స్వాతంత్య్ర సమర యోధుడు ఎన్.శంకరయ్య కన్నుమూశారు. 101 ఏళ్ల వయస్సున్న ఆయన కొంతకాలంగా వయో సంబంధ రుగ్మతలతో బాధపడుతున్నారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. 1922 జూలై 15న జన్మించిన శంకరయ్య విద్యార్థి దశలోనే స్వాతంత్య్ర సమరంలోకి దూకారు. తమిళనాడులోని మదురై అమెరికన్ కాలేజీలో విద్యార్థిగా ఉన్న శంకరయ్య డిగ్రీ ఫైలియర్ పరీక్షలకు కొద్దిరోజుల ముందే అరెస్టయ్యారు. స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న శంకరయ్య మొత్తమ్మీద ఎనిమిదేళ్లపాటు జైలు జీవితం గడిపారు. 1940లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరిన ఆయన..అవిభాజ్య తమిళనాడులో పార్టీలో పలు కీలక బాధ్యతలు చేపట్టారు. సీపీఐని వీడి, సీపీఎంను ఏర్పాటు చేసిన 32 మంది జాతీయ కౌన్సిల్ సభ్యుల్లో శంకరయ్య ఒకరు. తమిళనాడు సీపీఎం కార్యదర్శిగా 1995– 2002 మధ్య కాలంలో పనిచేశారు. 1967, 1977, 1980ల్లో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రైతు ఉద్యమాల నాయకత్వం వహించారు. సీపీఎం రైతు విభాగం ఆల్ ఇండియా కిసాన్ సభకు ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగాను బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్.శంకరయ్య మృతి పట్ల సీపీఎం పొలిట్ బ్యూరో సంతాపం ప్రకటించింది.

కశ్మీర్‌లో ఘోర ప్రమాదం

- బస్సు లోయలో పడి.. 38 మంది మృత్యువాత
- మరో 20 మంది ప్రయాణికులకు తీవ్రగాయాలు
- దోడా జిల్లాలో ఘటన
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మోదీ

దోడా: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. బస్సు అదుపు తప్పి లోయలోకి పడిపోవడంతో అందులోని 38 మంది ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. కిష్త్వార్ నుంచి బుధవారం ఉదయం 58 మంది ప్రయాణికులతో జమ్మూకు బయలుదేరిన బస్సు బటోటె–కిష్త్వార్ జాతీయ రహదారిపై అస్సార్ సమీపంలో రోడ్డు పక్కనున్న 300 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ప్రమాద తీవ్రతకు ప్రయాణికుల మృతదేహాలు కొన్ని ఛిద్రమయ్యాయి. బస్సు నామరూపాలు లేకుండా నుజ్జయింది. బస్సులో కొన్ని మృతదేహాలు ఇరుక్కుపోయాయి. బస్ భాగాలను కోసి, మృతదేహాలను బయటకు తీయాల్సి వచ్చింది. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. ఘటనాస్థలిలో రక్షణ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని మృతదేహాలను వెలికి తీసి, సంబంధీకులకు అప్పగించారు. క్షతగాత్రుల్లో నలుగురిని హెలికాప్టర్‌లో జమ్మూలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. బస్సులో పరిమితికి మించి ప్రయాణికులున్నారని, యూటర్న్ తీసుకునేటప్పుడు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో పల్టీ కొట్టి రెయిలింగ్ మీదుగా లోయలోకి పడిపోయినట్లు అధికారులు భావిస్తున్నారు. ఘోర ప్రమాదంపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అందజేస్తామని ప్రధాని 'ఎక్స్'లో ప్రకటించారు. అయితే, రోడ్డు సరిగ్గా లేకనే బస్సు ప్రమాదం జరిగిందని స్థానికులు అన్నారు. రోడ్డు మరమ్మతుల కోసమంటూ తామంతా కలిసి రూ.6 లక్షలు పోగేసి ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. గతంలోనూ ఈ మార్గంలో కనీసం 10 ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు.

నెమ్మదించిన రెస్క్యూ ఆపరేషన్

- శిథిలాలు పడటంతో సహాయక చర్యలకు ఆటంకం
- ఆగర్ మెషీన్‌తో ముందుకు సాగని పనులు
- డ్రిల్లింగ్ వేగవంతానికి మరో భారీ యంత్రం

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్ మార్గంలో సొరంగం కుప్పకూలి నాలుగు రోజులుగా లోపల చిక్కుబడిపోయిన 40 మంది కార్మికులను రక్షించే పనులను అధికారులు వేగవంతం చేశారు. ఇందుకోసం మరో భారీ యంత్రాన్ని తెప్పించారు. మూడు విడిభాగాలుగా యుద్ధవిమానాల్లో తరలించిన ఈ యంత్రాన్ని అసెంబుల్ చేసి, మరికొద్ది గంటల్లో డ్రిల్లింగ్ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కుప్పకూలిన టన్నెల్ శిథిలాల గుండా ఆగర్ మెషీన్ సాయంతో వెడల్పాటి స్టీల్ పైపులను లోపలికి పంపే పనులు అధికారులు మంగళవారం ప్రారంభించిన విషయం తెలిసిందే. 800, 900 మిల్లీమీటర్ల వ్యాసమున్న స్టీలు పైపులను ఒకదాని తర్వాత ఒకటి లోపలికి పంపించి వాటి గుండా కార్మికులను వెలుపలికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, రాత్రి వేళ డ్రిల్లింగ్ పనులు జరుగుతున్న సమయంలో మరోసారి టన్నెల్ శిథిలాలు విరిగిపడటంతో ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనతో పనులకు అంతరాయం ఏర్పడింది.

రంగంలోకి అమెరికన్ ఆగర్

అధికారులు హుటాహుటిన భారీ అమెరికన్ ఆగర్ డ్రిల్లింగ్ మిషన్ భాగాలను భారత వాయుసేన విమానాల ద్వారా 30 కిలోమీటర్ల దగ్గర్లోని చిన్యాలిసౌర్‌కు తెప్పించారు. అక్కడి నుంచి ఘటనాస్థలికి రోడ్డు మార్గంలో తీసుకువస్తున్నామని ఎస్పీ అర్పణ్ తెలిపారు. వీటిని అసెంబ్లింగ్ చేసి, పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సొరంగం లోపల చిక్కుకున్న వారిని కాపాడేందుకు థాయ్‌లాండ్, నార్వే నిపుణుల సలహాలను తీసుకుంటున్నట్లు నేషనల్ హైవేస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్(ఎన్‌హెచ్ఐడి) డైరెక్టర్ అన్షు మాలిక్ తెలిపారు. 2018లో థాయ్‌లాండ్‌లోని ఓ గుహలో చిక్కుకుపోయిన ఫుట్‌బాల్ జట్టు జూనియర్ ఆటగాళ్లను అక్కడి సంస్థ నిపుణులు వారం పాటు శ్రమించి సురక్షితంగా తీసుకువచ్చిన విషయం తెలిసిందే.



భారత వాయుసేన విమానంలో డ్రిల్లింగ్ యంత్రాన్ని తీసుకొస్తున్న దృశ్యం

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 16 । నవంబర్ । 2023



సాగరంలో 'అల'జడి

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడటంతో బుధవారం హంసలదీవి వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది.



పోస్టర్ ఆవిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో 18న విజయవాడలో నిర్వహించనున్న జగనన్న ప్రగతి పథం పోస్టర్లను ప్రభుత్వ విప్ ఉదయభాను ఆవిష్కరించారు.

'మై నేమ్ ఈజ్ శృతి' ప్రమోషన్



ఈ నెల 17న విడుదల కానున్న 'మై నేమ్ ఈజ్ శృతి' సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం విజయవాడకు విచ్చేశారు.

▶8లో

న్యూస్‌రీల్

స్వచ్ఛంద సంస్థ సహకారంతో బోరు పంపు



మైలవరం: ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండకు చెందిన యూసీసీఐ స్వచ్ఛంద సంస్థ మైలవరం అయ్యప్పనగర్‌లో బుధవారం బోర్ పంపు ఏర్పాటు చేసింది. ఐర్లాండ్‌కు చెందిన విదేశీ ప్రతినిధుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ బోరు పంపుతో దాదాపు 60 కుటుంబాల నీటి సమస్య పరిష్కారమైందని సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి తెలిపారు. యూసీసీఐ సంస్థ ద్వారా ఇప్పటికే 20 తాగునీటి బోర్ పంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో బోరు వేయడానికి రూ.1.5 లక్షల వరకూ ఖర్చయ్యిందని వివరించారు. వంగూరు రమేష్‌బాబు, మల్లెల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూసీసీఐ డైరెక్టర్ ఎస్. ఇమ్మానియేలు బాబు, మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోయ సుధ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ఉయ్యూరు డీఈ ప్రతిభ



ఉయ్యూరు: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఓపెన్ సింగిల్స్ విభాగంలో విద్యుత్ శాఖ ఉయ్యూరు డీఈఈ ఎంవీవీ రామకృష్ణ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్, ఏపీసీపీడీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. గుంటూరులో ఈనెల 8, 9, 10 తేదీల్లో జరిగిన పోటీల్లో టేబుల్ టెన్నిస్ ఓపెన్ సింగిల్స్ విభాగంలో డీఈఈ రామకృష్ణ ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఉయ్యూరు డీఈ కార్యాలయంలో బుధవారం ట్రోఫీ అందుకున్న రామకృష్ణను ఏఈలు నాగమల్లేశ్వరరావు, అధికారులు, సిబ్బంది అభినందించారు.

'మాతృత్వ వందన యోజన'పై దృష్టి



లబ్బీపేట(విజయవాడతూర్పు): మొదటి కాన్పుతో పాటు, రెండో కాన్పులో ఆడ శిశువు పుట్టిన వారికి ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం అందించడంపై వైద్యాధికారులు దృష్టి పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ఆమె బుధవారం తన కార్యాలయంలో యూపీహెచ్‌సీ, గ్రామీణ ప్రాంత సీఓలు, ఏఎన్ఎంలు, పర్యవేక్షకులకు పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి రెండో కాన్పులో ఆడ శిశువు పుట్టిన ప్రతి తల్లికి ఈ పథకం వర్తించేలా ఆశ, ఏఎన్ఎంలు తమ పరిధిలో వారి వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో తదుపరి చికిత్సలు అవసరం అయిన రిఫరల్ కేసులకు సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ మాధవి, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ సమీర తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 29,637 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 28,515 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,637 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.8,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,264 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఉత్సాహం.. విజయోత్సవం





చక్ దే ఇండియా.. జయహో టీం ఇండియా.. నినాదాలతో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం హోరెత్తింది. ప్రపంచ కప్–2023 భాగంగా భారత్–న్యూజిల్యాండ్ జట్ల మధ్య బుధవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు బిగ్ స్క్రీన్స్‌పై చూసి ఆనందించారు. ఈ మ్యాచ్‌ను వీక్షించడానికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పెద్ద స్క్రీన్‌ను, క్రికెట్ అభిమానులు కూర్చొని మ్యాచ్ తిలకించేందుకు డిజే సౌండ్ సిస్టమ్‌తో సహా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దీంతో స్టేడియం మొత్తం ప్రేక్షకులతో నిండిపోయింది. అలాగే పలు షాపింగ్ మాల్స్, హోటళ్లు, యాడ్ బోర్డులపైనా మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. మ్యాచ్‌లో టీం ఇండియా విజయం సాధించడంతో యువకులు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చి కేరింతలు కొట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బాబుకు బీ టీంలా 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ'

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థ చంద్రబాబుకు బీ టీంలా మారిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. సెంట్రల్ నియోజకవర్గంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా నిమ్మగడ్డ రమేష్ కుమార్ బాబుకు తొత్తులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రయోజనాల కోసం గతంలో రాజ్యాంగ విలువలను కాలరాసిన నిమ్మగడ్డకు ఈ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. ధైర్యముంటే టీడీపీ ఓట్లను ఎక్కడ తొలగించారో ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీలో ఉన్న వారంతా బాబు భజన బృందమేనని.. వారితో కలిసి ప్రభుత్వంపై నిమ్మగడ్డ బురద చల్లుతున్నారని మండిపడ్డారు. మరోవైపు పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్ జరిగిందని.. కానీ పోలీస్ వ్యవస్థను నిందించడం నిమ్మగడ్డకు తగదన్నారు. ఆరోగ్యశ్రీ గురించి మాట్లాడే నైతిక అర్హత నారా లోకేష్‌కి ఏమాత్రం లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. కరోనా క్లిష్ట సమయంలో హైదరాబాద్‌లో దాక్కుని ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు.

ముగ్ధమనోహరం.. గాజుల హారం





దుర్గమ్మ గాజుల సంబరం అంబరాన్నంటింది. బుధవారం ఆలయ ప్రాంగణం, ప్రధాన ఆలయంలోని మూల విరాట్‌తో పాటు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని గాజులతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రూ.2 కోట్లతో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు ప్రత్యేక బస్సు

- ఖరీదైన క్యాన్సర్ పరీక్షలు గ్రామాల్లోనే ఉచితంగా...
- మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు ఎంపీ బాలశౌరి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి, చిత్రంలో ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: దివిసీమలో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షల కోసం రూ.2 కోట్లు సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయనున్నట్టు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి తెలిపారు. అవనిగడ్డలో మంగళవారం సామాజిక భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. దివిసీమలో ఎక్కువగా క్యాన్సర్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఈ బస్సు ఉపయోగపడుతుందన్నారు. గ్రామ గ్రామాన ఈ సేవలు అందించేందుకు అతి త్వరలోనే బస్సు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఈ బస్సులో ఖరీదైన పరీక్షలు సైతం ఉచితంగా చేస్తారన్నారు.

రూ.4 కోట్లతో మత్స్యకారులకు జెట్టీలు, బోట్లు

కృత్తివెన్ను నుంచి నాగాయలంక వరకూ తీర ప్రాంత మత్స్యకారులకు ఉపయోగపడేలా రూ.4 కోట్ల వ్యయంతో జెట్టీలు, ప్లాట్‌ఫారాలు, ఉచిత బోట్లను అందించే కార్యక్రమాన్ని అతి త్వరలోనే చేపడతామని ఎంపీ బాలశౌరి వెల్లడించారు. జలాశయాల్లో సాగునీరు లేకున్నా తీర ప్రాంత భూములకు 95 శాతం సాగునీరందించేలా కృషి చేశామన్నారు. మచిలీపట్నం పోర్టు పనులు చురుగ్గా సాగుతున్నాయని, పోర్టుకు అనుబంధంగా ప్రత్యేక పరిశ్రమలు పెట్టుకునేందుకు యువత ముందుకొస్తే బ్యాంకర్ల ద్వారా రుణాలు ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎంపీ చెప్పారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలలో రూ.1.75 కోట్లతో ఎమ్మార్ఐ స్కానింగ్ ఏర్పాటు చేశామని, జిల్లాలో ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొర్రుముచ్చు ఉమాతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వీఐపీలూ టికెట్లు కొనాల్సిందే

దుర్గగుడి ఈవో రామారావు



అధికారులతో చర్చిస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వీఐపీలైనా, సాధారణ భక్తులైనా ప్రతి ఒక్కరూ దర్శన టికెట్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు ఆలయ అధికారులను ఆదేశించారు. దుర్గగుడిలోని ఏఈవోలు, సూపరింటెండెంట్లు, అన్నదానం, పూజలు, కనకదుర్గ ప్రభ, ఇంజినీరింగ్, అర్చకులతో బుధవారం సమావేశమయ్యారు. అమ్మవారి దర్శనానికి ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేస్తున్నారని, అయితే భక్తుల రద్దీకి.. దేవస్థానం విక్రయిస్తున్న టికెట్లకు పొంతన లేకుండా ఉందన్నారు. సాధారణ భక్తులైనా, సిఫార్సులతో వచ్చే ప్రముఖులైనా, వీఐపీలైనా టికెట్లను కొనుగోలు చేయాల్సిందేనన్నారు.

ఈ చర్యలు తీసుకోండి..

- ప్రతి నిత్యం నాలుగు వేల నుంచి 5 వేల మందికి అన్నదానం జరుగుతోందని అధికారులు పేర్కొనగా, భవిష్యత్తులో ఆ సంఖ్యను రెట్టింపు జరిగేలా చూద్దామని ఈవో చెప్పారు.
- కార్తిక మాసం నేపథ్యంలో భక్తులు, అయ్యప్పలు, భవానీలు నదిలో దిగి పుణ్యస్నానాలు ఆచరించేలా స్నానఘాట్లను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు.
- సీఎస్‌లో ఘాట్‌రోడ్డు మరమ్మతులు, ఇతర పనులపై సమావేశంలో చర్చించామని, ఇంజినీరింగ్ పనులపై త్వరలోనే పూర్తి స్థాయి సమావేశం నిర్వహించి చర్చిద్దామన్నారు.
- దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కనకదుర్గ ప్రభకు మరింత ప్రాచుర్యం లభించేలా చూడాలని, అదే విధంగా ప్రతి నిత్యం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఈవోలు ఎన్. రమేష్ బాబు, చంద్రశేఖర్, సుధారాణి, వెంకటరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి, సూపరింటెండెంట్లు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన ప్రజా రక్షణ భేరీ మహా ప్రదర్శన, భారీ బహిరంగ సభ కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఎర్రసైన్యం తరలివచ్చింది. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు. సింగ్ నగర్ ఫ్లై ఓవర్ మీద ర్యాలీగా వెళ్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నిధుల సిద్ధి.. సమగ్రాభివృద్ధి

'గడప గడప'లో ప్రగతి ప్రకాశం

- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'
- విజయవాడ వెస్ట్, తిరువూరుల్లో కార్యక్రమం పూర్తి
- గుర్తించిన పనులు చకచకా నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా రూ.78.64 కోట్ల మేర పనులు మంజూరు
- పల్లెల్లో కళ్లెదుటే కనిపిస్తున్న అభివృద్ధి



ఎ. కొండూరు మండలం గొల్లమందలలో నిర్మించిన సీసీ రహదారి

సాక్షి ప్రతినిధి విజయవాడ: ప్రతి ఇంటికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను చేర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ కార్యక్రమం జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. ప్రజా ప్రతినిధులు ప్రతి గడపకు వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబం పొందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తున్నారు. విజయవాడ వెస్ట్, తిరువూరు నియోజకవర్గాల్లో కార్యక్రమం మొత్తం పూర్తయ్యింది. విజయవాడ ఈస్ట్, సెంట్రల్ నియోజక వర్గాల్లో తుది దశకు చేరింది. మిగిలిన నియోజకవర్గాల్లో సైతం శరవేగంగా సాగుతోంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును తెలుసుకొనేందుకు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు కలిసి ప్రజల వద్దకు వెళ్తున్నారు. కార్యక్రమంలో పథకాల అమలే కాకుండా సమస్యలను తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారం కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున విడుదల చేశారు. దానిలో భాగంగా క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదిత పనులకు కలెక్టర్ వెంటనే మంజూరు చేస్తున్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది ప్రాధాన్యతా ప్రకారం పనులు గుర్తిస్తున్నారు. వాటిని మంజూరు చేసి, పనులు ప్రారంభించి, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

430 సచివాలయాల్లో పూర్తి..

ఎన్టీఆర్ జిల్లాలో 605 సచివాలయాల పరిధిలో 430 సచివాలయాల్లో పూర్తిగా గడప గడప కార్యక్రమం పూర్తయ్యింది. ఇంకా కొన్ని సచివాలయాల్లో గడప గడప కార్యక్రమం పూర్తయినప్పటికీ ప్రజా ప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు జిల్లా కేంద్రానికి చేరలేదు. అయితే ఇప్పటికే దాదాపు రూ.78.64కోట్లకు పైగా విలువైన 1,196 పనులు మంజూరయ్యాయి. వీటిలో 878 పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా ఇందులో తాగునీటి వసతి, సీసీరోడ్లు, డ్రైయినేజీ కాలువల నిర్మాణం, కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కల్వర్టులు, కమ్యూనిటీ భవనాలు, ప్రహరీ నిర్మాణాలకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో కలెక్టర్ ఢిల్లీరావు, స్వయంగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమ అమలు తీరు, ప్రజల నుంచి వస్తున్న వినతులను పరిశీలించారు.

పల్లెలో ప్రగతి వెన్నెల..

పల్లెలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ముఖ్యంగా నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రులు అభివృద్ధికి నోచుకున్నాయి. ప్రజల ముంగిటకే సేవలందించేందుకు ఏర్పాటైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజీ హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీలకు కొత్త భవనాలు సమకూరుతున్నాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. జిల్లాలో 1,082 ప్రభుత్వ నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా 60శాతానికి పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఎన్టీఆర్ జిల్లాలో ఇదీ పరిస్థితి..

నియోజకవర్గం	గడప గడప పూర్తయిన సచివాలయాలు	మంజూరైన పనులు	ప్రారంభమైనవి
జగ్గయ్యపేట	29	159	102
తిరువూరు	77	341	277
నందిగామ	31	151	97
మైలవరం	23	164	85
విజయవాడ వెస్ట్	90	176	145
విజయవాడ సెంట్రల్	80	81	72
విజయవాడ ఈస్ట్	95	124	100
గన్నవరం (విజయవాడ రూరల్)	05	–	–
మొత్తం	430	1,196	878

పనులకు ప్రాధాన్యం..



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. క్షేత్ర స్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నాం. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నాం. ఇప్పటికే విజయవాడ కార్పొరేషన్ పాటు, గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బిల్లుల మంజూరులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనుల పురోగతిపై వారం వారం సమీక్షిస్తూ, అధికారులకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నాం.

– ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

పలు రైళ్లు పునరుద్ధరణ

లక్ష్మీపురం : సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలో పలు రైళ్లను పునరుద్ధరించామని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. రైలు నంబర్ 07783 విజయవాడ – గుంటూరు, 07788 గుంటూరు – విజయవాడ, 07779 గుంటూరు –మాచర్ల, 07780 మాచర్ల – గుంటూరు, 07780 మాచర్ల – నడికుడి, 07789 నడికుడి –మాచర్ల రైళ్లు ఈ నెల 16 నుంచి పునరుద్ధరించామని చెప్పారు.

పకడ్బందీగా రౌండ్ టేబుల్ సమావేశం

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కులగణనపై ఈ నెల 16వ తేదీ గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కృష్ణా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో బుధవారం రాత్రి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహణపై స్క్రీనింగ్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, జెడ్పీ చైర్మన్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. కులగణనకు సంబంధించిన సమాచారం ముందుగా అందజేసి సూచనలు, సలహాలు తెలియజేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు తెలియజేసే అభిప్రాయాలు, సలహాలు, సూచనలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సీపీవోకు సూచించారు. జేసీ అపరాజితాసింగ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవోలు ఎం. వాణి, దాసి రాజు, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షేక్ షాహిద్‌బాబు, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఎం. ఫణిదూర్జటి, డీఎల్‌డీవో కేవీ సుబ్బారావు, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన అటవీశాఖాధికారి



మైలవరం: ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ అటవీ శాఖాధికారి ఏసీబీకి చిక్కిన ఘటన బుధవారం మైలవరంలో చోటుచేసుకుంది. రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన రైతు గండిపూడి రాంబాబు అటవీ ప్రాంతం నుంచి కలప రవాణా చేసుకోవడానికి అనుమతి కోసం అటవీ శాఖ మైలవరం డివిజన్ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎ.రామకృష్ణను సంప్రదించాడు. రామకృష్ణ తన సన్నిహితుని ద్వారా రాంబాబును లంచం డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో రైతు రాంబాబు వద్ద నుంచి రామకృష్ణ బుధవారం రూ.23 వేలు లంచం తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నామని ఏసీబీ అడిషనల్ ఎస్పీ పి.స్నేహిత తెలిపారు. మైలవరం ఫారెస్ట్ కార్యాలయం దగ్గర్లో రామకృష్ణ ఒక గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఆ గదిలో ఏసీబీ అధికారులు సోదాలు చేసి రూ.1.19 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడిలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధిలో భాగస్వాములవుదాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గిరిజన చిన్నారులతో కలెక్టర్ ఢిల్లీరావు ఇతర అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గిరిజనుల సమగ్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనజాతీయ గౌరవ దివస్ నిర్వహించారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాము గంటం దొర, బోనంగి పండు పడాల్, కుడుముల పద్ద బయ్యన్న, గాము మల్లుదొర, హనుమంతప్ప, కారం తమ్మన్న దొర, సంకేజి ముక్కుడు, గోకిరి ఎర్రేను, మర్రి కమ్మయ్య, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సముపార్జనలో గిరిజన యోధులు అందించిన సేవలు మరువలేనివన్నారు. జాతి గౌరవాన్ని, దేశ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న గిరిజన జాతుల ఆత్మ గౌరవాన్ని పరిరక్షించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 75 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాల్లో భాగంగా జన జాతీయ గౌరవ దివస్‌గా నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన వర్గాల ప్రయోజనాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. జిల్లాలో గిరిజనులు అత్యధికంగా నివసించే ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధితో బాధపడే వారికోసం ప్రత్యేకంగా డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఎ.కొండూరు మండలంలోని గిరిజన తాండాలకు రూ.37 కోట్లతో కృష్ణా జలాలను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. జన జాతీయ దివస్ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన యువతీ యువకులను సత్కరించారు. అనంతరం గురుకులాల విద్యార్థులు సంప్రదాయ థింసా నృత్యం ప్రదర్శించారు. జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.రుక్మాంగదయ్య, గురుకులాల జిల్లా కన్వీనింగ్ అధికారి జి.జాన్సన్, దేవరాజ్, డీఎంహెచ్‌ఓ ఎం. సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

నాగులచవితికి చోడవరం ముస్తాబు

- 17వ తేదీ పండుగ నిర్వహణ
- భక్తులకు అన్ని ఏర్పాట్లు



ఆలయంలో స్వామి



చోడవరంలో నాగేంద్రస్వామి దేవస్థానం

పెనమలూరు: కృష్ణా జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చోడవరం శ్రీ లక్ష్మీనారాయణ సహిత శ్రీ నాగేంద్రస్వామి వారి ఆలయంలో నాగుల చవితి పండుగను అత్యంత వైభవంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. 17వ తేదీన జరుపుకునే నాగుల చవితి పండుగకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఆలయ కమిటీ, దాతలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. చాలా సంవత్సరాల క్రితం ఆగమశాస్త్ర పండితుడు వేదాంతం లక్ష్మణాచార్యులకు నాగేంద్రస్వామి కలలో కనిపించటంతో గ్రామంలో ఉత్తరాన ఉన్న పాపన్న చెరువు వద్ద నాగేంద్రస్వామివారిని ప్రతిష్ఠించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు మొక్కుకునేవారు. నాగేంద్రస్వామిని నమ్మిన భక్తుల మొక్కులు తీరుతుండటంతో స్వామివారి పట్ల భక్తులకు అపార నమ్మకం ఏర్పడింది. దాతల సహకారంతో 1976లో ఆలయ నిర్మాణం చేశారు. ఆలయం నేడు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందింది.

నాగుల చవితి కార్యక్రమాలు.....

17వ తేదీ వేకువజాము నుంచి ప్రారంభమవుతాయి. ఉదయం 3 గంటలకు మంగళ వాయిద్యాలు, స్వామివారికి పట్టు వస్త్రాలతో విశేష అలంకరణ చేస్తారు. 6 గంటలకు చోడవరం, కాసరనేనివారిపాలెం, వల్లూరిపాలెం గ్రామాల మహిళా భక్తులచే శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం, 7 గంటల నుంచి భజనలు చేస్తారు. దాతల సాయంతో భక్తులకు పుట్టలో పాలు పోయటానికి ఉచితం ఆవుపాలు, ఉచితంగా తీర్థప్రసాదాలు ఇస్తారు. భక్తులకు ఉచితంగా పులిహోర, మంచినీరు, మజ్జిగ పంపిణీకి సిద్ధం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవటానికి పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేకంగా బారికేడ్లు, షామియానాలు, చలవ పందిళ్లు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక పూజలు..

నాగులచవితి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని దేవస్థానం ధర్మకర్తలు వేదాంతం తిరునగరి వీరరాఘవకృష్ణశర్మ, తిరునగరి శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, మంత్రపుష్పం, తదితర పూజా కార్యక్రమాలు చేస్తామన్నారు. భక్తులు పండుగ రోజు పుట్టలో పాలు పోసే సమయంలో ఇబ్బందులు పడకుండా నిర్వాహకులతో సహకరించాలని కోరారు. ఆలయం వద్ద భజన, కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు తిలకించాలని కోరారు.

ప్రత్యేక బస్సులు..

ఈ నెల 16 మధ్యాహ్నం 3 గంటల నుంచి 17వ తేదీ రాత్రి 7 గంటల వరకు ప్రత్యేక బస్సులు విజయవాడ, పెనమలూరు సెంటర్ నుంచి ఆలయం వరకు తిరుగుతాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

బీజేపీ కూటమిని ఓడించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కె. రామకృష్ణ

పటమట(విజయవాడతూర్పు): దేశంలో మత రాజకీయాలు చేసే బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ సంఘ సంస్కర్త, నాస్తిక ఉద్యమ నిర్మాత గోపరాజు రామచంద్రరావు (గోరా) 121 వ జయంతి సభ బెంజిసర్కిల్ సమీపంలోని నాస్తిక కేంద్రంలో బుధవారం నిర్వహించారు. లౌకిక రాజ్య పరిరక్షణలో అభ్యుదయ వాదుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రామకృష్ణ మాట్లాడారు. దేశానికి ప్రమాదకరంగా భారత రాజ్యాంగాన్ని మార్చటమే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన అజెండాగా పాలన చేస్తుందని, ప్రగతిశీల లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా బీజేపీ కూటమని ఓడించాలని పిలుపునిచ్చారు. మోడీ తొమ్మిదేళ్ల పరిపాలనలో ప్రశ్నించే మేధావులు, హేతువాదులైన దభోల్కర్, గోవింద పన్సార్, గౌరీ లంకేష్ వంటి వారిని హత్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ నాస్తికులు మోతుకూరి అరుణ కుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణలు పేరుతో విశ్వవిద్యాలయాల స్థాయిలో కాషాయీకరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు. మూఢ నమ్మకాలు నిర్మూలన కోసం సంస్కరణ ఉద్యమం చేపట్టిన గోరా, పెరియార్, త్రిపురనేని, గురజాడ వంటి వారిని ఆదర్శంగా తీసుకుని నాస్తిక ఉద్యమాన్ని ముందుకు నడిపించే బాధ్యత నేటి తరంపై ఉందని తెలిపారు. ప్రముఖ వైద్యులు జి.సమరం మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో కులమతాలు ధ్రువీకరణ లేని నాస్తికులు కోసం ప్రత్యేక కాలం ఉంచాలని కోరారు. ఇస్కఫ్ నాయకులు మహబూబ్ ఆజం, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, జి.నియంత, డాక్టర్ మారు, రష్మి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

జిల్లా ప్రత్యేకాధికారి ఎం.రామచంద్రుడు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఎం.రామచంద్రుడు చిత్రంలో కలెక్టర్ రాజాబాబు, డీఆర్వో రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 26 నుంచి జనవరి 26వ తేదీ వరకు జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వంచే నియమింపబడిన ప్రత్యేక అధికారి, కేంద్ర సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్ ఎం.రామచంద్రుడు అధికారులకు సూచించారు. వీడియోకాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పి. రాజాబాబుతో కలిసి ఈ కార్యక్రమంపై సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత డీపీవో నాగేశ్వరనాయక్ వికసిత్ భారత్ సంకల్పయాత్ర విశేషాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రామచంద్రుడు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహించి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సంబంధిత శాఖల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్ణయించిందని చెప్పారు. ప్రతి రాష్ట్రానికి నోడల్ అధికారులను నియమించారని పేర్కొన్నారు.

రెండు లేదా మూడు జిల్లాలకు ఒక ప్రత్యేకాధికారిగా నియమించారన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులు సరిగ్గా వినియోగించుకుంటున్నారా, లేదా విచారించి ఇంకా ఎవరైనా అర్హులు ఉండి లబ్ధి పొందని వారు ఉంటే అటువంటి వారిని గుర్తించి పథకాలను అందజేయటం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ 60 రోజుల పాటు కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు కమిటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రధానంగా 34 ప్రభుత్వశాఖలను భాగస్వామ్యులను చేస్తున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీఆర్డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఈవో తాహెరాసుల్తానా, డీఎస్‌వో పార్వతి, సీపీవో బద్రినారాయణ, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా, నిల్వలపై నిఘా

కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ నిబంధనలు మేరకు మద్యం పాలసీని కచ్చితంగా అమలు చేయడంతో పాటు మద్యం అక్రమ రవాణా నిల్వలు, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ పాలసీ నిబంధనల అమలుపై సంబంధిత అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం పాలసీని కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 122 బార్లు 119 షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. మద్యం అక్రమ రవాణా, నిల్వలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మద్యం అమ్మకాలకు సమయపాలన పాటించేలా చూడాలన్నారు. అనుమతులు లేని బ్రాండులను విక్రయించే బార్లపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్డీపీ మద్యం రాష్ట్రంలో విక్రయించకుండా గట్టి నిఘా పెట్టాలని కోరారు. సారా తయారు చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాను కావు సారా తయారీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. బెల్ట్ షాపుల ద్వారా అక్రమ మద్యం అమ్మకాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి టి. శౌరి, ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ రామకృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు. సుబ్బారావు, గొల్లపూడి ఎక్సైజ్ డిపో మేనేజర్ కాశీ విశ్వేశ్వరరావు, ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు పి. శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, నిక్సన్, జె. రామేష్, సబ్ ఇన్స్పెక్టర్లు కె.ఎస్. చంద్రశేఖర్, వై.ఈశ్వరరావు ఉన్నారు.

లేడీ ఓరియెంటెడ్ చిత్రం మై నేమ్ ఈజ్ శృతి



లబ్బీపేట(విజయవాడతూర్పు): లేడీ ఓరియేంటెడ్ చిత్రం మై నేమ్ ఈజ్ శృతి అందరినీ అలరిస్తుందని ఆచిత్ర కథానాయకురాలు హన్సిక అన్నారు. ఈ నెల 17న విడుదల కానున్న ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం నగరానికి విచ్చేసారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హన్సిక మాట్లాడారు. ఆడవాళ్లకు సంబంధించిన అంశాలతో సినిమా ఉంటుందన్నారు. విజయవాడ తనకు ఎంతో అదృష్టాన్ని తెచ్చిపెట్టిన నగరమన్నారు. శృతి క్యారెక్టర్ మంచి పేరును తీసుకొస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్శకుడు ఓంకార్ శ్రీనివాస్ మాట్లాడుతూ కథకు తగ్గటే హన్సిక నటన అదరగొట్టారని చెప్పారు. తన నిజ జీవితంలో చూసిన కథ ఆధారంగానే ఈ చిత్రం రూపొందించానన్నారు. ఈ సమావేశంలో నిర్మాత రమ్య ప్రభాకర్ పాల్గొన్నారు.

కులగణన నిర్వహణకు కమిటీలు ఏర్పాటు


కలెక్టర్ పి.రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కులగణన నిర్వహణకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కులగణన కార్యక్రమం సంబంధితశాఖల సమన్వయంతో సజావుగా జరిగేందుకు జిల్లా, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా స్థాయి కమిటీకి కలక్టర్ చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, జిల్లా బీసీ సంక్షేమం సంఘం సాధికారిత అధికారి, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారులు ఇద్దరు మెంబర్ కన్వీనర్లుగా ఉంటారని పేర్కొన్నారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి (సీపీవో) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. జెడ్పీ సీఈవో, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, బీసీ కార్పొరేషన్ ఈడీ, మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారన్నారు. మండల స్థాయి కమిటీలో తహసీల్దార్ కమిటీ చైర్మన్‌గా, ఎంపీడీవో కన్వీనర్‌గా, మునిసిపల్ కమిషనర్ సహాయ గణన అధికారిగా, ఈవోపీఆర్డీ, పీఆర్ ఎఈ, ఎంఈవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సభ్యులుగా ఉంటారన్నారు. జాయింట్ కలెక్టర్ కులగణన కార్యక్రమం అంతటికి నోడల్ అధికారిగా, డీఆర్వో, ఎస్సీ, బీసీ సంక్షేమ సాధికారత అధికారులు సమన్వయ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. సీపీవో ప్రతిరోజు కులగణన సర్వే డేటా సేకరణ, పర్యవేక్షణ, క్రోడీకరణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారన్నారు. ఈ నెల 20వ తేదీన విజయవాడలో కులగణనపై జరిగే ప్రాంతీయస్థాయి సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నియమింపబడిన అధికారులు మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటంలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. కులగణన సర్వేకు మండలస్థాయి అధికారులు ఎన్యుమేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు.

వడ్డీతో సహా ప్రమాద బీమా మొత్తాన్ని చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారునికి వడ్డీతో సహా ప్రమాద బీమా మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయలలు బుధవారం తీర్పు చెప్పారు. చల్లపల్లికి చెందిన న్యూట్రీఫీడ్స్ మేనేజింగ్ పార్టనర్ నాయుడు శ్రీధర్ గోడౌన్‌లో స్టాక్ కోసం ఫైర్ ఇన్సూరెన్స్‌ను ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 2020 ఆగస్టు 7వ తేదీన చేయించారు. 2021 జూన్ 8వ తేదీన గోడౌన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఇన్సూరెన్స్ కంపెనీకి క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోగా నిరాకరించారు. దీంతో శ్రీధర్ కమిషన్‌ను ఆశ్రయించారు. సభ్యులను విచారించిన అనంతరం శ్రీధర్‌కు రావాల్సిన రూ. 3,30,544 9 శాతం వడ్డీతో ఇన్సూరెన్స్ కంపెనీ తిరస్కరించిన తేదీ నుంచి చెల్లించాలని, మానసిక వేదనకు గురి చేసినందుకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత అధ్యాపకుడి మృతి



సుబ్బారావు (ఫైల్)

నందిగామ: రోడ్డు ప్రమాదంలో ఓ విశ్రాంత అధ్యాపకుడు మృతి చెందిన ఘటన బుధవారం నందిగామ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. పట్టణానికి చెందిన సూర్యదేవర సుబ్బారావు (73) పట్టణంలోని రైతు బజార్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా చందర్లపాడు వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యదేవర సుబ్బారావుతో పాటు ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న యువకుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు మృతి చెందారు. ఆయన పట్టణంలోని కేవీఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. ప్రస్తుతం న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. పట్టణ ప్రజలకు సుపరిచితుడైన సుబ్బారావు మృతి చెందడంతో పలువురు అధ్యాపకులు విచారం వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగడానికి డబ్బులివ్వలేదని రౌడీషీటర్ ఆత్మహత్య



దుర్గారావు మృతదేహం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వకుండా నిరాకరించడంతో రౌడీ షీటర్ గాజు పెంకుతో మెడ కోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. రౌడీషీటర్ అందుగుల దుర్గారావు (32) కూలీ పనులు చేసుకుంటు కుటుంబ సభ్యులతో కలసి ఏలూరు లాకులు సులబ్ కాంప్లెక్స్ సమీపంలోని కాలువ గట్టు వద్ద నివాసముంటున్నారు. దుర్గారావుకు మద్యం తాగే అలవాటు ఉంది. ప్రతి రోజు మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్య జూలిని వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి 10.30 గంటల సమయంలో తిరిగి వచ్చి డబ్బులు ఇవ్వాలంటు గొడవపడ్డాడు. భార్య ఇవ్వకపోవడంతో గాజు పెంకుతో మెడ కోసుకుని తీవ్ర రక్తస్రావంతో పడిపోయాడు. వెంటనే భార్య ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దీనిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులకు ప్రశంసలు



పటమట(విజయవాడతూర్పు): 37వ నేషనల్ గేమ్స్ వాటర్ స్పోర్ట్స్‌లో రజత పతకం సాధించిన క్రీడాకారులు ఎస్.గాయత్రి, భార్గవి, చిన్నాను విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసించారు. కమిషనర్‌ను వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో క్రీడాకారులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కానోయింగ్, కయాకిన్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో పథకాలు గెలిచి విజయవాడ పేరు ప్రఖ్యాతులు పెంచారని అభినందించారు. వాటర్ స్పోర్ట్స్‌లో క్రీడాకారులను పెంచేందుకు, వారిని ప్రోత్సహించేందుకు నగరపాలక సంస్థ నుంచి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బలరాం నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, వాటర్ స్పోర్ట్స్ కోచ్‌లు శ్రీనివాస్, బాబురావు ఉన్నారు.

18న 'నాగలి కూడా ఆయుధమే' ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: బందురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విల్సన్‌రావు కొమ్మవరపు రచించిన 'నాగలి కూడా ఆయుధమే' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరుగుతుందని మల్లెతీగ సాహిత్య వేదిక నిర్వాహకుడు కలిమిశ్రీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కవితా సంపుటిని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు ఆవిష్కరిస్తారని, విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్, యువ కవి అనిల్ డ్యానీతోపాటు పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు.

మల్లేశ్వర స్వామి సన్నిధిలో సహస్ర లింగార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి సన్నిధిలో స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన సహస్ర లింగార్చనలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. నిత్యం ఉదయం తొమ్మిది గంటలకు సహస్ర లింగార్చన జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, ఆకాశ దీపోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు. సేవలో పలువురు భక్తులు ఉభయదాతలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): యువత, బాలలు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఎస్.కె.నజ్మా సూచించారు. కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బుధవారం 'మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా – బాలలపై ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నజ్మా మాట్లాడుతూ.. యువత, పిల్లలు, పెద్దలు సామాజిక మాధ్యమాల ద్వారా మాదక ద్రవ్యాలకు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల గురించి అవగాహన పెంపొందించేందుకు వ్యాస రచన పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సోమసుందరరావు, ఉపాధ్యాయుడు వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆలిండియా సూపర్ స్టార్ కృష్ణ – మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి ఆధ్వర్యంలో సినీ నటుడు కృష్ణ ప్రథమ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. లెనిన్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు కృష్ణ అభిమానులు అన్నదానం, మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనాథ ఆశ్రమాల్లో వృద్ధులకు పండ్లు, కేకులు, బ్రెడ్లు పంచారు. కృష్ణ అభిమానులు శీరం బుజ్జి, తాడి శివ పాల్గొన్నారు.

ఆంధ్రా బ్యాంకు శతాబ్ది ఉత్సవ ర్యాలీ



ఆంధ్రా బ్యాంకు శతాబ్ది ఉత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న రిటైర్డ్ సర్కిల్ జీఎం నాంచారయ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్ర బ్యాంక్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆంధ్ర కార్పొరేషన్ యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ సర్కిల్ జనరల్ మేనేజర్ కె.నాంచారయ్య తెలిపారు. అందులో భాగంగా బుధవారం బిషప్ అజరయ్య పాఠశాల నుంచి సీతారాంపురం ఆంధ్ర బ్యాంక్ శాఖ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నాంచారయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బందరులో భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్ర బ్యాంకును ప్రారంభించారని, ఆ తరువాత వేలాది శాఖలుగా విస్తరించిందని తెలిపారు. వేల మందికి ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి పట్టాభి సీతారామయ్య అని కొనియాడారు. బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువ చేసిన ఏకైక వ్యక్తని ప్రశంసించారు. 97వ సంవత్సరంలో ఆంధ్ర బ్యాంకును యూనియన్ బ్యాంకులో విలీనం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర బ్యాంకును ప్రారంభించి వంద సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అసోసియేషన్ కన్వీనర్ జొన్నలగడ్డ వెంకటరత్నం మాట్లాడుతూ.. ఈ నెల 18న ఏలూరు రోడ్డులోని మిషనరీస్ ఆఫ్ చారిటీలో పేదలకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేస్తామన్నారు. 19న బ్యాంక్ ప్రస్తుత జనరల్ మేనేజర్లు, రిటైర్డ్ జనరల్ మేనేజర్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తామని, 20న కానూరులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన సౌకర్యం కల్పిస్తామని, 23వ తేదీన ఆంధ్ర బ్యాంక్ జోనల్ కార్యాలయంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య సిల్వర్ కాయిన్‌ను విడుదల చేస్తామని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీఎం ఎ.సత్యనారాయణ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గుణదల (విజయవాడ తూర్పు): పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక అన్నారు. మూడో డివిజన్ పరిధిలోని 11వ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా ఆరోగ్యానికి ముఖ్యమంత్రి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ తరహా వైద్యాన్ని చేరువ చేశారని పేర్కొన్నారు. నిపుణులైన వైద్యులను ఇంటింటికీ పంపి ఆరోగ్య సర్వే చేయించారని వివరించారు. ఆరోగ్య సురక్షలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. అనంతరం రోగులకు వైద్యులు పరీక్షలు చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి సుబ్బారావు, భీమిశెట్టి బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

4వ డివిజన్‌లో..

ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకుంటోందని నాల్గో డివిజన్ ఇన్చార్జ్ గల్లా పద్మావతి అన్నారు. పరిటాల ఓంకార్ మండపంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం సఫలమైందన్నారు. అనంతరం రోగులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

పార్వతీదేవిగా భ్రమరాంబ దర్శనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న అమ్మవారు బుధవారం పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న కార్తిక నక్షదీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో వివిధ వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. పార్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతులు, అనంతరం గంగాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు.

భావయుక్త పద్యంతోనే రసానుభూతి

విజయవాడ కల్చరల్: భావయుక్త పద్యంతోనే ప్రేక్షకులకు రసానుభూతి కలుగుతుందని నాటక రంగ ప్రముఖుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం తెలుగు పద్య నాటకం అంశంగా సమావేశం నిర్వహించారు. సుందరరామ శర్మ మాట్లాడుతూ సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానం వంటి పద్యనాటకాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారన్నారు. నేటి కాలంలో చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే పద్యనాటకాలు ప్రదర్శనలకు నోచుకుంటున్నాయన్నారు. పౌరాణిక నాటకంలో పాత్రల హావభావాలను ప్రేక్షకులు గమనిస్తారని, పాత్రలను బట్టి నవరసాలకు అనుగుణంగా పద్యాలను వినిపించాల్సి వస్తుందన్నారు. నాటక రచయిత డాక్టర్ పీవీఎన్ కృష్ణ మాట్లాడుతూ యువతను నాటక రంగం వైపు మళ్లించాల్సిన అవసరముందన్నారు. పద్యనాటకంలో ఆధునిక అవసరాలకు తగినట్లుగా నాటకంలో సాంకేతిక విప్లవం తీసుకురావాలని సూచించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు తెలుగు పద్యనాటకం అంశంగా ప్రసంగించారు. హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు మాట్లాడుతూ ఇదే గ్రంథాలయంలో వేలాది పద్యనాటకాలు ప్రదర్శించినట్లు తెలిపారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు, హనుమంతరాయ గ్రంథాలయం కార్యదర్శి నీలం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో గిరిజన సంక్షేమంపై జాతీయ సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో 'భారతదేశంలోని గిరిజనుల సంరక్షణ, అభివృద్ధిని విస్తృతం చేసే ప్రస్తుత అవకాశాలు' అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందని కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను తూనికుంట్ల శ్రీనివాసు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో ఈ జాతీయ సదస్సు జరుగుతుందని తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సౌజన్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. 17వ తేదీ జరిగే సదస్సు ప్రారంభోత్సవ సభకు ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసన్, ఏపీ ఉన్నత విద్యా రెగ్యులేటరీ అండ్ మోనటరింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు ఆచార్య పి.విజయప్రకాష్, కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య సూర్యచంద్రరావు తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, సదస్సు కన్వీనర్ డాక్టర్ సీహెచ్ వేణుబాబు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎస్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితికి శివగిరి సిద్ధం



శివలింగం పక్కనే ఉన్న నాగ పడగ



నాగ దేవత విగ్రహం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మొగల్రాజపురంలోని శ్రీవాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం (శివగిరి) శుక్రవారం జరిగే నాగుల చవితి వేడుకలకు సిద్ధమైంది. శివగిరి కొండపై 36 అడుగుల శివ లింగం పక్కనే నాగ పడగ, నాగదేవత విగ్రహం ఉన్నాయి.

కార్తిక మాసం సందర్భంగా శివగిరిపై నిర్వహించే పూజలతో పాటుగా నాగుల చవితికి ఏర్పాట్లు పూర్తి చేశామని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జున శర్మ తెలిపారు. శివగిరిపైన ఉన్న నాగ పడగ, నాగదేవత విగ్రహాల దగ్గర భక్తులు స్వయంగా పూజలు నిర్వహించుకోవచ్చని సూచించారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలో, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న పుట్టల దగ్గర కళాశాల సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించి భక్తులు రాకపోకలు సాగించడానికి వీలుగా చేశారు.

మానసిక దివ్యాంగులకు పోటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానసిక దివ్యాంగుల (బుద్ధిమాంద్యం)ను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. విద్యాధరపురం సంజీవయ్య కాలనీలోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోని బుద్ధిమంద్యంగల పిల్లలను ఉత్సాహపరచేందుకు బుధవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలతో దీపావళి టపాసులను కాల్పించటంతోపాటు మ్యూజికల్ చైర్, పాసింగ్ బాల్, త్రో బాల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పిల్లలు ఆనందంతో కేరింతలు కొడుతుంటే తల్లిదండ్రులు మురిసిపోయారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. మానసిక స్థితి సరిగాలేని పిల్లలను తీర్చిదిద్ది సాధారణ పిల్లలుగా వారిని సమాజంలో కలిసిపోయేలా చేసేందుకు భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ కృషి చేస్తోందని చెప్పారు. మరిన్ని వివరాలకు 99859 51397 నెంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి



ఫ్యాషన్ షోలో విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలకు తగిన విధంగా నైపుణ్యాలు పెంచుకోవాలని తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాష్ సూచించారు. అందుకు మార్కెట్‌లో ఎన్నో రకాల పుస్తకాలు, ఇతర మార్గాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నలంద డిగ్రీ కళాశాల కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కాగ్నిషన్ 2023 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రకాష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి, నైపుణ్యాలు వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. చదువుతో పాటు, వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, తమ ఆసక్తికి అనుగుణంగా కేరీర్‌ను ఎంచుకోవాలని సూచించారు. నగరంలోని ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల నుంచి 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్యాషన్ షో, సంప్రదాయ నృత్యాలు అలరించాయి. కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగాధిపతి బి.రజనీప్రదీప, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐలా కమిషనర్‌గా మధు

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): జవహర్ ఆటోనగర్‌లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఐలా కమిషనర్ ఎం.మధు తెలిపారు. ఆయన ఐలా కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక వాడలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏడాది నుంచి ఐలా ఇన్‌చార్జి కమిషనర్‌గా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విధులు నిర్వహిస్తున్నారు. ఇన్నాళ్లకు కమిషనర్‌ను నియమించారు.

పవర్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు సన్మానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడలలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13న ఇబ్రహీంపట్నంలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళలు, పురుషుల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు స్వర్ణ, ఒక రజత, మూడు కాంస్య పతకాలతో పాటు పవర్ లిఫ్టింగ్‌లో ఏడు రజత, రెండు కాంస్య పతకాలు సాధించారన్నారు. పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం, వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ ద్వితీయస్థానం సాధించటం అభినందనీయం అని అన్నారు. అనంతరం విజేతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి మండవ కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్ ప్రభుత్వ హాస్పిటల్ వైద్యుడు సీహెచ్‌బీవీ సారథి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం

జువైనల్ హోమ్ పర్యవేక్షణాధికారి రామమోహన్‌రెడ్డి



బాలురును ఉద్దేశించి మాట్లాడుతున్న రామమోహన్‌రెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు, యువతలో కొంత మంది మాదక ద్రవ్యాలకు బానిసలై పోతున్నారని, అవి వారి జీవితాలను నాశనం చేస్తాయన్న విషయాన్ని గుర్తించాలని జువైనల్ హోమ్ పర్యవేక్షణాధికారి పి.రామమోహన్‌రెడ్డి హెచ్చరించారు. బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన విద్యాధరపురం కబేళా రోడ్‌లో గల ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహంలో 'సే నో టు డ్రగ్స్' అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరదాగా అలవాటు చేసుకుని చివరికి మత్తు పదార్థాలు లేకుండా జీవించలేని పరిస్థితికి యువత రావడం దురదృష్టకరమన్నారు. సరైన అవగాహనతో ఆ అలవాటు నుంచి బయట పడవచ్చని సూచించారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసైనవారిని గుర్తించి సంబంధిత పునరావాస కేంద్రాలను సంప్రదించి అక్కడ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. సంస్థ జోనల్ కో ఆర్డినేటర్ కె ప్రియాంక మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల ప్రభావం బాలలపై ఎక్కువగా ఉంటుందన్నారు. ముందు జాగ్రత్తతో ఆ అలవాటు, ఆలోచనల నుంచి బయటపడేలా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలిచిన బాలురకు బహుమతులను అందచేశారు.

ఇష్టంతో చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శంఖబ్రాత



శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ వార్షికోత్సవాల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏడీజీపీ శంఖబ్రాత,

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివితే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శంఖబ్రాత సూచించారు. నగరంలోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శంఖబ్రాత సివిల్స్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తమ యాటిట్యూడ్‌ను ఎలా సరిచేసుకోవాలి వంటి అంశాలను వివరించారు. సివిల్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు, గ్రూప్–1 వంటి ఇతర పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధించొచ్చని సూచించారు. సివిల్స్ లక్ష్యంతో ప్రతి విద్యార్థీ కృషి చేస్తే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించే అవకాశం ఉందన్నారు. అందుకోసం కృషి, పట్టుదల, నిరంతర సాధన, ఆత్మ విశ్వాసం అవసరమని స్పష్టంచేశారు. శరత్ చంద్ర అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర మాట్లాడుతూ.. నిజాయతీ కలిగిన సీనియర్ ఐపీఎస్ అధికారి శంఖబ్రాత వంటి అధికారి సివిల్స్ సాధించాలనే ఆశయంతో శిక్షణ పొందుతున్న వారికి సూచనలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన చేసిన గుడ్ గవర్నెన్స్ విద్యార్థులకు స్ఫూర్తిదాయమన్నారు. తమ విద్యా సంస్థలో నాలుగేళ్లలో వందకు పైగా ఐఏఎస్, 90కి పైగా గ్రూప్–1 ర్యాంకులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థలో శిక్షణ పొంది సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన పలువురిని ఘనంగా సత్కరించారు.

పుస్తక పఠనంపై వ్యాసరచన పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ జూనియర్ మహిళా కళాశాలలో బుధవారం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం ఆవశ్యకత అంశంపై తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ఈ పోటీలు నిర్వహించారు. తెలుగు పోటీల్లో వై.గీతాంజలి(సిద్ధార్థ), జి.అమృత వర్షిణి(స్టెల్లా), టి.గణేశ్వరి(సిద్ధార్థ) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. బి.స్వర్ణ (స్టెల్లా) ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఇంగ్లిషు పోటీల్లో ఎస్కే యాస్మిన్ (సిద్ధార్థ), ఎం.జాహ్నవి(స్టెల్లా), సుమన్‌జైన్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. సీహెచ్ శ్రీలత ప్రోత్సాహక బహుమతి గెలుపొందింది. విజేతలను జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ అభినందించి, బహుమతులు అందజేశారు. తెలుగు విభాగ అధ్యాపకులు, లైబ్రేరియన్ తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ రీసెర్చ్‌తో ఉజ్వల భవిష్యత్తు

సాక్షి, అమరావతి: క్లినికల్ రీసెర్చ్‌ను కెరీర్‌గా తీసుకునే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని కావాక్సియస్ క్లినికల్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ కరిష్మా రాంపల్లి అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో 'క్లినికల్ రీసెర్చ్' అంశంపై మూడు రోజుల వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరయ్యెన కరిష్మా మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని అధ్యయనం చేయడంలో క్లినికల్ రీసెర్చ్ ఎంతో కీలకమన్నారు. కొత్త వ్యాధులకు చికిత్స, నిరోధించడానికి కొత్త మందుల తయారీలో కీలక భాగస్వామ్యం ఉంటుందన్నారు. ప్రాణాంతక వ్యాధి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యతో జీవిస్తున్న వ్యక్తుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో అనేక పరిశోధనలు సాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే క్లినికల్ రీసెర్చ్ విద్యార్థులకు అంతర్జాతీయ వ్యాప్తంగా విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. గెస్ట్ లెక్చరర్‌గా తన్మయ్ క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం క్లినికల్ రీసెర్చ్‌లో హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కళా శాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన పాల్గొన్నారు.

గాల్‌బ్లాడర్ వాపునకు అరుదైన చికిత్స



లబ్బీపేట(విజయవాడతూర్పు): గాల్ బ్లాడర్ (పిత్తాశయం)లో ఎలాంటి రాళ్లు లేకున్నా, వాపుతో పాటు హెపటైటీస్ ఏ పాజిటివ్ వచ్చిన ఒక రోగికి ఆపరేషన్ లేకుండా వైద్యం చేసి నయం చేసినట్లు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.రామకృష్ణారావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఏలూరుకు చెందిన 24 ఏళ్ల యువకుడు హర్షతేజ కొద్దిరోజుల కిందట కడుపు ఉబ్బరంతో పాటు, రెండు మూడు రోజుల తర్వాత కడుపు బాగా పట్టేయడం, వాంతులు రావడం, యూరిన్ నల్లగా రావడం, నిలబడలేక పోవడం వంటి లక్షణాలతో ఏలూరులోని ఓ ఆస్పత్రికి వెళ్లాడు. బిలూర్బిన్ పెరగడంతో పాటు గాల్ బ్లాడర్ వాపు రావడంతో దానిని తొలగించాలని అక్కడి వైద్యులు సూచించారు. ఈ తరుణంలో నగరంలోని టాప్‌స్టార్ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లాడు. రాళ్లు లేకుండా గాల్‌బ్లాడర్ వాపు అనేది చాలా అరుదుగా వస్తుందని భావించి హెపటైటీస్ ఏ పాజిటివ్ కారణంగా వచ్చినట్లు నిర్ధారించి మందులు వాడటంతో వ్యాధి నయం అయ్యిందని డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. ఆహార నియమాలతో పాటు మందులు వాడటంతో సాధారణ స్థితికి చేరుకుందని, ఇలాంటి కేసులు చాలా అరుదుగా చూస్తామని పేర్కొన్నారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని మూడో సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం పెద్దూరులో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల డ్యాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రాజుకోడూరులో సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరిస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు)



వైఎస్సార్ జిల్లా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని శీలం వారిపల్లె సచివాలయం ఆవరణలో మహిళలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



తిరుపతి 33వ డివిజన్‌లోని సంజయ్‌గాంధీ కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



బాపట్ల జిల్లా భట్టిప్రోలు సచివాలయం పరిధిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున, ప్రజా ప్రతినిధులు



కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డిలో మా నమ్మకం నువ్వే జగనన్న పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తదితరులు



పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి-4 సచివాలయం వద్ద సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం ఓంద్రుజోల గ్రామ సచివాలయం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు



తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

బీసీలంతా కులగణనలో పాల్గొనాలి

ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మారేష్



పటమట (విజయవాడతూర్పు): 92 ఏళ్ల తర్వాత సీఎం జగన్ సారథ్యంలో రాష్ట్రంలో కులగణన జరగడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇప్పటి వరకు పాలించిన పార్టీలు గానీ, ముఖ్యమంత్రులు, ప్రధానులు గానీ కులగణన ప్రస్తావన లేకుండా పాలన చేశాయని ధ్వజమెత్తారు. బుధవారం విజయవాడ పటమటలోని సంస్థ కార్యాలయంలో 34 కుల సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరిగే కులగణన బీసీలకు పండగవంటిదని, ఈ చారిత్రాత్మకం ఘట్టంలో బీసీలందరూ పాల్గొని సీఎం జగన్ ఆశయానికి అండగా నిలవాలని కోరారు. ఏపీ బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, ఉపాధ్యక్షురాలు రాజులపాటి కళ్యాణి, నేతలు ఈతాకుల జగదీష్, బెజవాడ గణేష్, మచ్చు నాగేంద్ర, మణికంఠ పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రోద్బలంతోనే స్కిల్ కుంభకోణం

- ముందస్తు వ్యూహం, కుట్రలో భాగంగానే రూ.214 కోట్లను షెల్ కంపెనీల ద్వారా దారిమళ్లించారు
- చంద్రబాబు చాలా పలుకుబడి కలిగిన వ్యక్తి
- అతనికి బెయిల్ ఇస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం
- ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సీమెన్స్ సంస్థ తాను వెచ్చించాల్సిన 90 శాతం నిధులను ఖర్చుచేయకముందే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.330 కోట్లను విడుదల చేసేసిందని, దీని వెనుక కుట్ర, ముందస్తు వ్యూహాలు ఉన్నాయని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఇలా చేయడం ద్వారా రూ.214 కోట్లను పలు షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించారని తెలిపారు. నిధుల మళ్లింపును ఫోరెన్సిక్ ఆడిట్ సైతం ధ్రువీకరించిందని చెప్పారు. ఈ కుంభకోణం గత ప్రభుత్వ హయాంలోనే బయట పడిందని, దీనిపై ఏసీబీ విచారణ జరిగిందని తెలిపారు. అయితే ఈ కుంభకోణంలో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర ఉండటంతో అది బయటకు రాకుండా తొక్కిపెట్టారని వివరించారు. 2018లో జరిగిన కుంభకోణంపై సీఐడీ చేస్తున్న దర్యాప్తును రాజకీయ ప్రేరేపితమని, రాజకీయ కక్షసాధింపు అని చెప్పడం దారుణమన్నారు. ఈ కుంభకోణం వెనుక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చెప్పారు. ఇందుకు నోట్‌ఫైళ్లే సాక్ష్యమన్నారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే రూ.330 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ఈ విషయంలో ఆర్థికశాఖ అభ్యంతరాలను సైతం చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధినేతగా, మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు ఎంతో పలుకుబడి ఉందని, అందువల్ల ఈ కేసులో ఆయనకు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. పైపెచ్చు దర్యాప్తు కీలకదశలో ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చంద్రబాబు తన ప్రధాన బెయిల్ పిటిషన్‌లో ఇప్పటివరకు వాదనలు వినిపించలేదన్నారు. వాదనలు వినిపించినట్లు ఆయన న్యాయవాదులు చెబుతున్న నేపథ్యంలో ఆ వివరాలను రికార్డ్ చేయాలని సుధాకర్‌రెడ్డి కోర్టును కోరారు. చంద్రబాబు న్యాయవాదులు కేవలం మధ్యంతర బెయిల్‌పై మాత్రమే వాదనలు వినిపించారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి వాదనల నిమిత్తం విచారణ గురువారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ మల్లికార్జునరావు విచారించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ మాజీ మంత్రి 'ఈవూరి' తనయుడు గణేశ్

పార్టీలోకి ఆహ్వానించిన సీఎం జగన్



సాక్షి, అమరావతి: టీడీపీ మాజీ మంత్రి ఈవూరి సీతారావమ్మ, మాజీ ఎమ్మెల్యే ఈవూరి సుబ్బారావుల తనయుడు, ప్రముఖ వైద్యుడు ఈవూరి గణేష్.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో డాక్టర్ ఈవూరి గణేష్, ఆయన సతీమణి డాక్టర్ కేశవతిలు పార్టీలో చేరగా.. సీఎం జగన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూచినపూడి నియోజకవర్గం నుంచి 1985, 1989, 1994లో టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈవూరి సీతారావమ్మ మంత్రిగా పనిచేశారు. గౌడ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ ఈవూరి గణేష్.. 2009లో పీఆర్పీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా రేపల్లె నుంచి పోటీ చేశారు. వారి వెంట మోపిదేవి వెంకటరమణ ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'కులగణన'

- 17న రౌండ్‌టేబుల్ సమావేశం
- మంత్రి చెల్లుబోయిన వేణు



సాక్షి, రాజమహేంద్రవరం: దేశంలో ఏ ముఖ్యమంత్రి సాహసం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన కార్యక్రమాన్ని చేపట్టారని మంత్రి చెల్లుబోయిన వేణు స్పష్టం చేశారు. బీహార్లో కులగణన జరిగినా.. అది ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితమైందన్నారు. ఆయా వర్గాల సామాజిక స్థితిని పరిగణనలోకి తీసుకుని వారికి మరింత మెరుగైన అవకాశాలను కల్పించేందుకు సీఎం శ్రీకారం చుట్టారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులగణన ప్రక్రియను రికార్డు స్థాయిలో విజయవంతం చేస్తామన్నారు. రామచంద్రపురం మండలం నేలపర్తిపాడులో పైలెట్ ప్రాజెక్టుగా కులగణన ప్రక్రియను ప్రారంభిస్తుండడం హర్షణీయమని చెప్పారు. ఈనెల 17వతేదీన రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇప్పటికే జిల్లా స్థాయిలో 15వ తేదీన కులసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామని, 16వ తేదీన కూడా సమావేశం కొనసాగుతుందని వివరించారు.

శ్రీకాకుళం జిల్లాలో కులగణన ప్రారంభం

గార: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన శ్రీకాకుళం జిల్లా గార మండలం రామచంద్రాపురం పంచాయతీలో పైలెట్ ప్రాజెక్టుగా బుధవారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలో 5 సచివాలయాల్లో ప్రారంభించగా అందులో రామచంద్రాపురం ఒకటి. ఉదయం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల స్థాయి అధికారులకు రాష్ట్ర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. మధ్యాహ్నం నుంచి రామచంద్రాపురంలో కులగణన చేపట్టారు. కులం, ఇళ్లు, గ్యాస్, వ్యవసాయం, వృత్తి వంటి వివరాలతో పాటు ఆధార్‌తో అనుసంధానం చేస్తూ వివరాలు సేకరించారు. శిమ్మపేటలో జరుగుతున్న సర్వేను డీఎల్‌డీవో పి. వాసుదేవరావు, ఎంపీడీవో సంజీవ రమణయ్య, ఈవోపీఆర్‌డీ పి. శ్రీనివాసరావులు పరిశీలించారు.



కులగణనను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో పి.వాసుదేవరావు

పంచతంత్రం

అక్కడ తొలిసారి పోలింగ్ బూత్

జైపూర్: రాజస్తాన్‌లో ఈ నెల 25న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో షేర్‌గావ్ గ్రామ ఓటర్లు తొలిసారిగా తమ ఊళ్లోనే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు! ఇది సిరోహి జిల్లా అబు-పిండ్వారా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉంది. సముద్ర మట్టానికి 4,921 అడుగుల ఎత్తులో ఉండే ఈ ఊరు చేరాలంటే పోలింగ్ సిబ్బంది అనేకానేక విన్యాసాలు చేయాల్సిందే. అటవీ గార్డుల సాయంతో దట్టమైన అటవీ ప్రాంతం గుండా 18 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాలి. ఇంతా చేస్తే ఈ ఊళ్లో మొత్తం ఓటర్లు 117 మందే! ఓటేసేందుకు వీరు ఇప్పటిదాకా మరో మారుమూల గ్రామమైన ఉత్రాజ్‌కు వెళ్లేవారు. బార్మేర్ జిల్లాలో ఉన్న బర్మేర్ కా పార్ గ్రామంలోనూ ఈ దఫా తొలిసారి పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఓటర్లు 35 మందే.


మధ్యప్రదేశ్‌లో మురిసేదెవరో!

20 ఏళ్లుగా బీజేపీకి కంచుకోట	ఒక్క 2018లో కాంగ్రెస్ పై చేయి	ఈసారీ ఇరు పార్టీల హోరాహోరీ పోరు	ముగిసిన ప్రచారం, రేపు పోలింగ్

విశేషాలు...


మధ్యప్రదేశ్‌లో	
మొత్తం ఓటర్లు	5.5 కోట్లు
పురుష ఓటర్లు	2.88 కోట్లు
మహిళా ఓటర్లు	2.72 కోట్లు

మధ్యప్రదేశ్. బీజేపీకి కంచుకోట వంటి రాష్ట్రం. మధ్యలో ఓ 15 నెలలు మినహాయిస్తే గత 18 ఏళ్లుగా అక్కడ బీజేపీదే అధికారం. అదే ఈసారి కొంప ముంచవచ్చని ఆ పార్టీ భయపడుతోంది. అందుకే ముందుజాగ్రత్తగా సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదు. తద్వారా వ్యతిరేక ఓటు కాస్తయినా తగ్గుతుందన్నది బీజేపీ ఆశ. ఇక కాంగ్రెస్ గత 20 ఏళ్లలో బీజేపీ కంటే ఎక్కువ అసెంబ్లీ స్థానాలు సాధించింది 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనే. ఏకైక పెద్ద పార్టీగా అధికారం చేపట్టినా అది 15 నెలల ముచ్చటగానే మిగిలింది. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా పూర్తి మెజారిటీతో అధికారాన్ని ఒడిసిపట్టాలని కాంగ్రెస్ గట్టిగా పోరాడుతోంది. బీజేపీ కూడా అధికారాన్ని నిలుపుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఆ క్రమంలో సీఎం శివరాజ్ అనేకానేక సంక్షేమ పథకాలు ప్రకటించారు. మరెన్నో హామీలు గుప్పించారు. ప్రచారంలో ఇరు పార్టీలూ హోరాహోరిగా తలపడ్డాయి. చివరికి ప్రచార పర్వం ముగిసింది. ఇక అందరి దృష్టి శుక్రవారం జరగనున్న కీలక పోలింగ్‌పైనే నెలకొంది. ఈ నేపథ్యంలో గత మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గమనిస్తే.



– సాక్షి, నేషనల్ డెస్క్


2008



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	143	9,493,641	37.6
కాంగ్రెస్	71	8,170,318	32.4
ఇతరులు	8	4,795,730	19.0
బీఎస్పీ	7	2,262,119	9.0
ఎస్పీ	1	501,324	2.0

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 143 అసెంబ్లీ స్థానాలతో అధికారాన్ని నిలబెట్టుకుంది. శివరాజ్‌సింగ్ చౌహాన్ వరుసగా రెండోసారి సీఎం అయ్యారు. 2005లో తొలిసారి ముఖ్యమంత్రి అయిన ఆయన ఈ విజయంతో రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకునిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. బీజేపీకి 37.64 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 32.39 శాతమే వచ్చాయి. ఆ పార్టీ 71 స్థానాల్లో నెగ్గింది. ఇక బీఎస్పీ 8.27 శాతం ఓట్లతో 7 స్థానాలు తన ఖాతాలో వేసుకుంది. మరోసారి ఓటమి పాలైనా, 2003 అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధించిన సంతృప్తి కాంగ్రెస్‌కు మిగిలింది. 2003లో ఆ పార్టీకి కేవలం 38 స్థానాలే రాగా బీజేపీ ఏకంగా 173 సీట్లు నెగ్గింది.


2013



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
బీజేపీ	165	15,191,335	44.9
కాంగ్రెస్	58	12,315,253	36.4
బీఎస్పీ	4	2,128,333	6.3
ఇతరులు	3	3,812,730	11.3
ఎస్పీ	0	404,853	1.2

ఈసారి బీజేపీ ఏకంగా 44.88 శాతం ఓట్లు సాధించింది. కాంగ్రెస్ కేవలం 36.38 శాతానికి పరిమితమైంది. బీఎస్పీకి 6.29 శాతం వచ్చాయి. బీజేపీ 165 సీట్లతో సత్తా చాటగా కాంగ్రెస్ కేవలం 58 స్థానాలకు పరిమితమై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. శివరాజ్‌సింగ్ చౌహాన్ మూడోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే అంతటి బీజేపీ హవాలోనూ 30 మంది మంత్రుల్లో ఏకంగా ఏడుగురు ఓటమి చవిచూడటం విశేషం! బీఎస్పీ 4 అసెంబ్లీ స్థానాలు సాధించి ఉనికి చాటుకుంది. అనంతరం 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా మధ్యప్రదేశ్‌లో బీజేపీ హవాయే నడిచింది. 29 స్థానాలకు గాను బీజేపీ ఏకంగా 27 నెగ్గగా కాంగ్రెస్ రెండింటికి పరిమితమైంది.

2018



పార్టీ	సీట్లు	ఓట్లు	ఓట్ల శాతం
కాంగ్రెస్	114	15,595,696	40.9
బీజేపీ	109	15,643,623	41.0
ఇతరులు	4	4,490,542	11.8
బీఎస్పీ	2	1,911,642	5.0
ఎస్పీ	1	496,025	1.3

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాలతో అతి పెద్ద ఏకైక పార్టీగా నిలిచింది. బీజేపీకి 109 సీట్లొచ్చాయి. అయితే ఈ ఎన్నికల్లో ఒక గమ్మత్తు చోటుచేసుకుంది. కాంగ్రెస్‌కు 40.89 శాతం ఓట్లు రాగా బీజేపీకి అంతకంటే కాస్త ఎక్కువగా 41.02 శాతం వచ్చాయి! బీఎస్పీ 5.01 శాతం ఓట్లు సాధించింది. ఒక సమాజ్‌వాదీ ఎమ్మెల్యే, ఇద్దరు బీఎస్పీ, నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో 15 ఏళ్ల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కమల్‌నాథ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసింది. 29 స్థానాలకు గాను ఏకంగా 28 సీట్లు నెగ్గింది. కాంగ్రెస్ కేవలం ఒక్క స్థానంతో సరిపెట్టుకుంది. అదే ఊపులో మరుసటి ఏడాదే కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి షాకిచ్చింది. 2020 మార్చిలో ప్రపంచమంతా కరోనా లాక్‌డౌన్ గుప్పెట్లోకి వెళ్లేందుకు కాస్త ముందు ఏకంగా 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు! అసంతృప్త నేత జ్యోతిరాదిత్య సింధియా సారథ్యంలో వారంతా బీజేపీ గూటికి చేరారు. దాంతో కమల్‌నాథ్ సర్కారు 15 నెలల్లోపే కుప్పకూలింది. బీజేపీ అధికారంలోకి రావడం శివరాజ్‌సింగ్ చౌహాన్ మరోసారి సీఎం కావడం చకచకా జరిగిపోయాయి. అనంతరం జరిగిన ఉప ఎన్నికల ఫలితాల అనంతరం అసెంబ్లీలో బీజేపీ బలం 128కి పెరిగితే కాంగ్రెస్ బలం 98 మంది ఎమ్మెల్యేలకు పరిమితమైంది.

• తెలంగాణ

గెలిస్తే రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను తెస్తాం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, ఆదిలాబాద్/నిర్మల్/జనగామ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను తెస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నిర్మల్, బోథ్, జనగామలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. కాగా తన ప్రసంగంలో ఆయన రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ×సాగునీటి శాఖ మంత్రులుగా ఐదేళ్లు మామ ఉన్నడు.. మరో ఐదేళ్లు అల్లుడున్నడు. మామా అల్లుళ్ల చేతిలో చిక్కి ప్రాణహిత–చేవెళ్ల అన్యాయానికి గురైంది. ఉమ్మడి ఆదిలాబాద్ మళ్లీ ఎడారైంది. మనకు నీళ్లు రాకపోవడానికి, నిర్మల్‌లో చెరువులు కబ్జాలు కావడానికి ఈ కేసీఆర్ సర్కారు కారణం కాదా.. కేసీఆర్ అవినీతికి మేడిగడ్డ బలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బోథ్ నియోజకవర్గంలో కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తాం..•అని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో తుమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి, ఈ ప్రాంతంలో 1.62 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రయత్నం చేశామని ఆయన అన్నారు. దాదాపు రూ.12వేల కోట్లు ఖర్చు చేశామని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక తుమ్మిడిహట్టిని మార్చి, కాళేశ్వరం పేరుతో మేడిగడ బ్యారేజీ కట్టారని విమర్శించారు.

బీజేపీకి రాములమ్మ రాం రాం..!

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీకి మరో షాక్ తగిలింది. పార్టీకి జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మాజీ ఎంపీ విజయశాంతి రాజీనామా చేశారు. బుధవారం ఈ మేరకు తన రాజీనామా లేఖను కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి పంపించారు. ఇప్పటికే పలువురు నేతలు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. కొంతకాలంగా ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అయితే ఈనెల 7న ఎల్బీ స్టేడియంలో జరిగిన బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభలో ప్రధాని మోదీ పాల్గొన్న సందర్భంగా... బేగంపేట ఎయిర్‌పోర్టులో మోదీకి ఆమె స్వాగతం పలికిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె పార్టీని వీడతారా లేదా అన్న దానిపై కొంత చర్చ జరిగింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బీజేపీ గట్టిగా పోరాడటం లేదన్న భావనతో పాటు, కేసీఆర్ సర్కారు అవినీతి, అక్రమాలు, ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితపై కేంద్రం కఠినంగా వ్యవహరించడం లేదనే అభిప్రాయంతో ఉన్న ఆమె చివరకు పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు సన్నిహితుల సమాచారం. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరిక దాదాపుగా ఖరారు అయినట్టు తెలుస్తోంది.

రాజకీయ అవగాహన ఉండాలి... ఓటేయాలి

డేటింగ్ యాప్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాజకీయాల పట్ల ఆధునికులు నిర్లిప్తంగా ఉంటారనే అభిప్రాయం తప్పని ఓ అధ్యయనం నిరూపించింది. తమ భాగస్వామి తప్పనిసరిగా రాజకీయ–సామాజిక అవగాహన కలిగి ఉండాలని ఆధునికులు, ముఖ్యంగా మహిళలు భావిస్తున్నారు. అంతేకాదు వారు తప్పకుండా ఓటు వేయాలని కూడా ఆశిస్తున్నారు. మహిళలకు సంబంధించిన తొలి డేటింగ్ యాప్ బంబుల్ తాజాగా విడుదల చేసిన వార్షిక డేటింగ్ ట్రెండ్స్ 2024 నివేదికలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. 25వేల మందికి పైగా పాల్గొన్న ఈ అధ్యయనంలో రాజకీయాలు, సామాజిక అంశాలపై సాధారణ అవగాహనకు భిన్నమైన ఆలోచనలు వెల్లడి కావడం విశేషం. అధ్యయనంలో పాల్గొన్న ప్రతీ నలుగురిలో ఒకరు తమ భాగస్వామి రాజకీయాలు, సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నారు. ఇది తమ భాగస్వామిని మరింత ఆకర్షణీయంగా మారుస్తుందని భావిస్తున్నారు. అదీగాక, 41% మంది తమ భాగస్వామి ఎన్నికల్లో ఓటు వేయడం కూడా తమకు ముఖ్యమన్నారు. తమకు భిన్నమైన రాజకీయ దృక్కోణాలు ఉన్న వారి దగ్గర మహిళలు తక్కువ ఓపెన్‌గా ఉంటారని కూడా అధ్యయనం వెల్లడించింది. డేటింగ్ చేస్తున్న ప్రతీ ముగ్గురిలో ఒకరు (33%) సామాజిక సమస్యలపై నిరాసక్తతతో ఉంటే భాగస్వామికి దూరం జరుగుతున్నారు. భాగస్వామితో కలిసి ఉండాలని కోరుకునేందుకు మానవ హక్కుల సమస్యలు ముఖ్యమైన కారణమని 64% మంది, భాగస్వామికి విలువల పట్ల మక్కువ ఉండాలని 38% మంది మహిళలు చెప్పారు.

'కోతులు లేకుండా చేస్తేనే ఓట్లేస్తం'

ఫ్లెక్సీ పెట్టి వినూత్న నిరసన

కురవి: 'మా గ్రామంలో కోతుల బెడద లేకుండా చేస్తేనే ఓట్లు వేస్తాం' అని మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామస్తులు ఊళ్లో బుధవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ×ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు తాళ్లసంకీస గ్రామప్రజల మనవి ఏమనగా.. మా గ్రామంలో పంట పొలాలను కోతులు నాశనం చేస్తున్నవి. కావున కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపే అభ్యర్థులకే మేము, మా గ్రామం మొత్తం ఓట్లను వేయగలము•అని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఏ మేరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

క్లుప్తంగా...

గణితం, సైన్స్‌పై ఆసక్తి పెంచాలి

ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ సూచన



శిక్షణ మాడ్యూల్స్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ సురేశ్ కుమార్

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో గణితం, సైన్స్‌పై ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ సూచించారు. బుధవారం విజయవాడలో 520 మంది సైన్స్, గణిత ఉపాధ్యాయులకు 'మ్యాథ్స్ అండ్ సైన్స్ సిమ్యులేషన్స్'పై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభంగా, అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు వర్చువల్‌గా మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం, రాష్ట్ర విద్యా లక్ష్యాలకు అనుగుణంగా టీచర్లకు అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని తప్పనిసరిగా పాఠశాలల్లో అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఐఐటీ మద్రాస్ ప్రవర్తక్ ప్రతినిధి నాగరాజన్ మాట్లాడుతూ సైన్స్, గణిత ఉపాధ్యాయులకు సిమ్యులేషన్ కార్యక్రమాన్ని దేశంలోనే ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టడం అభినందనీయమన్నారు. సమగ్ర శిక్ష ఏఎస్పీడీ శ్రీనివాసులు, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం అలవాటు చేసుకోవాలి

రాష్ట్ర స్థాయి స్కూల్ బ్యాండ్ పోటీల్లో సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: చదువుల్లో రాణించేందుకు, ఆత్మవిశ్వాసం, మనోధైర్యం పొందేందుకు విద్యార్థులు వ్యాయామం అలవాటు చేసుకోవాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బీ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా, పుల్లంపేట (ఎస్పీవీడీ ఉన్నత పాఠశాల)లో నాలుగు విభాగాల్లో బాల, బాలికల బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 'పీఎంశ్రీ'కు ఎంపికైన పాఠశాలల్లో జిల్లాలోని నాలుగు పాఠశాలలకు స్కూల్ బ్యాండ్ పరికరాలను అందజేస్తామన్నారు. రాష్ట్ర స్కూల్ గేమ్ నోడల్ అధికారి, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు పోటీల నివేదికను సమర్పించారు. పైప్ బ్యాండ్ బాలురు విభాగంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ పాఠశాల (తాడేపల్లిగూడెం) ప్రథమ స్థానం సాధించింది. బ్రాస్ బ్యాండ్ బాలుర విభాగంలో మాంటిస్సోరి ఇండస్ స్కూల్ (కర్నూలు), బాలికల విభాగంలో పెంచులరెడ్డి స్కూల్ (రాయచోటి) ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ బృందాలు డిసెంబరు 3న తిరువనంతపురం జీవీరాజా స్పోర్ట్స్ స్కూల్లో జరిగే సదరన్ రీజియన్ జోనల్ పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయి.

వ్యవస్థలను తప్పుదారి పట్టిస్తున్న బాబు

1,144వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రూ.లక్షల కోట్ల అవినీతి కేసుల్లో నుంచి తప్పించుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవస్థలను సైతం తప్పుదారి పట్టిస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయ పాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,144వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం పలువురు మాట్లాడారు. 40 సంవత్సరాలుగా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబు.. పక్కా ఆధారాలతో అవినీతి కేసుల్లో పట్టుబడినా జైలుకు వెళ్లకుండా తప్పించుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నాడని అన్నారు. లంక, అసైన్డ్ భూముల రైతులకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం బహుజనుల కుటుంబాల్లో వెలుగులు నింపిందని, అయితే బాబు మాత్రం దళితులు, బహుజనుల భూములకు పరిహారం ఇవ్వడంలోనూ వివక్ష చూపించారని మండిపడ్డారు. ఏపీలో దళితులు, క్రైస్తవులు శ్మశాన వాటికలు లేక నానా ఇబ్బందులు పడుతుంటే గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని, సీఎం వైఎస్ జగన్ ముందడుగు వేసి ఈ నెల 17న పంపిణీకి చర్యలు తీసుకోవడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. నాయకులు పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, ఫిలోమాన్ కుమార్, నూతక్కి జోషి పాల్గొన్నారు.

ఆట కాదు.. వేట

జాతీయ క్రీడా పోటీల్లో సత్తా చాటిన ఏపీ

- 27 పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు
- గత ఏడాదితో పోలిస్తే 11 పతకాలు అధికం
- టార్గెట్ గోవా పేరుతో శాప్ ప్రత్యేక శిక్షణ శిబిరాలు
- రూ.80 లక్షలతో 17 క్రీడాంశాల్లో స్పెషల్ కోచింగ్
- శిక్షణతో మెరుగైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులు



గోవాలో జరిగిన 37వ జాతీయ క్రీడల్లో ఖోఖోలో కాంస్య పతకం సాధించిన ఏపీ జట్టు

సాక్షి, అమరావతి: జాతీయ క్రీడా పోటీల్లో ఏపీ క్రీడాకారుల బృందం మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. గత ఏడాదితో పోలిస్తే పతకాల వేటలో అద్భుతంగా రాణించింది. 7 స్వర్ణాలు, 5 రజతాలు, 15 కాంస్యాలతో కలిపి మొత్తం 27 పతకాలతో ఆంధ్రప్రదేశ్ 37వ జాతీయ క్రీడల్లో సత్తా చాటింది. మహిళా అథ్లెట్లు నాలుగు స్వర్ణాలు, రజతం, మూడు కాంస్యాలతో అదరగొట్టారు. గత ఏడాది అథ్లెటిక్స్‌లో ఆరు పతకాలు రాగా.. ఈ ఏడాది 8కి పెరిగాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో 3 నుంచి 5కు పెరిగాయి. వాటర్ స్పోర్ట్స్‌లో ప్రాతినిధ్యం వహించిన తొలి పోటీలోనే పతకం రావడం విశేషం. 20 క్రీడాంశాల్లో 183 క్రీడాకారులు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తే... ఇందులో 31 మంది పురుషులు, 33 మంది మహిళా క్రీడాకారులు వ్యక్తిగత, బృంద విభాగాల్లో పతకాలు సాధించారు.



వాటర్ స్పోర్ట్స్‌లో రజతం సాధించిన నగిడి గాయత్రి

శిక్షణ అదిరింది

జాతీయ క్రీడల్లో పతకాలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) 'టార్గెట్ గోవా' పేరుతో ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. క్రీడా సంఘాల సమన్వయంతో దాదాపు 17 క్రీడాంశాల్లో షెడ్యూల్ ప్రకారం శాప్ కోచ్‌లతో స్పెషల్ కోచింగ్ క్యాంపు నిర్వహించింది. ఫలితంగా క్రీడాకారుల నైపుణ్యాలు మెరుగుపడటంతో పతకాల సంఖ్య కూడా పెరిగింది. 17 క్రీడాంశాల్లో శిక్షణ కల్పిస్తే.. వీటిల్లో ఏకంగా 10 విభాగాల్లో పతకాలు రావడం విశేషం. ఈ స్పెషల్ క్యాంపు కోసం ఏకంగా రూ.80 లక్షలకు పైగా ఖర్చు చేయడంతో పాటు మరో రూ.14.16 లక్షల విలువైన క్రీడా పరికరాలు, దుస్తులను సమకూర్చింది. వీటితో పాటు పోటీలకు వెళ్లే ముందు టీఏ, డీఏల కింద మరో రూ.12 లక్షలు విడుదల చేసింది. గతేడాది 8 విభాగాల్లో 16 పతకాలు సాధిస్తే.. ఇప్పుడు 11 విభాగాల్లో ఏకంగా 27 పతకాలు గెలుపొందడం విశేషం.

పతకాల ఒరవడిని కొనసాగిస్తాం

ఏపీలోని యువతను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగానే శాప్ ప్రత్యేక కోచింగ్ క్యాంపుల ద్వారా మెరుగైన శిక్షణ అందిస్తోంది. వచ్చే జాతీయ పోటీల్లోనూ ఇప్పటి కంటే మెరుగైన ప్రదర్శన, ఎక్కువ పతకాలు సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతాం. అందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకుంటాం. ఈ పతకాల ఒరవడి ఇలానే కొనసాగేలా చూస్తాం.

– ధ్యాన్ చంద్ర, ఎండీ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ

క్రీడాకారులకు రెట్టింపు ప్రోత్సాహం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పెద్దపీట వేసింది. గతంలో ఇచ్చే నగదు ప్రోత్సాహకాలను రెట్టింపు చేసింది. జాతీయ క్రీడల్లో స్వర్ణం గెలిస్తే రూ.5 లక్షలు, రజతానికి రూ.4 లక్షలు, కాంస్యానికి రూ.3 లక్షల చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఫలితంగా క్రీడాకారులు ఆర్థిక ఇబ్బందులను దాటి పతకాలను ఒడిసి పడుతున్నారు.

సాధించిన పతకాలు ఇలా..

- బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం (డి.పూజా, ఎస్‌కే గౌస్), మహిళా బ్యాడ్మింటన్ జట్టుకు కాంస్యం (కె.నవ్య, టి.సూర్య చరిష్మా, ఎల్.మమైఖ్య, డి.రష్మిత, ఎం.ఆకాంక్ష, సీహెచ్. సాయి ఉత్తేజ్‌రావు, డి.పూజ, పి.సోనికసాయి, డి.దీపిక, డి.స్రవంతి) లభించాయి.
- మహిళల వెయిట్ లిఫ్టింగ్ 85 కేజీల విభాగంలో ఎన్.లలిత (స్వర్ణం), 59 కేజీల విభాగంలో ఎం.దీపనయోమి (కాంస్యం), పురుషుల్లో 109 కేజీల విభాగంలో బీఎస్ విష్ణు వర్ధన్ (రజతం), 55 కేజీల విభాగంలో ఎస్.గురునాయుడు (కాంస్యం), 73 కేజీల విభాగంలో జె.కోటేశ్వరరావు (కాంస్యం) పతకాలు సాధించారు.
- పెన్కాక్ సిలాట్ 80–85 కేజీల విభాగంలో డీఎస్‌పీ రత్నబాబు (కాంస్యం), మోడ్రన్ పెంటాథ్లాన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ డి.వెంకటేశ్, ఎన్.సనుతి యశోహర (కాంస్యం) పొందారు.
- అథ్లెటిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌ల్లో జ్యోతి యర్రాజీ (స్వర్ణం), 200 మీటర్ల పరుగులో (కాంస్యం) సాధించింది. 4X100 మీటర్ల రిలేలో ప్రత్యూష, మధు కావ్యారెడ్డి, భవానీ యాదవ్, జ్యోతి యార్రాజీ బృందం (స్వర్ణం), 4X400 మీటర్ల రిలేలో ప్రత్యూష, జ్యోతికశ్రీ, ఎం.శిరీష, కె.రజిత బృందం (స్వర్ణం) కైవసం చేసుకుంది.
- 400 మీటర్ల పరుగులో జ్యోతికశ్రీ (రజతం), జావెలిన్ త్రోలో రేష్మి శెట్టి (కాంస్యం), ట్రిపుల్ జంప్‌లో ఎం.అనూష (కాంస్యం), 200 మీటర్ల పరుగులో జ్యోతి యర్రాజీ కాంస్యం సాధించారు. మహిళల హెప్టాథ్లాన్‌లో సౌమ్య మురుగన్ స్వర్ణంతో అదరగొట్టింది.
- తైక్వాండోలో మహిళల 67 కేజీల విభాగంలో కనక మహాలక్ష్మి, పురుషుల 68 కేజీల విభాగంలో టి.వరుణ్ కాంస్య పతకాలు గెలుపొందారు.
- సెపక్ తక్రాలో మహిళల డబుల్ ఈవెంట్‌లో ఎం.మధులత, టి.నాగహారిక, జి.రోషిత బృందం (రజతం), పురుషుల రెగు విభాగంలో ఎం.అర్జున్, సి.అశోక్ కుమార్, జి.శివ కుమార్, ఎస్.మాలిక్ బాషా, టి.షణ్ముక్ శ్రీవంశీ బృందం (కాంస్యం) సాధించాయి.
- ఆర్చరీలో జి.బైరాగినాయుడు స్వర్ణం, మహిళల కయాకింగ్‌లో నాగిడి గాయత్రి రజతం సాధించింది. ఖోఖోలో ఏపీ పురుషుల జట్టు కాంస్యం గెలుపొందింది.
- స్కై మార్షల్ ఆర్ట్స్‌లో పురుషుల 50 కేజీల విభాగంలో పి.ప్రవీణ్ (రజతం), 58 కేజీల విభాగంలో ఎం.నీలాంజలి ప్రసాద్ (కాంస్యం), 75 కేజీల విభాగంలో బి.శ్రీనివాసులు (కాంస్యం) సాధించారు.

క్రీడా ప్రదర్శనలో మెరుగుదల ఇలా..

సంవత్సరం	స్వర్ణం	రజతం	కాంస్యం	మొత్తం	ర్యాంకు
2022	2	9	5	16	21
2023	7	5	15	27	19



పతకాలు సాధించిన ఏపీ బాలికలు

అవసరంలేని, అప్రాధాన్య జీవోలనే

వెబ్‌సైట్‌లో ఉంచడం లేదు

- మెడికల్ బిల్లులు, పెట్రోల్ అలవెన్స్ తదితర జీవోలు ప్రజలకు అవసరం లేదు
- అవి మినహా మిగిలిన జీవోలను వెబ్‌సైట్‌లో ఉంచుతున్నాం
- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్
- విచారణ ఈ నెల 22కి వాయిదా



సాక్షి, అమరావతి: ప్రజలకు ఏ మాత్రం అవసరంలేని, ప్రాధాన్యతలేని, ఇతర సాధారణ జీవోలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచడం లేదని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. మెడికల్ బిల్లులు, పెట్రోల్ అలవెన్సులు, ఇతర చెల్లింపులు తదితరాలకు సంబంధించిన జీవోలు ప్రజలకు అంత అవసరంలేదని, అందుకే వాటిని వెబ్‌సైట్‌లో ఉంచడం లేదని ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ హైకోర్టుకు వివరించారు. ఇందులో దాచేందుకు ఏమీలేదని తెలిపారు. మిగిలిన జీవోలను విడుదలైన వారం రోజుల్లో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. అత్యవసర జీవోలను మరుసటిరోజే అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. జీవోల విషయంలో గోప్యత పాటించాల్సిన అవసరం లేదని హైకోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై ఈ నెల 22న విచారిస్తామంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందనరావు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. జీవోలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచకపోవడం సమాచారహక్కు చట్ట నిబంధనలకు విరుద్ధమంటూ నెల్లూరుకు చెందిన జి.ఎం.ఎన్.ఎస్.దేవి, గుంటూరుకు చెందిన కె.శ్రీనివాసరావు, అనంతపురం జిల్లాకు చెందిన ఎస్.ఆర్.ఆంజనేయులు, బాపట్ల జిల్లాకు చెందిన సింగయ్య తదితరులు హైకోర్టులో వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు విచారణ జాబితాలో ఉన్నప్పటికీ విచారణకు నోచుకోని వీటిపై అత్యవసర విచారణ జరపాలంటూ పిటిషనర్ల న్యాయవాదులు బుధవారం సీజే ధర్మాసనం ముందు ప్రస్తావించారు. అత్యధిక జీవోలను ప్రభుత్వం అప్‌లోడ్ చేయకుండా గోప్యత పాటిస్తోందన్నారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. జీవోలను వెబ్‌సైట్‌లో ఉంచడం వల్ల నష్టమేముందని ప్రశ్నించింది. జీవోను ప్రజలకు అందుబాటులో ఉంచితే మంచిదేగా అని వ్యాఖ్యానించింది. దీనికి ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సుమన్ స్పందిస్తూ.. ప్రజలకు అవసరంలేని, ప్రాధాన్యతలేని, సాధారణ జీవోలనే వెబ్‌సైట్‌లో ఉంచడం లేదని తెలిపారు. మిగిలిన జీవోలను వెబ్‌సైట్‌లో ఉంచుతున్నామని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యాజ్యాల్లో విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది.

బీ'టెక్కు' టమార విద్యలు!

- జూదం, క్రికెట్ బెట్టింగ్‌లలో సిద్ధహస్తుడు
- దౌర్జన్యాలకూ వెనుకాడని నైజం
- బీటెక్ రవిపై నమోదైన కేసులే ఇందుకు నిదర్శనాలు

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల టీడీపీ నేత బీటెక్ రవి దౌర్జన్యాలు, క్రికెట్ బెట్టింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచాడు. వివాదాస్పద వ్యవహారాలకు కేంద్ర బిందువయ్యాడు. ఇద్దరి మధ్య నెలకొన్న ప్రైవేటు వ్యవహారాల్లోనైనా తనదైన శైలిలో దౌర్జన్యాలకు పాల్పడటం పరిపాటైంది. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపైనా అలాంటి ధోరణినే ప్రదర్శిస్తున్నాడు. వైఎస్సార్ జిల్లాలో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇలాంటి ఓ పెండింగ్ కేసులో బీటెక్ రవిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాల మేరకు కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు పంపారు. బీటెక్ రవి ఈజీ మనీ సాధించడంలో సిద్ధహస్తుడు. ఈ క్రమంలోనే జూదం, క్రికెట్ బెట్టింగ్‌లు నిత్యకృత్యమయ్యాయి. బెట్టింగ్‌లో చిక్కుకుని యువత ఆత్మహత్యలు చేసుకుంటుండటంతో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ వీటి నివారణకు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న పోరుమామిళ్లలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ సురేష్‌కుమార్‌రెడ్డితో పాటు మరో ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. ఆ మేరకు క్రైమ్ నంబర్ 307/2023 ద్వారా కేసు నమోదైంది. ఇందులో లోతుగా దర్యాప్తు చేస్తే మొత్తం 41 మంది పాత్రధారులు, సూత్రధారుల ప్రమేయం ఉన్నట్టు తేలింది.

క్రమ సంఖ్య	క్రైమ్ నంబరు	సెక్షన్లు	కేసుకు సంబంధించి ప్రస్తుత స్థితి	స్టేషన్ పేరు
1	123/2019	448, 323, 506 ఆర్/డబ్ల్యు, 34ఐపీసీ	పీటీ	సింహాద్రిపురం
2	494/2020	3(1)(ఆర్) ఎస్సీ ఎస్టీ పీఓ యాక్ట్	పీటీ	పులివెందుల
3	95/2021	188, 341, ఆర్/డబ్ల్యు, 34ఐపీసీ	పీటీ	జమ్మలమడుగు
4	268/2021	188, 341, 290, ఆర్/డబ్ల్యు, 34ఐపీసీ	పీటీ	కడప వన్‌టౌన్
5	271/2021	188, 269 ఐపీసీ అండ్ సెక్షన్ 51(బీజెడ్) డీఎం యాక్ట్ 2005	పీటీ	పులివెందుల
6	21/2023	341, 352, 353, 506 ఆర్/డబ్ల్యు, 34 ఐపీసీ	యూఐ	వల్లూరు
7	23/2023	160 ఐపీసీ	యూఐ	లింగాల
8	40/2023	143, 447, 427, 434, 386, 506 ఆర్/డబ్ల్యు, 149 ఐపీసీ 120(బి), 109 ఐపీసీ	యూఐ	చక్రాయపేట
9.	307/2023	9/1ఏపీజీఏ	పీటీ	పోరుమామిళ్ల

అందులో టీడీపీ నేత బీటెక్ రవి ఏ–17గా ఉండటం విశేషం. ఈ క్రమంలో కోర్టులో పీటీ వారెంట్ వేసి, క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై బీటెక్ రవిని విచారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ప్రైవేటు వ్యవహారంలో సైతం..

పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం నాగులగట్టుపల్లెలో గోవిందు రామయ్యకు చెందిన భూమిని రమణ, సుబ్బయ్యలు కొని.. వెంచర్ వేశారు. స్థానిక టీడీపీ నేత మహేశ్వరరెడ్డికి వారితో వివాదం ఏర్పడితే.. ఏప్రిల్ 30న బీటెక్ రవి మందీమార్బలంతో వాహనాలతో వెళ్లి రమణ, సుబ్బయ్యలపై దౌర్జన్యం చేసి, వెంచర్‌ను సైతం ట్రాక్టర్లతో దున్నేశారు. అప్పట్లో క్రైమ్ నంబర్ 40/2023 ద్వారా కేసు నమోదైంది. ఇలాంటి పరిస్థితి పోలీసు ఆఫీసర్‌కూ ఎదురైంది. ఈ ఏడాది జనవరి 26న కడప ఎయిర్‌పోర్టుకు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వస్తున్న నేపథ్యంలో అక్కడికి బీటెక్ రవి తన అనుచరులతో కలిసి వెళ్లాడు. మూకుమ్మడిగా ఎయిర్‌పోర్టులోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్న ఏఎస్ఐ దివాకర్ అడ్డుకునే యత్నం చేశారు. బీటెక్ రవి.. అతడిని తోసేయడంతో కింద పడిపోయారు. కాలు ఫ్యాక్చర్ అయ్యింది. ఈ కేసులో బీటెక్ రవి ప్రధాన నిందితుడు. ఇలాంటివి ఆయన జీవితంలో సర్వసాధారణమని చెబుతున్నారు. కాగా బీటెక్ రవిపై 9 కేసులు వివిధ దశల్లో ఉన్నాయి.

భారీ తెర ముందు ఫ్యాన్స్ కేరింతలు

- విశాఖ, విజయవాడ, కడపలో ఏసీఏ ప్రత్యేక ప్రాంగణాల ఏర్పాటు
- ప్రత్యేక టెంట్లు.. ఫ్లడ్ లైట్ల వెలుగుల మధ్య అభిమానుల సందడి
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండాలు

విశాఖ స్పోర్ట్స్/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు)/కడప స్పోర్ట్స్: వరల్డ్ కప్ సెమీ ఫైనల్ భారత్–న్యూజిలాండ్ మ్యాచ్ సందర్భంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) భారీ స్క్రీన్లపై లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేసింది. విజయవాడలోని మునిసిపల్ స్టేడియం, విశాఖ సాగర తీరంలోని కాళీమాత ఆలయం, కడపలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో వీటిని ఏర్పాటు చేయగా.. వేలాది మంది క్రికెట్ అభిమానులతో ఆయా ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. తొలిసారిగా అభిమానుల ప్రాంగణం పేరిట ఈ తరహా భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసింది. విరాట్‌కోహ్లీ 50వ శతకాన్ని పూర్తి చేసిన సందర్భంగా అభిమానుల కోలాహలం అంబరాన్ని తాకింది. టాస్ వేయడానికి ముందే అభిమానులతో ప్రాంగణాలు నిండిపోయాయి. సాగర తీరంలో ప్రత్యేకంగా కేరళ సంప్రదాయ వాయిద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. ఫ్లడ్‌లైట్లతో పాటు అభిమానులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక టెంట్‌లతో పాటు ఫుడ్ కోర్టుల్ని ఏర్పాటు చేశారు. అన్ని ప్రాంగణాల్లో మువ్వన్నెల పతాకాలు రెపరెపలాడాయి. అభిమానులు తమ మోహాలపై మువ్వన్నెల పతాకాలను టాటూలుగా వేయించుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో 10 వేల మంది చొప్పున వీక్షించేలా ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశం ఉచితంగానే కల్పించామని, అభిమానులు పెద్దఎత్తున హాజరై మ్యాచ్‌ను ఆద్యంతం ఆస్వాదించారన్నారు.



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో భారత్-న్యూజిలాండ్ మధ్య సెమీస్‌ను బిగ్ స్క్రీన్ పై తిలకిస్తున్న అభిమానులు

హాట్‌కేకుల్లా ఆన్‌లైన్ టికెట్లు

ఈ నెల 23వ తేదీన విశాఖలోని వైఎస్సార్ స్టేడియం వేదికగానే ఆస్ట్రేలియా–భారత్ టీ–20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ టికెట్ల విక్రయాలు బుధవారం పేటీఎం ఇన్‌సైడర్‌లో హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. బాక్స్‌ఆఫీస్ (కౌంటర్) 22వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని, ఆన్‌లైన్ టికెట్లను ఫిజికల్ టికెట్లుగా మార్చుకుని ప్రవేశం పొందాలన్నారు. మ్యాచ్ జరిగే రోజు 23వ తేదీన వైఎస్సార్ స్టేడియంలోనూ ఫిజికల్ టికెట్ మార్పిడి కౌంటర్ కొనసాగనుందని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో స్టేడియంతో పాటు గాజువాక, టౌన్‌కొత్త రోడ్‌లలోని మునిసిపల్ స్టేడియాల్లోనూ 17, 18వ తేదీల్లో టికెట్ల విక్రయించనున్నారు. స్టేడియంలో ఈ మ్యాచ్‌ను వీక్షించడంతో పాటు అభిమానుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఇదే స్క్రీన్‌పై మ్యాచ్‌ను ప్రసారం చేసేందుకు మ్యాచ్ నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.



విశాఖ బీచ్‌లో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్ వద్ద అభిమానుల సందడి



కడప ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన బిగ్ స్క్రీన్



కడప ఆర్ట్స్ కాలేజీ మైదానంలో మ్యాచ్ తిలకిస్తున్న అభిమానులు

క్వాడ్రాంగ్యులర్ టోర్నీలో భారత్–ఏ, బంగ్లా విజయం

- ఇంగ్లండ్‌పై 46 పరుగుల తేడాతో గెలిచిన భారత్–ఏ జట్టు
- భారత్–బిపై 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన బంగ్లా



మూలపాడులో భారత్-ఏ, ఇంగ్లండ్ జట్ల మధ్య మ్యాచ్

సాక్షి, అమరావతి/మూలపాడు(ఇబ్రహీంపట్నం): అంతర్జాతీయ క్వాడ్రాంగ్యులర్ అండర్–19 టోర్నీలో బుధవారం భారత్–ఏ, బంగ్లాదేశ్ జట్లు విజయం సాధించాయి. విజయవాడకు సమీపంలోని మూలపాడు క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై భారత్–ఏ జట్టు 46 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్–ఏ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 293 పరుగులు చేసింది. ఉదయ్ సహరాన్ 57 పరుగులు, దిగ్విజయ్ పాటిల్ 51 పరుగులతో రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 247 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారత్–ఏ బౌలర్లలో అర్షిన్ కులకర్ణి 3 వికెట్లు, ముషీర్ ఖాన్ 2 వికెట్లు తీసి ఆకట్టుకున్నారు.

7 వికెట్ల తేడాతో బంగ్లా గెలుపు

భారత్–బి, బంగ్లాదేశ్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్–బి జట్టు 47.3 ఓవర్లలో 243 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారత్–బి బ్యాటర్లు రుద్ర మయూర్ పాటిల్ 64, వైభవ్ సూర్య 75 పరుగులతో రాణించగా.. బంగ్లా బౌలర్లు ఎండీ ఇక్బాల్ 3, వాసి సిద్దికీ, మరుఫ్ మృధా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన బంగ్లా జట్టు 43.5 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసి విజయం సాధించింది. ఎండీ అషికుర్ రెహమాన్ షిబ్లీ(135 పరుగులు), ఎండీ రిజ్వాన్ (85 నాటౌట్) చెలరేగి ఆడారు.

"నా మనసులో ఎలాంటి భావాలు ఉన్నాయో చెప్పలేకపోతున్నా. అంతా ఒక కలలా ఉంది. ఇదంతా నిజమేనా అనిపిస్తోంది. సెమీ ఫైనల్‌లో ఇలా చేయగలనని ఎప్పుడూ అనుకోలేదు. నా హీరో సచిన్, నా జీవిత భాగస్వామి అంతా అక్కడ కూర్చున్నారు. ఇక అభిమానులంతా తోడుగా నిలిచారు. ఇంకా వివరంగా చెప్పలేకపోతున్నా కానీ నేను ఒక చిత్రాన్ని గీసే అవకాశం ఉంటే అది ఇదే చిత్రం కావాలని కోరుకుంటా. -విరాట్ కోహ్లి

విలియమ్సన్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను వదిలేసినప్పుడు చాలా బాధపడ్డా. అయితే బౌలింగ్‌తోనే వారిని పడగొట్టాలని భావించా. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో భిన్నంగా ప్రయత్నించాల్సి వచ్చింది. ఈ ప్రదర్శనతో చాలా గొప్పగా అనిపిస్తోంది. గత రెండు టోర్నీల్లో సెమీస్ ఓడాం. ఎవరికి ఎప్పుడు అవకాశం వస్తుందో ఎవరూ చెప్పలేరు. ఈ అవకాశం చేజార్చుకోరాదని కోరుకుంటున్నాం. -షమీ

ఈ మైదానంలో ఎంత స్కోరు చేసినా సరిపోదని నాకు బాగా తెలుసు. ఆరంభంలోనే వికెట్లు పడగొట్టడం ముఖ్యం. ఫీల్డింగ్‌లో కాస్త ఇబ్బంది పడ్డాం. సెమీస్ అంటే సహజంగానే అదనపు ఒత్తిడి ఉంటుంది. కానీ ప్రశాంతంగా ఉండటం ముఖ్యం. మరో 30-40 పరుగులు తక్కువగా చేస్తే ఎలా ఉండేదో చెప్పలేను. ఎందుకంటే వారూ జాగ్రత్తగానే ఆడేవారేమో. షమీ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. టాప్-6 బ్యాటర్లంతా తమ పాత్రకు న్యాయం చేస్తున్నారు. చివరకు అన్నీ మాకు అనుకూలించాయి. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్"



'షమీ'ఫైనల్ వండర్

ప్రపంచకప్ తుదిపోరుకు టీమిండియా

సెమీఫైనల్లో 70 పరుగులతో న్యూజిలాండ్‌పై విజయం • 7 వికెట్లతో మెరిసిన షమీ
కోహ్లి, అయ్యర్ సెంచరీలు • మిచెల్ శతకం వృథా • పోరాడి ఓడిన కివీస్ బృందం



షమీ 7/57

భారత్ అప్రతిహత జైత్రయాత్రలో మరో అడుగు విజయవంతంగా పడింది... 1983, 2003, 2011... ఈ క్యాలెండర్‌లలో ఇప్పుడు 2023 చేరింది... అభిమానుల కలలను నిజం చేసే అంచనాలను నిలబెట్టే ప్రయత్నంలో టీమిండియా మరోసారి తుది పోరుకు అర్హత సాధించింది. లీగ్ దశలో ఒక్క ఓటమీ లేకుండా ముగించిన టీమిండియా నాకౌట్ పోరులోనూ తమ స్థాయిని నిలబెట్టుకుంది... ఆసక్తికరంగా, అక్కడక్కడా పోటాపోటీగా సాగిన సమరంలో న్యూజిలాండ్‌పై విజయం సాధించి సగర్వంగా నిలిచింది. గత వరల్డ్ కప్‌లో ఇదే కివీస్ చేతిలో ఇదే సెమీస్ మ్యాచ్‌లో ఎదురైన ఓటమికి నాలుగేళ్ల తర్వాత ప్రతీకారం తీర్చుకొని పాత గాయానికి మందు వేసింది. కోహ్లి, అయ్యర్, షమీ ఈ గెలుపులో హీరోలుగా నిలిచారు.

397 పరుగులు... ఇంత భారీ స్కోరు చేసిన తర్వాత కూడా భారత జట్టు ఒకదశలో ఆందోళనకు లోనైంది... ఆటగాళ్లలో నాకౌట్ మ్యాచ్ ఒత్తిడి కనిపించి తప్పులు చేయడం మొదలైంది... అభిమానుల్లో కాస్త ఉత్కంఠ, మరి కాస్త ఆందోళన... పోరాటానికి మారుపేరైన కివీస్ తగ్గలేదు... 32 ఓవర్ల తర్వాత చూస్తే కివీస్ స్కోరు 219/2... అంతకుముందు ఈ స్థితిలో భారత్ 226/1... పెద్ద తేడా ఏమీ లేదు. తర్వాతి ఓవర్లలో చెలరేగేందుకు బ్యాటర్లు సిద్ధంగా ఉన్నారు. అప్పుడొచ్చాడు షమీ... ఒకే ఓవర్లో రెండు వికెట్లతో కివీస్ వెన్ను విరిచి మళ్లీ కోలుకోలేకుండా చేశాడు. చివరి వరకు అదే జోరును కొనసాగించి భారత్ తరఫున అత్యుత్తమ వన్డే గణాంకాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు.

ముంబై: వన్డే వరల్డ్ కప్ చరిత్రలో నాలుగోసారి భారత్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. గత రెండు టోర్నీల్లో సెమీఫైనల్‌కు పరిమితమైన టీమిండియా ఈసారి మరో అడుగు ముందుకేసి ట్రోఫీపై గురి పెట్టింది. బుధవారం వాంఖెడే మైదానంలో జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 70 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 397 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (113 బంతుల్లో 117; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (70 బంతుల్లో 105; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగగా... శుబ్‌మన్ గిల్ (66 బంతుల్లో 80 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కోహ్లి, అయ్యర్ 21.2 ఓవర్లలోనే 163 పరుగులు జత చేయడం విశేషం. అనంతరం న్యూజిలాండ్ 48.5 ఓవర్లలో 327 పరుగులకు ఆలౌటైంది. డరైల్ మిచెల్ (119 బంతుల్లో 134; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, కేన్ విలియమ్సన్ (73 బంతుల్లో 69; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ షమీ (7/57) కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో కివీస్‌ను దెబ్బ కొట్టాడు. నేడు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య కోల్‌కతాలో జరిగే రెండో సెమీఫైనల్ మ్యాచ్ విజేతతో ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో భారత్ తలపడుతుంది.

ఒకరితో మరొకరు పోటీ పడి...

ఎప్పటిలాగే కెప్టెన్ రోహిత్ శర్మ (29 బంతుల్లో 47; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) తనదైన శైలిలో ఇన్నింగ్స్‌ను దూకుడుగా మొదలు పెట్టాడు. కివీస్ ప్రధాన పేసర్లపై తన జోరును ప్రదర్శించిన అతను చక్కటి షాట్లతో దూసుకుపోయాడు. తనను ఇబ్బంది పెట్టగలడని భావించిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్ బౌల్ట్ బౌలింగ్‌లోనే రోహిత్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టాడు. గిల్ కూడా అండగా నిలవడంతో తొలి 8 ఓవర్లలోనే భారత్ 70 పరుగులు చేసింది. అయితే మరో భారీ షాట్‌కు ప్రయత్నించిన రోహిత్‌ను తర్వాతి ఓవర్లోనే సౌతీ అవుట్ చేయడంతో తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం గిల్ తన ధాటిని పెంచాడు. ఫెర్గూసన్ ఓవర్లో వరుసగా ఫోర్, సిక్స్ కొట్టిన అతను 41 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కండరాలు పట్టేయడంతో గిల్ పెవిలియన్‌కు వెళ్లిపోగా, అతని స్థానంలో వచ్చిన అయ్యర్ మెరుపు బ్యాటింగ్‌తో కివీస్ పని పట్టాడు. 29వ ఓవర్ తొలి బంతికి భారత్ స్కోరు 200 పరుగులు దాటింది. తన సొంత మైదానంలో సిక్సర్లతో చెలరేగిన అయ్యర్‌ను నిలువరించడం ప్రత్యర్థి బౌలర్ల వల్ల కాలేదు. బౌల్ట్ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన అతను 35 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. 40వ ఓవర్ ముగిసేసరికి స్కోరు 287/1. చివరి 10 ఓవర్లలో టీమిండియా మరింతగా చెలరేగిపోయింది. రచిన్ బౌలింగ్‌లోనే మూడు సిక్సర్లతో అయ్యర్ సత్తా చాటాడు. సౌతీ ఓవర్లో భారీ సిక్స్ బాదిన అయ్యర్ తర్వాతి బంతికి సింగిల్ తీసి 67 బంతుల్లోనే వరుసగా రెండో శతకం నమోదు చేశాడు. వీరందరికి తోడు కేఎల్ రాహుల్ (20 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) తన మెరుపులను జోడించడంతో చివరి 2 ఓవర్లలో 31 పరుగులు వచ్చాయి. ఆఖరి 10 ఓవర్లలో భారత్ 110 పరుగులు సాధించింది.

భయపెట్టిన భాగస్వామ్యాలు...

దాదాపు అసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కివీస్ తడబడింది. 39 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయింది. అయితే విలియమ్సన్, మిచెల్ కలిసి జట్టును ఆదుకున్నారు. ఆరంభంలో జాగ్రత్తగా ఆడినా ఆ తర్వాత వీరిద్దరు భారీ షాట్లతో చెలరేగిపోయారు. భారత బౌలింగ్ కొద్ది సేపు కట్టుతప్పి వైడ్‌లు, బైస్, ఓవర్‌త్రోలు, ఫీల్డింగ్ వైఫల్యాలు, రనౌట్ అవకాశాలు చేజారడం ... ఇవన్నీ కూడా కివీస్‌కు కలిసొచ్చాయి. ముఖ్యంగా మిచెల్ ప్రతీ బౌలర్‌పై చెలరేగి పరుగులు సాధించగా, విలియమ్సన్ సరైన రీతిలో సహకరించాడు. వీరిద్దరు క్రీజ్‌లో ఉన్నంత సేపు (24.5 ఓవర్లు) భారత బృందంలో కాస్త ఒత్తిడి కనిపించింది. ఇదే జోరులో మిచెల్ 85 బంతుల్లో టోర్నీలో తన రెండో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మూడో వికెట్‌కు 181 పరుగుల భాగస్వామ్యం తర్వాత ఎట్టకేలకు భారత్‌కు వికెట్ దక్కింది. విలియమ్సన్‌ను అవుట్ చేసిన షమీ, అదే ఓవర్లో లాథమ్ (0)ను వెనక్కి పంపడంతో కివీస్ వెనకడుగు వేసింది. ఆ తర్వాత మిచెల్, ఫిలిప్స్ (33 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా 61 బంతుల్లోనే 75 పరుగులు జత చేయడం కూడా మ్యాచ్‌లో కివీస్ ఆశలు నిలిపింది. కానీ 44 బంతుల్లో 103 పరుగులు చేయాల్సిన స్థితిలో ఫిలిప్స్ అవుట్ కావడంతో న్యూజిలాండ్ పరాజయం ఖాయమైంది.



అయ్యర్



మిచెల్

కింగ్ 50

వన్డేల్లో కోహ్లి 50వ సెంచరీ • సచిన్‌ను అధిగమించి కొత్త రికార్డు



'వచ్చే కొద్ది రోజుల్లోనే నా రికార్డును బద్దలు కొడతావని ఆశిస్తున్నా'... కోహ్లి 49వ సెంచరీ తర్వాత సచిన్ టెండూల్కర్ చెప్పిన మాట ఇది. దిగ్గజ క్రికెటర్ ఆశీర్వాదం వాస్తవంగా మారేందుకు ఎక్కువ రోజులు పట్టలేదు. సరిగ్గా పది రోజులకే 49 నుంచి 50కి చేరుకొని విరాట్ కొత్త చరిత్ర సృష్టించాడు. సచిన్ ఎదురుగా... సచిన్ సొంత మైదానంలో... సచిన్ తొలి అంతర్జాతీయ మ్యాచ్ బరిలోకి దిగిన తేదీన... సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఖరి సారిగా బ్యాటింగ్ చేసిన తేదీన... ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో సచిన్ రికార్డును అధిగమించి వన్డే క్రికెట్‌లో అత్యధిక శతకాలతో శిఖరాన నిలిచాడు. దక్షిణాఫ్రికాపై సెంచరీ సాధించిన తర్వాత కోహ్లి ఫామ్ చూస్తే మిగిలిన వరల్డ్ కప్ మ్యాచ్‌లలో ఈ మైలురాయిని అందుకోవడం లాంఛనమే అనిపించింది. బుధవారం తన స్థాయికి తగ్గ ఆటతో తనదైన శైలిలో కోహ్లి దానిని చేసి చూపించాడు. 9, 1, 1... గత మూడు వరుస ప్రపంచకప్ (2011, 2015, 2019) సెమీఫైనల్స్‌లో కోహ్లి స్కోర్లు ఇవి. ఇలాంటి నేపథ్యంలో బరిలోకి దిగిన తర్వాత 'సున్నా' వద్ద ఎల్బీడబ్ల్యూ కోసం కివీస్ అప్పీల్, ఆపై రివ్యూ కోరడం కొద్దిసేపు అభిమానుల గుండె ఆగిపోయేలా చేసింది. ఆ తర్వాత అతని ఇన్నింగ్స్ జాగ్రత్తగా సాగింది. తొలి 40 బంతుల్లో అతను రెండే ఫోర్లతో 30 పరుగులు చేశాడు. ఆ తర్వాత మరో రెండు ఫోర్లతో 59 బంతుల్లో కోహ్లి అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సౌతీ బౌలింగ్‌లో చూడచక్కటి సిక్సర్ కొట్టాక ఫిలిప్స్ ఓవర్లో తీసిన సింగిల్‌తో వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ ఘనతను అధిగమించాడు. 91 వద్ద సింగిల్ తీశాక కండరాలు పట్టేయడంతో ఫిజియోతో స్వల్ప చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. భారత్ ఇన్నింగ్స్ 42వ ఓవర్ నాలుగో బంతికి కొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. ఫెర్గూసన్ బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ దిశగా ఆడి రెండు పరుగులు తీయడంతో 50వ వన్డే సెంచరీ విరాట్ ఖాతాలో చేరింది. దాంతో వాంఖెడే మొత్తం హోరెత్తిపోయింది. 49వ శతకం సమయంలో ఎలాంటి భావోద్వేగాలు చూపించకుండా ప్రశాంతత కనబర్చిన కోహ్లి ఇక్కడ మాత్రం నియంత్రించుకోలేకపోయాడు. గాల్లోకి ఎగిరి జంప్ చేయడంతో పాటు తన భార్య అనుష్క వైపు చూస్తూ ఫ్లయింగ్ కిస్‌లు పంపిన కింగ్... సచిన్‌ను చూస్తూ తల వంచి అభివాదంతో తన గౌరవాన్ని ప్రదర్శించాడు. మరో ఏడు బంతుల తర్వాత ఈ అద్భుత ఇన్నింగ్స్ ముగియగా, మైదానంలో ప్రేక్షకుల అభినందనల మధ్య అతను పెవిలియన్ చేరాడు. మొదటి 49 సెంచరీలు ఒక ఎత్తు... ఈ శతకం మరో ఎత్తు అన్నట్లుగా విరాట్ ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచిపోయింది.

కోహ్లి భార్య అనుష్క ఆనందం

711 ఈ ప్రపంచకప్‌లో కోహ్లి చేసిన మొత్తం పరుగులు. ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా 20 ఏళ్లుగా సచిన్ పేరిట ఉన్న రికార్డును కోహ్లి బద్దలు కొట్టి కొత్త రికార్డు నెలకొల్పాడు. 2003 ప్రపంచకప్‌లో సచిన్ టెండూల్కర్ 673 పరుగులు సాధించాడు.

24 భారత్‌లో కోహ్లి చేసిన సెంచరీలు. ఒకే దేశంలో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్ కోహ్లినే. ఈ జాబితాలో సచిన్ 20 సెంచరీలు (భారత్‌లో), పాంటింగ్ (ఆస్ట్రేలియా), ఆమ్లా (దక్షిణాఫ్రికా) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

వన్డేల్లో అత్యధిక సెంచరీ వీరులు (టాప్-5)

ప్లేయర్	సంఖ్య	మ్యాచ్‌లు	ఇన్నింగ్స్	అత్యధిక స్కోరు
కోహ్లి	50	291	279	183
సచిన్	49	463	452	200*
రోహిత్ శర్మ	31	261	253	264
పాంటింగ్	30	375	365	164
జయసూర్య	28	445	433	189

4 వన్డే ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరడం ఇది నాలుగోసారి. గతంలో భారత్ 1983 (విజేత), 2003 (రన్నరప్), 2011 (విజేత) తుది పోరుకు అర్హత సాధించింది.

1 ఒకే ప్రపంచకప్‌లో మ్యాచ్‌లో 5 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు మూడుసార్లు తీసిన తొలి బౌలర్‌గా షమీ గుర్తింపు పొందాడు. గతంలో గ్యారీ గిల్మోర్ (ఇంగ్లండ్: 1975లో), అశంత డి మెల్ (శ్రీలంక: 1983లో), వాస్‌బెర్ట్ డ్రేక్స్ (వెస్టిండీస్: 2003లో), షాహిద్ అఫ్రిది (పాకిస్తాన్: 2011లో), ముస్తఫిజుర్ రెహ్మాన్ (బంగ్లాదేశ్: 2019లో), మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా: 2019లో) రెండుసార్లు చొప్పున ఈ ఘనత సాధించారు.

1 వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లో 7 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా షమీ (7/57) గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా: 7/15 నమీబియాపై 2003లో), బికెల్ (ఆస్ట్రేలియా: 7/20 ఇంగ్లండ్‌పై 2003లో), టిమ్ సౌతీ (న్యూజిలాండ్: 7/33 ఇంగ్లండ్‌పై 2015లో), విన్‌స్టన్ డేవిస్ (వెస్టిండీస్: 7/51 ఆస్ట్రేలియాపై 1983లో) ఉన్నారు.

1 వన్డేల్లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన భారత బౌలర్‌గా షమీ నిలిచాడు. స్టువర్ట్ బిన్నీ (4 పరుగులకు 6 వికెట్లు; 2014లో బంగ్లాదేశ్‌పై) పేరిట ఉన్న రికార్డును షమీ అధిగమించాడు. ఒకే ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా షమీ (23 వికెట్లు) అవతరించాడు. జహీర్ ఖాన్ (21 వికెట్లు 2003లో) పేరిట ఉన్న రికార్డును షమీ సవరించాడు.

51 ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా రోహిత్ శర్మ అవతరించాడు. రోహిత్ ఇప్పటి వరకు 51 సిక్స్‌లు కొట్టాడు. 49 సిక్స్‌లతో క్రిస్ గేల్ (వెస్టిండీస్) పేరిట ఉన్న రికార్డును రోహిత్ సవరించాడు. అంతేకాకుండా ఒకే ప్రపంచకప్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గానూ రోహిత్ గుర్తింపు పొందాడు. ఈ ప్రపంచకప్‌లో రోహిత్ 28 సిక్స్‌లు కొట్టాడు. క్రిస్ గేల్ (2015లో 26 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు.

397 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. 2015 ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్లో వెస్టిండీస్‌పై న్యూజిలాండ్ 6 వికెట్లకు 393 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) విలియమ్సన్ (బి) సౌతీ 47; గిల్ (నాటౌట్) 80; కోహ్లి (సి) కాన్వే (బి) సౌతీ 117; అయ్యర్ (సి) మిచెల్ (బి) బౌల్ట్ 105; రాహుల్ (నాటౌట్) 39; సూర్యకుమార్ (సి) ఫిలిప్స్ (బి) సౌతీ 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో 4 వికెట్లకు) 397.** వికెట్ల పతనం: 1-71, 2-164, 3-381, 4-382. బౌలింగ్: బౌల్ట్ 10-0-86-1, సౌతీ 10-0-100-3, సాన్‌ట్నర్ 10-1-51-0, ఫెర్గూసన్ 8-0-65-0, రచిన్ 7-0-60-0, ఫిలిప్స్ 5-0-33-0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) రాహుల్ (బి) షమీ 13; రచిన్ (సి) రాహుల్ (బి) షమీ 13; విలియమ్సన్ (సి) సూర్యకుమార్ (బి) షమీ 69; మిచెల్ (సి) జడేజా (బి) షమీ 134; లాథమ్ (ఎల్బీ) (బి) షమీ 0; ఫిలిప్స్ (సి) జడేజా (బి) బుమ్రా 41; చాప్‌మన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 2; సాన్‌ట్నర్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 9; సౌతీ (సి) రాహుల్ (బి) షమీ 9; బౌల్ట్ (నాటౌట్) 2; ఫెర్గూసన్ (సి) రాహుల్ (బి) షమీ 6; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (48.5 ఓవర్లలో ఆలౌట్) 327.** వికెట్ల పతనం: 1-30, 2-39, 3-220, 4-220, 5-295, 6-298, 7-306, 8-319, 9-321, 10-327. బౌలింగ్: బుమ్రా 10-1-64-1, సిరాజ్ 9-0-78-1, షమీ 9.5-0-57-7, జడేజా 10-0-63-0, కుల్దీప్ 10-0-56-1.

బాబర్ ఆజమ్ రాజీనామా

కరాచీ: వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ బాబర్ ఆజమ్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. 'అన్ని ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా తప్పుకుంటున్నాను. నా నిర్ణయం కఠినమైందే అయినా రాజీనామాకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. ఆటగాడిగా జట్టులో కొనసాగుతా. నన్ను వెన్నంటే ప్రోత్సహించిన పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు కృతజ్ఞతలు' అని బాబర్ అన్నాడు.

చోకర్స్ ముద్ర చెరిగేనా!

- ఫైనల్లో స్థానం కోసం దక్షిణాఫ్రికా ఐదో ప్రయత్నం
- నేడు ఆస్ట్రేలియాతో రెండో సెమీఫైనల్లో 'ఢీ'
- మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రసారం



కోల్‌కతా: ఫైనల్‌ను తలపించే సెమీఫైనల్ పోరుకు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా సిద్ధమయ్యాయి. రెండు సమఉజ్జీ జట్ల మధ్య జరిగే ఈ రెండో సెమీఫైనల్ కడదాకా ఆసక్తికరంగా జరగడం ఖాయం. తరాలు మారినా హేమాహేమీలతో సరితూగిన సఫారీ జట్టు ప్రపంచకప్‌లో మాత్రం చోకర్స్‌గానే మిగిలింది. గతంలో దక్షిణాఫ్రికా ఈ మెగా ఈవెంట్‌లో నాలుగుసార్లు (1992, 1999, 2007, 2015) సెమీఫైనల్లోకి ప్రవేశించి ఆ అడ్డంకిని దాటలేకపోయింది. ఐదో ప్రయత్నంలోనైనా తొలిసారి ఫైనల్ చేరాలనే లక్ష్యంతో బవుమా సేన బరిలోకి దిగుతోంది. జట్టు కూడా జోరుమీదుంది. ఓపెనింగ్, మిడిలార్డర్ అందరూ భారీ స్కోర్లలో భాగమవుతున్నారు. పైగా ఈ టోర్నీలో గట్టి ప్రత్యర్థులపై ఐదుసార్లు 300 పైచిలుకు స్కోర్లను అవలీలగా చేసిన జట్టేదైనా ఉందంటే అది దక్షిణాఫ్రికానే! ఒక్క భారత్ తప్ప సెమీస్ చేరిన న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలపై తమ భారీస్కోర్ల తడాఖా చూపింది. డికాక్, డసెన్, మార్క్‌రమ్, క్లాసెన్, మిల్లర్ అందరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో రబడ కంటే కొయెట్జీ ప్రమాదకరంగా మారాడు. ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్‌లతో దక్షిణాఫ్రికా పటిష్టంగా ఉంది. మరోవైపు ఐదుసార్లు జగజ్జేత ఆస్ట్రేలియా ప్రపంచ కప్‌ను ఆరంభించిన తీరు, తర్వాత మారిన విధానం, దూసుకొచ్చి న వైనం ఈ ఈవెంట్‌లో ఏ జట్టుకు సాధ్యం కాదేమో! ప్రొఫెషనలిజానికి మారుపేరైన ఆసీస్ టోర్నీ సాగేకొద్దీ దుర్భేద్యంగా మారింది. వార్నర్, మార్ష్, లబుషేన్, స్మిత్‌లు రాణిస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. అఫ్గానిస్తాన్‌తో వీరోచిత డబుల్ సెంచరీతో జట్టును గెలిపించిన మ్యాక్స్‌వెల్ గాయంతో తదుపరి బంగ్లాదేశ్‌తో ఆడలేకపోయాడు. అయితే కీలకమైన ఈ సెమీస్‌లో అతను బరిలోకి దిగుతాడని, ఫిట్‌నెస్‌తో ఉన్నాడని కెప్టెన్ కమిన్స్ వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు వర్ష సూచన ఉంది. గురువారం మ్యాచ్ పూర్తికాకపోతే రిజర్వ్ డే శుక్రవారం కొనసాగిస్తారు. రెండు రోజుల్లోనూ ఫలితం రాకపోతే టోర్నీ లీగ్‌దశలో మెరుగైన స్థానంలో నిలిచిన దక్షిణాఫ్రికా ఫైనల్లోకి ప్రవేశిస్తుంది.

సాక్షి
బిజినెస్
గురువారం
16-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
742	232
65,676	19,675

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

● నాస్‌డాక్	14,128	▲	35
● డోజోన్స్	34,958	▲	132
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,487	▲	46
● డాక్స్	15,748	▲	134
● షాంఘై	3,073	▲	17
● నికాయ్	33,520	▲	824

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,670
బంగారం (22 క్యారట్)	56,830
వెండి (కిలో)	77,700

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాయిసీతో	81.31	84.99
£	బ్రిటన్ పౌండ్	ధాయిసీతో	101.23	106.14
€	యూరో	ధాయిసీతో	88.12	92.61
¥	జపాన్ ఎన్ (100)	ధాయిసీతో	42.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధాయిసీతో	51.85	56.64
S$	సింగపూర్ డాలర్	ధాయిసీతో	59.37	64.03
SAR	సౌదీ రియాల్	ధాయిసీతో	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	ధాయిసీతో	21.74	23.53
¥	చైనా యువాన్	ధాయిసీతో	10.36	12.43

అంకురాలకు దన్ను

- కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- భారత్, అమెరికా మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ: అంకుర సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే దిశగా భారత్, అమెరికా ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. నవకల్పనలకు ఊతమిచ్చేందుకు, నిధుల సమీకరణలో ఎంట్రప్రెన్యూర్లు పాటించే విధానాలను పరస్పరం పంచుకునేందుకు, నియంత్రణపరమైన సమస్యల పరిష్కార మార్గాలను కనుగొనేందుకు ఇది తోడ్పడనుంది. ఇరు దేశాల పరిశ్రమవర్గాల రౌండ్‌టేబుల్ సమావేశం సందర్భంగా ఎంవోయూ కుదిరినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే, ఆర్థిక కార్యకలాపాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనపై ఇది సానుకూల ప్రభావం చూపగలదని వివరించింది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమండో నేతృత్వం వహించిన ఈ సమావేశంలో పలువురు భారతీయ వ్యాపారవేత్తలు, టెక్నాలజీ దిగ్గజాల సీఈవోలు, వెంచర్



క్యాపిటల్ సంస్థల ప్రతినిధులు, స్టార్టప్‌ల వ్యవస్థాపకులు పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భారత్–అమెరికా వాణిజ్య చర్చల కింద రూపొందించిన ఇండియా–యూఎస్ ఇన్నోవేషన్ హ్యాండ్‌షేక్ కాన్సెప్టును ఈ సందర్భంగా గోయల్, రైమండో ఆవిష్కరించారు. డీప్ టెక్నాలజీ, క్రిటికల్ టెక్నాలజీ వంటి విభాగాల్లో సహకారాన్ని పటిష్టం చేసుకునేందుకు రెండు దేశాల నిబద్ధతకు ఎంవోయూ నిదర్శనంగా నిలుస్తుందని గోయల్ పేర్కొన్నారు. దీని కింద వచ్చే ఏడాది తొలినాళ్లలో భారత్, అమెరికాలో ఇన్నోవేషన్ హ్యాండ్‌షేక్ ఈవెంట్లను నిర్వహించనున్నారు.

ఓఎన్‌జీసీ రూ. లక్ష కోట్లు

పెట్రోకెమికల్ ప్లాంట్ల ఏర్పాటు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ చమురు, గ్యాస్ ఉత్పత్తి సంస్థ ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) రెండు పెట్రోకెమికల్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముడి చమురును నేరుగా అధిక విలువైన రసాయన ఉత్పత్తులుగా మార్చడానికి ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.1 లక్ష కోట్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నట్లు కంపెనీ రెండవ త్రైమాసిక ఫలితాలపై ఇన్వెస్టర్ కాల్ సందర్భంగా ఓఎన్‌జీసీ ఫైనాన్స్ డైరెక్టర్ పోమిలా జస్పాల్ వెల్లడించారు. వేర్వేరు రాష్ట్రాల్లో రెండు ప్రాజెక్టులకుగాను 2028 లేదా 2030 నాటికి రూ.10,000 కోట్లు వెచ్చించనున్నట్లు సంస్థ ఈడీ డి.అధికారి తెలిపారు. పెట్రోకెమికల్స్ సామర్థ్యం ప్రస్తుతం ఉన్న 4.2 మిలియన్ టన్నుల నుంచి 2030 నాటికి 8.5–9 మిలియన్ టన్నులకు చేర్చాలన్నది ప్రణాళిక అని పేర్కొన్నారు. ఒక ప్రాజెక్టు సొంతంగా, మరొకటి భాగస్వామ్యంలో నెలకొల్పనున్నట్లు తెలిపారు.

మళ్లీ 'ప్లస్'లోకి.. ఎగుమతులు

- అక్టోబర్‌లో 6.21 శాతం అప్
- విలువలో 33.57 బిలియన్ డాలర్లు
- 10 నెలల తర్వాత దిగుమతులూ పైకి

న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు అక్టోబర్‌లో (2022 ఇదే నెలతో పోల్చి) 6.21 శాతం పెరిగాయి. విలువలో 33.57 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, ఉక్రెయిన్ యుద్ధం, ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం సవాళ్లు, కఠిన ద్రవ్య పరిస్థితుల నేపథ్యంలో 2023 ఫిబ్రవరి నుంచి జూలై వరకూ భారత్ వస్తు ఎగుమతుల్లో అసలు వృద్ధిలేకపోగా క్షీణతలో నడిచాయి. అయితే ఆగస్టులో వృద్ధిలోకి (3.88 శాతం) మారినా, మళ్లీ సెప్టెంబర్‌లో 2.6 శాతం క్షీణించాయి. తాజా సమీక్షా నెల అక్టోబర్‌లో మళ్లీ సానుకూల ఫలితం వెలువడింది. 2023లో ప్రపంచ వాణిజ్యవృద్ధి కేవలం 0.8 శాతంగా ఉంటుందన్న ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిరాశాపూరిత వాతావరణం, భారత్ విషయంలోనూ



స్పష్టంగా కనిపిస్తోంది.

వాణిజ్యలోటు 31.46 బిలియన్ డాలర్లు

ఇక దేశ వస్తు దిగుమతుల విలువ ఎగువబాట పట్టింది. 2022 డిసెంబర్ నుంచి 2023 సెప్టెంబర్ వరకూ వరుసగా 10 నెలల క్షీణతలో ఉన్న దిగుమతుల విలువ అక్టోబర్‌లో 12.3 శాతం పెరిగి 65.03 బిలియన్ డాలర్లకు చేరింది. దీనితో ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్య లోటు సమీక్షా నెల్లో 31.46 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇది కొత్త రికార్డు.

కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

- అక్టోబర్‌లో పసిడి దిగుమతులు 95.5 శాతం పెరిగి 7.23 బిలియన్ డాలర్లకు చేరాయి.
- చమురు దిగుమతుల బిల్లు 8 శాతం ఎగసి 17.66 బిలియన్ డాలర్లుగా ఉంది.
- మొత్తం 30 కీలక రంగాల్లో 22 రంగాల్లో ఎగుమతులు సానుకూల వృద్ధిని నమోదుచేసుకున్నాయి. వీటిలో ముడి ఇనుము, మాంసం, డెయిరీ, పౌల్ట్రీ ఉత్పత్తులు, ఫార్మా, ఎలక్ట్రానిక్ గూడ్స్, కార్పెట్, ప్లాస్టిక్, మెరైన్, ఇంజనీరింగ్ గూడ్స్ ఉన్నాయి.

ఏప్రిల్–అక్టోబర్ మధ్య క్షీణ గణాంకాలే..

ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య భారత్ వస్తు ఎగుమతుల విలువ 7% క్షీణించి 244.89 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. దిగుమతుల విలువ కూడా 8.95% క్షీణించి 391.96 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వెరసి వాణిజ్యలోటు ఈ 7 నెలల్లో 147.07 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక ఈ కాలంలో పసిడి దిగుమతులు 23% పెరిగి 29.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. క్రూడ్ ఆయిల్ దిగుమతుల బిల్లు మాత్రం 18.72% తగ్గి 100 బిలియన్ డాలర్లకు చేరింది.

నెల గరిష్టానికి సూచీలు

- మెప్పించిన ద్రవ్యోల్బణం డేటా
- సెన్సెక్స్ లాభం 742 పాయింట్లు
- 19,650 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: అమెరికా, భారత్‌లో ద్రవ్యోల్బణం దిగిరావడంతో బుధవారం దేశీయ స్టాక్ సూచీలు నెల గరిష్టంపైన ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు, బాండ్లపై రాబడులు తగ్గడంతో పాటు 14 ట్రేడింగ్ సెషన్ల తర్వాత విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టడం కలిసొచ్చాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు రాణించడంతో బుధవారం సెన్సెక్స్ 742 పాయింట్లు పెరిగి 65,676 వద్ద ముగిసింది. నిఫ్టీ 232 పాయింట్లు బలపడి 19,675 వద్ద నిలిచింది. బలిప్రతిపద సెలవు తర్వాత ఉదయం సానుకూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా అదే జోరును కొనసాగించాయి. ట్రేడింగ్‌లో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 814 పాయింట్లు ఎగసి 65,748 వద్ద, నిఫ్టీ 249 పాయింట్లు బలపడి 19,693 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లకు భారీగా డిమాండ్ నెలకొనడంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 1.13%, 0.91% చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.550 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ.610 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్ సూచీ (హాంగ్‌సెంగ్) అత్యధికంగా 4% ర్యాలీ చేసింది. జపాన్ నికాయ్ 2.50%, కొరియా, థాయిలాండ్ సూచీలు 2%, ఇండోనేషియా, సింగపూర్ సూచీలు 1% చొప్పున లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 1% మేర పెరిగాయి. అమెరికా మార్కెట్లు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

'అమెరికా, బ్రిటన్, భారత్‌ల్లో ద్రవ్యోల్బణం దిగిరావడంతో ఫెడరల్ రిజర్వ్‌తో సహా ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపుపై వెనకడుగు వేయొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. అందుకు సంకేతంగా బాండ్లపై రాబడులు తగ్గుముఖం పట్టాయి. పండుగ సీజన్, మెరుగైన కార్పొరేట్ ఫలితాలతో ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే విదేశీ ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడులకు మొగ్గుచూపొచ్చు. ఈ ఏడాది చివరికల్లా నిఫ్టీ తిరిగి 20,000 స్థాయిని అందుకోవచ్చు' అని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

దీపావళి బోనస్ @ రూ.3.29 లక్షల కోట్లు

దలాల్ స్ట్రీట్ ఒక శాతం ర్యాలీ చేసి ఇన్వెస్టర్లకు దీపావళి కానుకగా రూ.3.3 లక్షల కోట్ల బోనస్ ఇచ్చింది. సెన్సెక్స్ 742 పాయింట్లు పెరగడంతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.3.29 లక్షల కోట్లు పెరిగి రూ.325.41 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లలో బజాజ్ ఫైనాన్స్ 2%, ఇండస్ఇండ్ 1%, పవర్‌గ్రిడ్ 1% మాత్రమే నష్టపోయాయి.



అదరగొట్టిన ఆస్క్ ఆటోమోటివ్ లిస్టింగ్

ఆస్క్ ఆటోమోటివ్ లిస్టింగ్‌లో అదరగొట్టింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.282)తో పోలిస్తే 8% ప్రీమియంతో రూ.305 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 12 శాతానికి పైగా ర్యాలీ చేసి రూ.317 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 10% లాభపడి రూ.310 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,115 కోట్లుగా నమోదైంది.

రూపాయి రికవరీ

జీవితకాల కనిష్ట స్థాయిల నుంచి రూపాయి రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో 24 పైసలు బలపడి 83.09 స్థిరపడింది. అంతర్జాతీయంగా డాలర్ విలువ రెండేళ్ల కనిష్టాన్ని తాకడం దేశీయ కరెన్సీకి కలిసొచ్చింది. ఈక్విటీ మార్కెట్ల ర్యాలీతో రిస్క్ సామర్థ్యం పెరిగిందని ఫారెక్స్ నిపుణులు తెలిపారు. ఈ సోమవారం 83.33 వద్ద జీవితకాల కనిష్ట స్థాయి వద్ద ముగిసింది. కాగా బలప్రతిపద సందర్భంగా మంగళవారం ఫారెక్స్ మార్కెట్ పనిచేయలేదు.

ప్రశ్నార్థకంగా సహారా రూ. 25 వేల కోట్లు

న్యూఢిల్లీ: సహారా గ్రూప్ అధినేత సుబ్రతో రాయ్ మరణించడంతో సహారా–సెబీ ఖాతాలోని రూ. 25,000 కోట్ల అంశం తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. రెండు గ్రూప్ సంస్థలు సమీకరించిన నిధులను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇన్వెస్టర్లకు వాపసు చేసేందుకు సహారా గ్రూప్ ఈ నిధులను సెబీ ఖాతాల్లో జమ చేసింది. వివరాల్లోకి వెడితే.. సహారా ఇండియా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ (ఎస్ఐఆర్ఈఎల్), సహారా హౌసింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ (ఎస్‌హెచ్ఐసీఎల్) దాదాపు 3 కోట్ల మంది ఇన్వెస్టర్ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా సమీకరించిన నిధులను వాపసు చేయాలంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2011లో ఆదేశించింది. 2012లో సుప్రీం కోర్టు కూడా సెబీ ఉత్తర్వులను సమర్థిస్తూ, 15 శాతం వడ్డీతో ఇన్వెస్టర్ల సొమ్మును తిరిగివ్వాలని ఆదేశాలు జారీ చేసింది. 95 శాతం మందికి రిఫండ్ చేసేశామని సహారా గ్రూప్ తెలియజేసినా, ఆ వాదనలను తోసిపుచ్చి



రూ. 24,000 కోట్లు సెబీ ప్రత్యేక ఖాతాల్లో జమ చేయాలంటూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఖాతాల్లో మొత్తం రూ. 25,000 కోట్లు ఉన్నాయి. ఈ 11 ఏళ్లలో సహారా గ్రూప్‌లో భాగమైన రెండు సంస్థల ఇన్వెస్టర్లకు సెబీ రూ. 138 కోట్లు వాపసు చేసింది. చాలా మటుకు ఇన్వెస్టర్ల వివరాలు సరిగ్గా లేకపోవడం, క్లెయిమ్‌లు రాకపోవడంతో మిగతా నిధులన్నీ సెబీ దగ్గరే ఉన్నాయి. అనారోగ్యంతో సుబ్రతో రాయ్ మరణించిన నేపథ్యంలో పంపిణీ చేయని ఈ సొమ్ము పరిస్థితి ఏమిటనేది చర్చనీయాంశంగా మారినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఈకామ్ రుణాలు ఆపేయండి

బజాజ్ ఫైనాన్స్‌కు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: ఈకామ్, ఇన్‌స్టా ఈఎంఐ కార్డు సాధనాల కింద రుణాల మంజూరు, వితరణ నిలిపివేయాలంటూ బజాజ్ ఫైనాన్స్‌ను ఆర్‌బీఐ ఆదేశించింది. డిజి



టల్ రుణాల మార్గదర్శకాలను పాటించకపోవడమే ఇందుకు కారణం. సదరు లోపాలను సంతృప్తికరమైన విధంగా బజాజ్ ఫైనాన్స్ సరిచేసుకున్నాక ఆంక్షలను పునఃసమీక్షిస్తామని పేర్కొంది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టెస్ట్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఉన్నత విద్యకు ఓఎన్‌జీసీ అండ

స్కాలర్‌షిప్స్

ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ) స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల కోసం ఏటా ఈ సంస్థ ఉపకార వేతనాలు అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జనరల్ విభాగాలకు చెందిన విద్యార్థులు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. 2023–24 విద్యా సంవత్సరానికి ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్పులకు సంబంధించిన సమగ్ర సమాచారం..

- **మొత్తం స్కాలర్‌షిప్పులు:** 2000
- రిజర్వేషన్ల వారీగా ఎస్సీ, ఎస్టీ 1000, ఓబీసీలకు 500, జనరల్ అభ్యర్థులకు 500 చొప్పున కేటాయించారు. అన్ని విభాగాల్లోనూ 50శాతం స్కాలర్‌షిప్పులు మహిళలకు దక్కుతాయి.

అందించే మొత్తం

ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.4000 చొప్పున ఏడాదికి రూ.48,000 స్కాలర్‌షిప్పు అందుతుంది. కోర్సు పూర్తయ్యేంతవరకు ఈ ఆర్థిక ప్రోత్సాహం కొనసాగుతుంది.

అర్హతలు

- ఏదైనా విద్యాసంస్థలో ఫుల్‌టైమ్ కోర్సు రెగ్యులర్ విధానంలో చదువుతుండాలి. ఇంజనీరింగ్ (బీఈ/బీటెక్), ఎంబీబీఎస్ లేదా పీజీ స్థాయిలో జియాలజీ /జియోఫిజిక్స్/ఎంబీఏలో చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇంటర్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. అలాగే ఎమ్మెస్సీ–జియాలజీ/జియోఫిజిక్స్ లేదా ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులైతే డిగ్రీలో 60 శాతం మార్కులు ఉండాలి. తల్లిదండ్రుల వార్షికదాయం రూ.2లక్షలకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలైతే రూ.4.5 లక్షల వరకు అవకాశం ఉంటుంది.
- ఏ ఇతర స్కాలర్‌షిప్పులూ పొందని వారే ఓఎన్‌జీసీ ఉపకార వేతనాలకు అర్హులు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా లబ్ధి పొందేవాళ్లు ఈ స్కాలర్‌షిప్పునకు అర్హులే.
- **వయసు:** 2023, అక్టోబర్ 16 నాటికి 30ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక ఇలా

- ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులకు ఇంటర్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైనవారి వివరాలను ఓఎన్‌జీసీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.
- స్కాలర్‌షిప్ కొనసాగాలంటే ప్రతి సంవత్సరం వార్షిక పరీక్షల్లో కనీసం 50శాతం మార్కులు సాధించడం తప్పనిసరి. అంతకంటే తక్కువ మార్కులు పొందితే ఆ తర్వాత విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ అందదు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 30, 2023
- **వెబ్‌సైట్:** https://ongcscholar.org

డీఆర్‌డీఓలో సైంటిస్ట్ కొలువులు

జాబ్స్ ఇన్ఫో

న్యూఢిల్లీలోని భారత రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో).. పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా మొత్తం 51 సైంటిస్ట్ ఎఫ్, ఈ, డీ, సీ పోస్టుల భర్తీకి డీఆర్‌డీఓకి చెందిన రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్ నియామక ప్రక్రియను నిర్వహించనుంది. ఇది ఇంజనీరింగ్ పట్టభద్రులకు చక్కటి అవకాశం. డీఆర్‌డీవో పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక తదితర వివరాలు..

- **మొత్తం పోస్టులు:** 51 (సైంటిస్ట్ (ఎఫ్)–02, సైంటిస్ట్ (ఈ)–14, సైంటిస్ట్ (డి)–08, సైంటిస్ట్ (సీ)–27).
- **విభాగాలు:** నావల్ ఆర్కిటెక్చర్, మెరైన్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్, మెకానికల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ తదితరాలు.
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.అర్హత,ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.
- **వయసు:** సైంటిస్ట్ ఎఫ్, ఈ, డీ పోస్టులకు 50 ఏళ్లకు మించకుండా ఉండాలి. సైంటిస్ట్ పోస్టులకు మాత్రం 40 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక విధానం:** విద్యార్హత, పని అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

వేతనాలు

- సైంటిస్ట్ (ఎఫ్) పోస్టులకు రూ.1,31,000, సైంటిస్ట్ (ఈ) వారికి రూ.1,23,000, సైంటిస్ట్ (డి) రూ.78,800, సైంటిస్ట్ (సీ) రూ.67,700 వేతనంగా చెల్లిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** నవంబర్ 17, 2023
- **వెబ్‌సైట్:** https://www.drdo.gov.in

అధ్యాపక కొలువుకు సిద్ధమా

- ఏపీ యూనివర్సిటీల్లో భారీగా అధ్యాపక ఉద్యోగాలు
- మొత్తం 3,220 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల
- అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులు
- స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

పీజీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్ ఉత్తీర్ణులకు..ఆంధ్రప్రదేశ్ సర్కారు శుభవార్త! యూనివర్సిటీల్లో అధ్యాపక వృత్తి చేపట్టి భావి తరాలను తీర్చిదిద్దాలని కోరుకునే వారికి వేల సంఖ్యలో కొలువులు!! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో మొత్తం 3,220 అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఏపీలోని యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి మార్గాలు..

మొత్తం 3,220 పోస్టులు

రాష్ట్రంలోని 18 ప్రభుత్వ యూనివర్సిటీల్లో మొత్తం 3,220 అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ప్రొఫెసర్ పోస్టులు 418, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 801, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 2,001 ఉన్నాయి. అధ్యాపక వృత్తిలో అడుగుపెట్టేందుకు అవసరమైన పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, యూజీసీ నెట్, యూజీసీ సీఎస్ఐఆర్ నెట్, స్లెట్/సెట్ వంటి అర్హతలు సాధించిన అభ్యర్థులకు తాజా నోటిఫికేషన్ సువర్ణావకాశమని చెప్పొచ్చు.

అర్హతలు

- **అసిస్టెంట్ ప్రొఫెసర్:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ /ఎంఫిల్/పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు నెట్ లేదా ఏపీ స్లెట్/సెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **అసోసియేట్ ప్రొఫెసర్:** సంబంధిత సబ్జెక్ట్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పీజీలో 55 శాతం మార్కులు సాధించాలి. అకడమిక్/రీసెర్చ్ స్థాయిలో యూనివర్సిటీ/కళాశాల/ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్స్/ఇండస్ట్రీలో 8ఏళ్ల అనుభవం తప్పనిసరి. నిర్దేశిత జర్నల్స్‌లో కనీసం ఏడు పబ్లికేషన్స్ ప్రచురితమై ఉండాలి.
- **ప్రొఫెసర్:** పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు 10 రీసెర్చ్ పబ్లికేషన్స్ ప్రచురితమై ఉండాలి. యూనివర్సిటీ/కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్/అసోసియేట్ ప్రొఫెసర్/ప్రొఫెసర్ హోదాలో పదేళ్ల టీచింగ్ అనుభవం లేదా యూనివర్సిటీ/జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్స్‌లో పదేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి.
- రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలకు అర్హత మార్కుల్లో అయిదు శాతం చొప్పున సడలింపు ఉంటుంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు స్క్రీనింగ్ టెస్ట్

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ముందుగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికోసం అభ్యర్థులు ఒకే దరఖాస్తుతో అన్ని యూనివర్సిటీల్లోని పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా తమ అర్హతలకు అనుగుణంగా సరితూగే అన్ని పేపర్లకు పోటీ పడొచ్చు. ఇలా 18 యూనివర్సిటీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఒకే సమయంలో సన్నద్ధత పొందొచ్చు.

స్క్రీనింగ్ టెస్ట్.. 450 మార్కులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం తొలిదశలో.. కంప్యూటర్ బేస్డ్ విధానంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్‌పై 150 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 450 మార్కులకు పరీక్ష జరుగుతుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

తదుపరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ

- స్క్రీనింగ్ టెస్ట్‌లో నిర్దేశిత మార్కులు పొందిన వారికి తదుపరి దశలో 100 మార్కులకు 45 నిమిషాల వ్యవధిలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. రిజర్వేషన్ కేటగిరీని అనుసరించి ఒక్కో పోస్ట్‌కు నలుగురిని చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. మొత్తం 100 మార్కులకు జరిగే ఇంటర్వ్యూను రెండు విభాగాలుగా నిర్వహిస్తారు.
- ఇంటర్వ్యూలో విభాగం–1కు 40 మార్కులు; విభాగం–2కు 60 మార్కులు ఉంటాయి. విభాగం–1లో లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్‌కు 25మార్కులు; ఇంటర్ డిసిప్లినరీ అవేర్‌నెస్, క్రిటికల్ థింకింగ్, పర్సనాలిటీ తదితర అంశాలకు 15 మార్కులు కేటాయిస్తారు.
- విభాగం–2లో బోధన పద్ధతులు, పరిశోధన దృక్పథంపై 60 మార్కులకు మౌఖిక పరీక్ష ఉంటుంది. ఇందులో డొమైన్ నాలెడ్జ్, టెక్నాలజీ ఆధారిత లెర్నింగ్‌కు 35 మార్కులు; పరిశోధన సామర్థ్యం, భవిష్యత్తు ప్రణాళికలు అంశానికి 25 మార్కులు కేటాయిస్తారు.

ఒప్పంద ఫ్యాకల్టీకి వెయిటేజీ

పర్సనల్ ఇంటర్వ్యూ తర్వాత తుది విజేతలను నిర్ణయించే క్రమంలో ఇప్పటికే ఉన్నత విద్యా సంస్థల్లో కాంట్రాక్ట్ విధానంలో ఫ్యాకల్టీగా పని చేస్తున్న వారికి వెయిటేజీ కల్పిస్తారు. వారు పని చేసిన కాలాన్ని అనుసరించి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్ఠంగా పది మార్కులను ఒప్పంద అధ్యాపకులకు కేటాయిస్తారు.

అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులు.. భర్తీ ఇలా

- అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి యూనివర్సిటీల స్థాయిలో ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఆయా పోస్టులకు వచ్చిన దరఖాస్తులు, అందుబాటులో ఉన్న ఖాళీల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని, రిజర్వేషన్లను అనుసరించి ఒక్కో పోస్ట్‌కు నలుగురి చొప్పున ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు.
- అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేసే క్రమంలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని వాటికి నిర్దిష్ట వెయిటేజీ పాయింట్లు కేటాయిస్తారు. అకడమిక్ స్కోర్‌కు 80 పాయింట్లు, రీసెర్చ్ పబ్లికేషన్స్‌కు 10 పాయింట్లు, టీచింగ్/పోస్ట్ డాక్టోరల్ అనుభవానికి 10 పాయింట్లు చొప్పున కేటాయిస్తారు. అకడమిక్ స్కోర్‌లో భాగంగా గ్రాడ్యుయేషన్ నుంచి పీహెచ్‌డీ వరకు పొందిన ఉత్తీర్ణత శాతాన్ని, అదే విధంగా నెట్–జేఆర్ఎఫ్, నెట్, స్లెట్/సెట్, అకడమిక్ అవార్డ్‌లను పరిగణనలోకి తీసుకుంటారు.



ఏపీ ప్రభుత్వ ఉద్యోగాలు

తుది ఎంపికలోనూ వెయిటేజీ విధానం

ఆయా పోస్టులకు నియామకాలను ఖరారు చేసే క్రమంలో తుది జాబితా రూపకల్పనలోనూ వెయిటేజీ విధానం అనుసరిస్తారు.అకడమిక్/రీసెర్చ్ స్కోర్‌కు, ఇంటర్వ్యూ స్కోర్‌కు 50 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి తుది ఎంపిక చేస్తారు.

భారీగా వేతనాలు

- **అసిస్టెంట్ ప్రొఫెసర్:** పే లెవల్–10: వేతన శ్రేణి రూ.57,700–రూ.1,82,400
- **అసోసియేట్ ప్రొఫెసర్:** పే లెవల్–13ఎ: వేతన శ్రేణి రూ.1,31,400–రూ.2,17, 100.
- **ప్రొఫెసర్:** పే లెవల్–14ఎ: వేతన శ్రేణి: రూ.1,44,200–రూ.2,18,200.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 20, 2023.
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రింట్ ఔట్‌ను పోస్ట్ ద్వారా పంపేందుకు చివరి తేదీ: నవంబర్ 27,2023.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి: నవంబర్ 30,2023.
- అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ: డిసెంబర్ 7,2023.
- స్క్రీనింగ్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా వెల్లడి: డిసెంబర్ 8, 2023.
- అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 20, 2023.
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రింట్ ఔట్స్‌ను పోస్ట్ ద్వారా పంపేందుకు చివరి తేదీ: నవంబర్ 27, 2023.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://recruitments.universities.ap.gov.in/Masters/Home.aspx

ప్రిపరేషన్ ఇలా

అసిస్టెంట్ ప్రొఫెసర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు

ఈ పోస్టులకు తొలి దశలో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో రాణించేందుకు అభ్యర్థులు పీజీ స్థాయి పుస్తకాలను అభ్యసనం చేయాలి. అదే విధంగా ఆయా అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో చదవడం కూడా మేలు చేస్తుంది. దీంతోపాటు.. యూజీసీ నెట్, సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ తదితర పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి. పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేసే క్రమంలో ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించడం, వాటికి సమకాలీన అంశాలను జోడిస్తూ చదవడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

ఇంటర్వ్యూలో రాణించేలా

ఎంపిక ప్రక్రియ తుది దశ ఇంటర్వ్యూలో విజయానికి అభ్యర్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ముఖ్యంగా లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్‌లో ఆయా అంశాలను వివరణాత్మకంగా విశ్లేషించడంపై పట్టు సాధించాలి. యూనివర్సిటీ స్థాయిలో...ఇటీవల కాలంలో బోధన పద్ధతుల్లో వస్తున్న మార్పులు, టెక్నాలజీలను తెలుసుకోవాలి. రీసెర్చ్ కాంపిటెన్సీలో నిర్దేశిత అంశాలకు సంబంధించి సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి అవసరమైన పరిశోధన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి. తమ సబ్జెక్ట్‌కు సంబంధించి సమకాలీన పరిశోధనలు, ఆవిష్కరణలపై పట్టు సాధించాలి.

క్లుప్తంగా...

పీజీ మెడికల్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్, డెంటల్ కోర్సుల్లో కన్వీనర్, యాజమాన్య కోటా భర్తీ అవ్వకుండా మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాల కోసం స్పెషల్ స్ట్రే రౌండ్ కౌన్సెలింగ్‌కు బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఉదయం 9 గంటల నుంచి ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాడానికి అవకాశం కల్పించారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో విభాగాల వారీగా నోటిఫికేషన్ వివరాలను అందుబాటులో ఉంచారు.

75 శాతం హాజరు తప్పనిసరి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో ఫ్యాకల్టీ హాజరు 75%కి పైగా తప్పనిసరిగా ఉండేలా అన్ని కళాశాలలు, ఆస్పత్రుల ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్‌లు పర్యవేక్షించాలని డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ నరసింహం బుధవారం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం ఫ్యాకల్టీ హాజరు తప్పనిసరిగా ఉండాలన్నారు. హాజరు పర్యవేక్షణ కోసం వైద్య కళాశాలల వైస్ ప్రిన్సిపల్స్(అకడమిక్) వ్యవహరించాలని సూచించారు. అదే విధంగా రోగుల సేవలకు అంతరాయం కలగకుండా క్లినికల్ విభాగాల హెచ్‌వోడీలు తమ పరిధిలోని వైద్యులకు సెలవులు మంజూరు చేసేటప్పుడు సూపరింటెండెంట్‌ల అనుమతి పొందాలని ఆదేశించారు.

అంబేడ్కర్ వర్సిటీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో 2017కు ముందు చేరిన విద్యార్థుల పరీక్షల ఫీజు స్పెల్–2 నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ విషయాన్ని అధ్యయన కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్ బుధవారం తెలిపారు. పరీక్ష ఫీజును ఏపీఆన్‌లైన్‌లో ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 18లోపు రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 23లోపు ఫీజు చెల్లించవచ్చు. పరీక్ష ఫీజు చెల్లించిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 9–12వ తేదీ వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 16–21వ తేదీ వరకు తృతీయ సంవత్సరం విద్యార్థులకు డిసెంబర్ 9–14 వరకు పరీక్షలు జరుగుతాయి.

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా నాగరాజు



సాక్షి, అమరావతి: రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ గ్రామానికి చెందిన తిరుమాని నాగరాజును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం జీవో జారీచేశారు. ఆయన పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీని ఓడించకుంటే దేశానికి పెను ముప్పు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 2024 ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని కూల్చకుంటే దేశానికే పెను ప్రమాదం పొంచి ఉందని, దేశ ప్రజలంతా ఏకమై మోదీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన ప్రజా రక్షణ భేరి మహా ప్రదర్శన, భారీ బహిరంగ సభ కార్యక్రమాలు బుధవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఎర్ర సైన్యం తరలివచ్చింది. ముందుగా బీఆర్టీఎస్ రోడ్డు నుంచి ప్రారంభమైన మహా ప్రదర్శన గవర్నమెంట్ ప్రెస్, బుడమేరు వంతెన మీదుగా సింగ్‌నగర్ ఫ్లైఓవర్, మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియానికి చేరుకుంది. రెడ్‌క్రాస్ ధరించిన యువతీ యువకులు ప్రదర్శనకు ముందు కవాతు నిర్వహించారు. ప్రజా నాట్య మండలి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సభలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి ఐదేళ్ల పాటు స్పెషల్ స్టేటస్ ఇస్తామని మోసం చేస్తే, బీజేపీ ప్రభుత్వం పదేళ్లు ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా వాగ్దానాలిచ్చి నేటి వరకూ దానిని అమలుచేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. ప్రధాని హోదాలో ఉన్న మోదీ తెలంగాణలో జరిగిన ఎన్నికల సభలో వాగ్దానాలు ఇవ్వడం ఎన్నికల నిబంధనలకు పూర్తి విరుద్ధమని, దీనిపై ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంగ్లిష్ మీడియం వల్ల ప్రయోజనం లేదు : బీవీ రాఘవులు

సమాజంలో 99 శాతం మంది ప్రజలకు ఇంగ్లిష్ మీడియం అవసరం లేదని, కేవలం ఆ ఒక్క శాతం మందికి మాత్రమే అమెరికా వంటి దేశాలకు వెళ్లేందుకు ఇంగ్లిష్ కావాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు చెప్పారు. తెలుగులో చదువు చెప్పలేనోళ్లు ఇంగ్లిష్‌లో ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఇంగ్లిష్ మీడియం వల్ల ఎవరికీ అంత ప్రయోజనం లేదన్నారు.

చేటుతెచ్చే పోస్టులొద్దు



సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు పెడితే పట్టుబడ్డట్టే

సాక్షి, అమరావతి : ఎవరిపైనైనా అసభ్యకర పదజాలంతో, దూషణలతో లేదా కించపరిచే చిత్రాలు, మీమ్స్, ఇతర విధాలుగా సోషల్ మీడియాలో పోస్టు పెడితే అడ్డంగా బుక్కయినట్టే. సొంత ఐడీ అయినా, ఫేక్ ఐడీ అయినా ఇలాంటి పోస్టులు పెట్టిన వారిని రాష్ట్ర సీఐడీ ఇట్టే పట్టేస్తుంది. ఇందుకు తగ్గ అధునాతన పరిజ్ఞానాన్ని ఇప్పటికే సీఐడీ అంది పుచ్చుకుంది. దాని ఆధారంగా సోషల్ మీడియా వేధింపులకు కళ్లెం వేసేందుకు పటిష్ట కార్యాచరణకు ఉపక్రమించింది. ప్రధానంగా ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ సోషల్ మీడియాలో రాజకీయ పార్టీ అనుబంధ సోషల్ మీడియా విభాగాలు ప్రత్యర్థులను దూషిస్తూ, వేధిస్తూ పోస్టులు పెట్టే అవకాశాలున్నందున వీటిపై గట్టి నిఘా పెట్టింది. ఈ పోస్టులు పెట్టే వారిని గుర్తించి, చర్యలు తీసుకోవడానికి ప్రత్యేకంగా సోషల్ మీడియా మానిటరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం నిత్యం సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను వడపోసి, అసభ్యకర పోస్టులపై కఠిన చర్యలు చేపడుతోంది. ఇప్పుడీ విభాగాన్ని మరింత పటిష్టం చేసి, అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై చర్యలను వేగవంతం చేయనుంది.

100 మందికి పైగా నిపుణులు

సీఐడీ కేంద్ర కార్యాలయంలో సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. అందులో సోషల్ మీడియా, ఆన్‌లైన్, సైబర్ వ్యవహారాలపై నైపుణ్యం ఉన్న ఇన్‌స్పెక్టర్లు, ఎంపిక చేసిన కానిస్టేబుళ్లతో ఈ విభాగం క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ఇప్పుడీ విభాగంలో మరో 25 మంది నిపుణులైన అధికారులను నియమించనున్నారు. దాంతో పాటు జిల్లాల్లో పని చేస్తున్న 75 మంది నిపుణులైన పోలీసు అధికారులు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ప్రత్యేకంగా ఎంపిక చేశారు. దీంతో 100 మందికి పైగా నిపుణులతో పటిష్ట విభాగం అందుబాటులోకి వస్తోంది. ఈ మేరకు మౌలిక వసతులు, ఇతర అంశాలతో కూడిన నివేదికకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.

నిరంతర నిఘా..

సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా నిత్యం వివిధ సోషల్ మీడియా ఖాతాలను సీఐడీ పరిశీలిస్తోంది. అన్ని రకాల సోషల్ మీడియా పోస్టులను రోజూ కాచి వడపోస్తోంది. అసభ్యకర, వేధింపులకు పాల్పడే, వైషమ్యాలు రెచ్చగొట్టే, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులను గుర్తించి, వాటిని పెట్టిన వారిపై వెంటనే కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. అందుకోసం సోషల్ మీడియా సంస్థల ప్రధాన కార్యాలయాలను అనుసంధానిస్తూ ప్రత్యేక వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చింది. అసభ్యకర పోస్టులను వెంటనే తొలగిస్తోంది. అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తోంది. విదేశాల నుంచి అసభ్యకర పోస్టులు పెడుతూ రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నవారిని కూడా ఉపేక్షించడంలేదు. వారిపైనా చర్యల కోసం సంబంధిత దేశాల రాయబార కార్యాలయాలను సంప్రదించి వేగంగా దర్యాప్తు చేస్తోంది. అవసరమైతే లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేస్తోంది. అసభ్యకర పోస్టులు పెడుతున్నవారిపై సైబర్ బుల్లీయింగ్ షీట్లు తెరుస్తోంది. న్యాయస్థానాల ద్వారా తగిన శిక్షలు పడేలా పటిష్టంగా, వేగంగా దర్యాప్తు చేస్తోంది. పదే పదే కుత్రపూరితంగా సోషల్ మీడియా వేధింపులకు పాల్పడే వారి ఆస్తులు అటాచ్ చేసేందుకు కూడా నిర్ణయించింది. ప్రధానంగా ఏడాది నుంచి సీఐడీ దూకుడు బాగా పెంచింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై సీఐడీ కఠిన చర్యలు చేపట్టింది.

ఆ గణాంకాలు ఇలా ఉన్నాయి...

- 2022లో తొలగించిన అసభ్యకర సోషల్ మీడియా పోస్టులు: 1,450
- 2023లో ఇప్పటివరకు తొలగించిన అసభ్యకర సోషల్ మీడియా పోస్టులు: 2,170
- నిత్యం పరిశీలిస్తున్న సందేహాస్పద సోషల్ మీడియా ఖాతాలు: 2000
- అసభ్యకర పోస్టులు పెడుతున్నారని గుర్తించిన సోషల్ మీడియా ఖాతాలు: 405
- ఇప్పటివరకు తెరిచిన సైబర్ బుల్లీయింగ్ షీట్లు: 2,995
- విదేశాల నుంచి సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యల కోసం ఆయా దేశాలతో సంప్రదించిన కేసులు: 45
- జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులు: 5

తీవ్రం కానున్న వాయుగుండం

- విశాఖకు 420 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం
- రేపటికల్లా ఒడిశా తీరానికి చేరుకునే అవకాశం
- నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారింది. ఇది బుధవారం రాత్రి విశాఖపట్నానికి ఆగ్నేయంగా 420 కిలోమీటర్లు, ఒడిశాలోని పారాదీప్‌కు దక్షిణ ఆగ్నేయంగా 550 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం ఉత్తరదిశగా కదులుతూ గురువారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. అనంతరం ఇది దిశ మార్చుకుని ఉత్తర ఈశాన్యదిశగా వాయవ్య బంగాళాఖాతం వైపు పయనిస్తూ గురువారం ఉదయానికి ఒడిశా తీరానికి, 18వ తేదీ ఉదయానికి పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకుంటుందని భారత వాతావరణశాఖ (ఐఎండీ) వివరించింది. మరోవైపు ఉత్తర శ్రీలంక పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం, అక్కడినుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నాయి. వీటి ఫలితంగా రెండురోజులు కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో సముద్రం అలజడిగా ఉన్నందున మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

ఆదివాసీల సంక్షేమానికి విశేష కృషి

- ఏపీలో గిరిజనులకు అభివృద్ధి ఫలాలు
- 1.54 లక్షల మందికి అటవీ భూముల పట్టాలు



వికసిత్ భారత్ యాత్రను ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, పాడేరు: దేశవ్యాప్తంగా 115 జిల్లాల్లో గల ఆదివాసీల సంక్షేమం భారత ప్రభుత్వ లక్ష్యమని, ఏపీలోని గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. గిరిజన స్వాతంత్య్ర సమరయోధుడు భగవాన్ బిర్సాముండా 149వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం చేపట్టిన జన్ జాతీయ గౌరవ్ దివస్–2023, వికసిత్ భారత్ సంకల్ప యాత్రను అరకులోయలో బుధవారం గవ ర్నర్ అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అరకు లోయలోని రవ్వలుగుడ క్రీడా మైదానంలో గిరిజనులు, విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ముందుగా భగవాన్ బిర్సాముండాతో పాటు అనేక మంది గిరిజన స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సును గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవాన్ బిర్సాముండా బ్రిటిష్ దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా తోటి గిరిజన జాతి కోసం పోరాడి ప్రాణాలు అర్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1.54 లక్షల మంది గిరిజనులకు 3.23 లక్షల అటవీ భూములపై సర్వహక్కులు కల్పించి, పట్టాలు పంపిణీ చేయడం, మారుమూల గిరిజన గ్రామాలలో 1,087 కిలోమీటర్ల రోడ్లు నిర్మించడం గొప్ప విషయాలన్నారు. గిరిజన చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ మంజూరు చేసిన 28 ఏకలవ్య పాఠశాలల్లో 24 పాఠశాలలు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశారని చెప్పారు.

గిరిజనాభివృద్ధికి చర్యలు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. అటవీ భూములకు హక్కు పత్రాలు పొందిన గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా రూ.13,500 ఆర్థికసాయం అందజేస్తూ వ్యవసాయాభివృద్ధికి చర్యలు తీసుకుందన్నారు. గిరిజనులకు ప్రత్యేక జిల్లాలను ఏర్పాటు చేసిందని, రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తోందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులపై 'సంగం డెయిరీ' దాడి

- బోనస్ రూ.50 లక్షలు ఇవ్వటంలేదని అడిగేందుకు వచ్చిన రైతులు
- వారు ప్రాంగణంలోకి వెళ్లకముందే కిరాయి సిబ్బంది దాడి
- కర్రలు, రాడ్లు, రాళ్ల దాడిలో 15 మంది ఏలూరు జిల్లా రైతులకు గాయాలు
- 5 కార్లు ధ్వంసం



సీఐకు ఫిర్యాదు చేస్తున్న రంగపాలెం, వేములపల్లి సర్పంచ్‌లు, దెబ్బలు తగిలిన రైతులు

చేబ్రోలు: ఒప్పందం ప్రకారం తమకు ఇవ్వాల్సిన బోనస్ డబ్బులు ఇవ్వడంలేదనే విషయాన్ని సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని వచ్చిన రైతులపై డెయిరీ కిరాయి సిబ్బంది దాడిచేశారు. కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతుల మీద ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. రైతులు వాహనాలు దిగుతుండగానే డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర అనుచరులు బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని సంగం డెయిరీ వద్ద బుధవారం జరిగిన ఈ దాడిలో ఏలూరు జిల్లాకు చెందిన 15 మంది రైతులు గాయపడ్డారు. వీరిలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం వేములపల్లి, రంగపాలెం గ్రామాల్లో ద్వారకామాయి డెయిరీ పాయింట్‌తో సంగం డెయిరీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం పాడి రైతులకు రూ.50 లక్షల వరకు బోనస్ చెల్లించాల్సి ఉంది. ఈ మిల్క్ సెంటర్ నిర్వాహకులైన వేములపల్లి సర్పంచి ముసులూరి రాము, నర్సనపాలెం సర్పంచి కూరపాటి వెంకటేశ్వరరావు తమ పరిధిలో పాలు సేకరించి సంగం డెయిరీకి సరఫరా చేశారు. ఒప్పందంలో భాగంగా 14 శాతం బోనస్ ఇస్తామన్న డెయిరీ అధికారులు తరువాత మాట మార్చి నాలుగు శాతం మాత్రమే ఇస్తామనడంతో వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అక్కడ పోలీసు స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు కూడా చేశారు. గుడ్ ఫార్మర్స్‌గా గుర్తించి న్యాయం చేస్తామని మిల్క్ సెంటర్ నిర్వాహకులకు, రైతులకు వేములపల్లిలో సంగం డెయిరీ జీఎం కొల్లి ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆ హామీని కూడా నెరవేర్చలేదు. బోనస్ గురించి అడిగితే బోనస్ ఇవ్వడానికి పాలకవర్గం తీర్మానం చేయాల్సి ఉందని, నాలుగు శాతం కన్నా ఎక్కువ ఇవ్వడం కుదరదని చెప్పారు. ఈ సమస్యను సంగం డెయిరీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని అక్కడి రైతులు నిర్ణయించారు. దీనిపై వేములపల్లి, రంగపాలెం గ్రామ సర్పంచులు ఎం.రాము, వెంకటేశ్వరరావుతోపాటు సుమారు 30 మంది రైతులు బుధవారం ఆరు వాహనాల్లో సంగం డెయిరీకి వచ్చారు. యాజమాన్యం రైతులకు న్యాయం చేయాలనే నినాదంతో కూడిన ప్లకార్డుల్ని వాహనాల్లో తీసుకొచ్చారు. రైతుల రాకను పసిగట్టిన సంగం డెయిరీ సిబ్బంది, గూండాలు యాజమాన్యం ఆదేశాలతో దౌర్జన్యానికి దిగారు. సుమారు వందమంది కర్రలు, రాడ్లు, రాళ్లతో రైతులపై దాడిచేశారు. రైతులు సంగం డెయిరీ ప్రాంగణంలోకి వెళ్లకముందే.. వారు కారు దిగతుండగానే బూతులు తిడుతూ ఒక్కసారిగా మీదపడి కొట్టారు. భయాందోళనలతో పరారవుతున్న రైతులను వెంటపడి మరీ కొట్టి గాయపరిచారు. రైతులు వచ్చిన వాటిలో ఐదుకార్లను ధ్వంసం చేశారు. ఈ దాడిలో 15 మంది రైతులు గాయపడ్డారు. కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. బాధితులు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరకు పొన్నూరు రూరల్ సీఐ ఎం.రాంబాబు, ఎస్ఐ ఆనంద్ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన రైతులు వీరే..

సంగం డెయిరీ కిరాయి సిబ్బంది దాడిలో రంగపాలెం, వేములపల్లి గ్రామాలకు చెందిన పాడిరైతులు ముసులూరి రాము, కూరపాటి వెంకటేశ్వరరావు, యెనుముల మణికంఠ, బి.దుర్గాకుమార్, కొమ్మిన రాములు, తాళ్లూరి రాజు, బోరపంచి కుమార్, మక్కా సత్యనారాయణ, కాట్రు రాయప్ప, చిలకలపూడి కాలీషా, తాడేపల్లి రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి.

పురందేశ్వరి జాతి నేతగా ఎందుకు మారారో!

- మరిది చంద్రబాబు కళ్లల్లో ఆనందం కోసమే ఆమె విన్యాసాలు
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ఎద్దేవా



సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి జాతీయ నేతగా ఉంటూ.. జాతి నేతగా ఎందుకు మారారోనని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఎద్దేవా చేశారు. జాతినేతగా మారిన పురందేశ్వరి చేస్తున్న విన్యాసాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆమె సొంత ఊరు కారంచేడులో బీజేపీ తరఫున గత ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎందుకు పోటీ పెట్టలేదని ప్రశ్నించారు. సొంత మండలంలోనూ ఎందుకు పోటీకి దిగలేదన్నారు. బీజేపీలోని చిన్న చిన్న నేతలు కూడా నిజాయతీగా అన్నిచోట్లా పోటీ చేస్తే.. పురందేశ్వరి మాత్రం ఆ పని ఎందుకు చేయలేదని నిలదీశారు. బీజేపీ కార్యకర్తల్లో ఎవరైనా ఇదే ప్రశ్న అడిగితే.. తన మరిది చంద్రబాబు కళ్లల్లో ఆనందం కోసం అని చెబుతారా అన్నారు.

ఆ సలహా ఇచ్చింది మీరేనట కదా!

'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మేలు కలిగించేందుకు టీడీపీ పోటీ చేయొద్దని సలహా ఇచ్చింది మీరేనట కదా. మీ అందరి ఆస్తులు, నివాసాలు ఉన్న తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించుకుంటే మీరు అధికారంలో ఉన్నట్టే అని అనుకుంటున్నారట కదా. ఎన్ని విన్యాసాలు చేస్తారమ్మా' అని విజయసాయిరెడ్డి ఆ ప్రకటనలో ప్రశ్నించారు. బీజేపీ గురించి కాకుండా.. సామాజికవర్గ ప్రయోజనాల కోసం పురందేశ్వరి ఆరాటపడుతున్నారని ధ్వజమెత్తారు. 'జాతి నేత చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చాక రాత్రివేళ నిద్రపోకుండా 14 గంటలు కారులో కూర్చుని ప్రయాణించారు. అరెస్టుకు ముందు రోజంతా బహిరంగ సభల్లో పాల్గొని.. తాను ముసలోడిని కాదని.. వయసు తనకు ఒక నంబర్ మాత్రమే అని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు మాత్రం బెయిల్ కోసం 14 రకాల జబ్బులు ఉన్నాయని చెబుతున్నారు' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. స్కిల్ స్కామ్ నిధుల్లో రూ.27 కోట్లు హవాలా మార్గంలో టీడీపీ ఖాతాలోకి మళ్లించినట్టు సీఐడీ గుర్తించి టీడీపీ ప్రధాన కార్యాలయానికి నోటీసులు జారీ చేసిందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఇతర కుంభకోణాల నిధులు కూడా చంద్రబాబు పార్టీ ఖాతాలోకి మళ్లించారని వివరించారు.

కొవ్వూరు ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

- యువకుడి ఆత్మహత్యకు కారణమయ్యారనే ఆరోపణల నేపథ్యంలో డీఐజీ నిర్ణయం
- ఫ్లెక్సీ వివాదంలో స్టేషన్‌కు తీసుకెళ్లారనే మనస్తాపంతో పురుగు మందు తాగిన యువకుడు
- చికిత్స పొందుతూ విజయవాడలో మృతి
- దొమ్మేరులో జనసేన, టీడీపీ విధ్వంసం
- అర్ధరాత్రీ కొనసాగుతున్న దాడులు

రాజమహేంద్రవరం (కంబాలచెరువు)/కొవ్వూరు: యువకుడి ఆత్మహత్యకు కారణమయ్యారనే ఆరోపణల నేపథ్యంలో తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు టౌన్ ఎస్ఐ డి.భూషణంపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఏలూరు రేంజి డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్ బుధవారం రాత్రి వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొమ్మేరు గ్రామంలో ఓ ఫ్లెక్సీ చించిన వివాదంపై రెండువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయన్న సమాచారంతో దొమ్మేరు గ్రామానికి చెందిన బొంతా మహేంద్ర (21)ని సోమవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణ నిమిత్తం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టారు. సాయంత్రం 5 గంటల తర్వాత అతడిని బంధువులకు అప్పగించి ఇంటికి పంపించేశారు. ఈ ఘటనతో మనస్తాపం చెందిన మహేంద్ర అదే రోజు రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు, స్నేహితులు హుటాహుటిన అతడిని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం చాగల్లులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి.. పరిస్థితి విషమంగా మారడంతో మంగళవారం రాత్రి విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మహేంద్ర విజయవాడలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

ఘటనపై పోలీస్ శాఖ సీరియస్

యువకుడు మృతి చెందిన ఘటనను జిల్లా ఎస్పీ పి.జగదీష్ తీవ్రంగా పరిగణించారు. యువకుడు మహేంద్రపై ఎలాంటి కేసు నమోదు చేయకుండా, ఉన్నతాధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి విచారణ లేకుండా సాయంత్రం వరకు నిర్బంధించడంపై ఎస్పీ లోతైన విచారణ చేపట్టారు. ఎస్ఐ భూషణంపై వ్యవహార శైలిపై ఏలూరు రేంజి డీఐజీకి నివేదిక పంపారు. ఈ క్రమంలో ఎస్ఐపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ భూషణంను సస్పెండ్ చేశామన్నారు. సరైన నోటీసు అమలు చేయకుండా ఎవరినీ పోలీస్ స్టేషన్‌కు తీసుకు రాకూడదని, అలా చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

దొమ్మేరులో అర్ధరాత్రి హైటెన్షన్..

బొంత మహేంద్ర మృతితో దొమ్మేరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి హైటెన్షన్ నెలకొంది. యువకుడి బంధువులు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, టీడీపీ నాయకులు, మరికొందరు గ్రామంలో బీభత్సం సృష్టించారు. మహేంద్ర మృతదేహం దొమ్మేరు చేరుకోగానే మెయిన్ రోడ్డుపై కొద్దిసేపు రాస్తారోకో చేశారు. స్థానిక వైసీపీ నేత ముదునూరు నాగరాజు ఇంటిపై దాడి చేశారు. అటువైపు వస్తున్న వైఎస్సార్‌సీపీ నేత, కొవ్వూరు కౌన్సిలర్, రామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర కారుపై రాళ్లు రువ్వి ధ్వంసం చేశారు. మృతదేహాన్ని తీసుకొచ్చిన అంబులెన్స్ పైనా రాళ్లు రువ్వి ధ్వంసం చేశారు. కర్రలు రాళ్లతో వీరంగం సృష్టించడంతో జనం పరుగులు తీశారు. పోలీసుల పైనా జనసేన, టీడీపీ నేతలు దాడి చేశారు. ఈ ఘటనలో జిల్లా అడిషనల్ ఎస్పీ జి వెంకటేశ్వరరావు, మరో అయిదుగురు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం. అర్ధరాత్రి తర్వాత కూడా జనసేన, టీడీపీ నాయకులు, అనుచరుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

తెలంగాణ


ఏపీ హైకోర్టు ఏఎస్‌జీగా నరసింహ శర్మ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేంద్రం తరఫున వాదనలు వినిపించేందుకు అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా సీనియర్ న్యాయవాది బి.నరసింహ శర్మను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో ఏఎస్‌జీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు అదనంగా ఏపీ బాధ్యతలను అప్పగించింది. నవంబర్ 15 నుంచి ఆరు నెలలు లేదా రెగ్యులర్ ఏఎస్‌జీని నియమించే వరకు నరసింహ శర్మ ఆ బాధ్యతల్లో కొనసాగుతారు. 1959, నవంబర్ 22న పుట్టిన శర్మ ఉస్మానియా వర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. ఎల్ఎల్ఎంలో గోల్డ్ మెడల్ కూడా సాధించారు. 1982లో ఏపీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. సివిల్, క్రిమినల్, ట్యాక్సేషన్, సర్వీస్ వ్యాజ్యాల న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను హైకోర్టు గత డిసెంబర్‌లో సీనియర్ న్యాయవాదిగా నియమించింది. ఆదాయపు పన్ను, కేంద్ర పన్నులు, కస్టమ్స్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఈడీ, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో న్యాయవాదిగా పనిచేశారు.

విప్లవాత్మక మార్పులకు 'మౌంటెన్ మోడల్ ఫ్రేమ్ వర్క్'

ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డా. టెడ్రోస్ అధోనమ్

సాక్షి విశాఖపట్నం: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు సాధించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) 'మౌంటెన్ మోడల్ ఫ్రేమ్ వర్క్' రూపొందించి, సంస్కరణలు అమలుచేస్తోందని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ డా.టెడ్రోస్ అధోనమ్ వెల్లడించారు. విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరమ్ రెండో రోజైన బుధవారం పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో డా.టెడ్రోస్ వర్చువల్ విధానంలో పాల్గొని మాట్లాడారు. 2015 తరువాత వైద్యరంగంలో అభివృద్ధి, ఆవిష్కరణ, పరిశోధనలకు కీలకమైన అడుగులు పడ్డాయని, ఇంటర్‌నేషనల్ డెవలప్‌మెంట్ అలియన్స్ (ఐడీఐఏ)తో కలసి సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌ను అవలంబించామని తెలిపారు. వివిధ దేశాల ఆరోగ్య పరిస్థితులు, వారి డిమాండ్లు పరిగణనలోకి తీసుకుని హెల్త్ ఇన్నోవేషన్స్‌పై దృష్టి సారించామని పేర్కొన్నారు. దానికి అనుగుణంగానే 'మౌంటెన్ మోడ్ ఫ్రేమ్ వర్క్'లో విధి విధానాలు రూపొందించి సత్ఫలితాలు సాధిస్తున్నట్లు డా.టెడ్రోస్ వివరించారు. అనంతరం ఫోరమ్‌లో భాగంగా హెల్త్ ఇన్నోవేషన్లని ప్రపంచానికి పరిచయం చేసే అంశాలపై చర్చలు జరిగాయి. ఈ ఫోరమ్‌లో మొత్తం 70 దేశాలకు చెందిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, ప్రముఖ వైద్య పరిశోధన సంస్థల అధ్యక్షులు పాల్గొన్నారు. గురువారంతో ఇన్నోవేషన్ ఫోరం ముగియనుంది.



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న టెడ్రోస్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.